ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ చతుర్దశి రా.10.00 వరకు, అనంతరం చతుర్దశి; నక్షత్రం: పునర్వసు రా. 8.06 వరకు, అనంతరం పుష్యమి; అమృతకాలం: లేదు; వర్జ్యం: ఉ. 8.59 నుండి 10.27 వరకు, తె.3.35 నుండి 5.05 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, తదుపరి రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు;

Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి:56 • సంచిక:289 • మంగళవారం 30 జనవరి 2018 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



జమిలి ఎన్నికలపై చర్చించండి

- ఏకాభిప్రాయానికి రండి
- ట్రిపుల్ తలాఖ్ చట్టం వస్తుందని ఆశిస్తున్నా
- సంయుక్త పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగం

10

పల్లె..గులాబీదే

- కొనసాగుతున్న జైత్రయాత్ర
- పంచాయతీ ఉప ఎన్నికల్లో ... టీఆర్ఎస్ హవా
- మెజారిటీ స్థానాలు కైవసం
- ఎన్నిక ఏదైనా..కారుదే జోరు



కాంగ్రెస్, వామపక్ష కోటలు బద్దలు

- అటు ఉత్తర, ఇటు దక్షిణ 2

తెలంగాణలోనూ గులాబీ రెపరెపలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికారంలోకి వచ్చిన నాటి నుండీ అప్రతిహత విజయాలతో దూసుకు వెళ్తున్న టీఆర్ఎస్.. అదే జైత్రయాత్ర కొనసాగిస్తోంది. ఎన్నిక ఏదైనా.. కారు జోరుగా పరుగెడుతోంది. మెదక్ పార్లమెంట్ ఉప ఎన్నిక నుండి మొదలైన జైత్రయాత్ర సోమవారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగింది. గులాబీ గుబాళించింది. తిరుగులేని ప్రస్థానాన్ని ఘనంగా చాటింది. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల తర్వాత కూడా టీఆర్ఎస్.. వామపక్ష, కాంగ్రెస్ కంచుకోటలు బద్దలు కొడుతూ సంచలన విజయాలు నమోదుచేసింది. ఎన్నిక ఏదైనా.. ఇదే రిపీట్ చేస్తాం అంటూ టిఆర్ఎస్ ఘనంగా చాటగా, ముఖ్యమంత్రి కెసిఆర్ జనరంజక పాలనపై ప్రజలు ఓట్లాతిరేకం వ్యక్తం చేశారని గులాబీశ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 28జిల్లాల్లో పంచాయతీ పోరు జరగ్గా, మెజారిటీ సర్పంచ్ స్థానాల్లో గులాబీ దండయాత్ర సాగింది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కీలక సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికలు పల్లె నాడికి అద్దం పట్టాయని, మొత్తం 23 గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు టిఆర్ఎస్ రికార్డు మెజారిటీతో కైవసం చేసుకోవడం ప్రజలు టిఆర్ఎస్ పట్ల చూపుతున్న ఆదరణకు నిదర్శనమని ముఖ్యనేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నిక.. ఎన్నికకూ టిఆర్ఎస్ సరికొత్త రికార్డులు నమోదుచేస్తోంది. మెదక్ పార్లమెంట్ ఉప ఎన్నికతో మొదలైన విజయయాత్ర.. ఇపుడు పల్లె పోరు దాకా 2వ పేజీలో...



హైదరాబాద్: టీ హబ్‌లో ఇన్నోవేటివ్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఐటీ మంత్రి కేటీఆర్

దేశ ఉత్పత్తుల్లో తెలంగాణ టాప్

- జాతీయ స్థాయిలో 5వ స్థానం • ఐటీ ఉత్పత్తుల్లో అగ్రస్థానం: మంత్రి కేటీఆర్ • యూనివర్శిటీల్లో ఇంక్యుబేటర్లు
- పాఠశాలల నుంచే అన్వేషణలపై విద్యార్థుల్లో ఆసక్తి కల్పించాలి • పర్యావరణహిత కార్యక్రమాలకు ప్రాధాన్యత

3లో




ఇంజనీరింగ్ కాలేజీలకు
ముకుతాడు
30 మూత?

- 30శాతంలోపు సీట్లు భర్తీ అయిన కళాశాలలపై వేటుకు నిర్ణయం
- కోర్సుల రద్దుకూ ప్రతిపాదన
- తరగతులకు గైర్హాజరైనా...పరీక్షల్లో తప్పినా యాజమాన్యాలదే బాధ్యత
- అధ్యాపకుల వివరాలు ఆన్‌లైన్‌లో
- కళాశాలల గుర్తింపు ఇక కఠినం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజ నీరింగ్ కళాశాల యాజమాన్యాలను మరింత కట్టడి చేసేం దుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రైవేట్ రంగంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు పరీ క్షల్లో తప్పినా, తరగతులకు గైర్హాజరైనా అందుకు యాజ మాన్యాలే బాధ్యత వహించేలా నిబంధనలు రూపొం దిస్తోంది. గత మూడేళ్ళలో 30శా తం లోపు సీట్లు భర్తీ అయిన కళాశాలల గుర్తింపు రద్దుచేయాలని కూడా ప్రభుత్వం ప్రతిపా దించినట్టు సమాచారం. కళాశాలల్లో అధ్యాపకులు గా చేరేవారి విద్యార్హత, అనుభవ సర్టిఫికెట్లు నకిలీవని తేలితే అందుకు యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించనుంది. వచ్చే విద్యా సంవత్సరానికి వీలైనన్ని కళా శాలల్లో సీట్లను మాత్రమే భర్తీ చేసేవిధంగా ప్రభుత్వం ప్రణా ళికలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉంది. ఇందులో భాగంగానే కళాశాలలపై ఆకస్మిక దాడు లు నిర్వహించి మౌలిక సదుపాయాలు, వసతి సౌకర్యాలు కల్పించని వాటిపై వేటువేయాలని ప్రభు త్వం ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా కళాశాలలకు అను బంధ గుర్తింపు ఇవ్వకుండా కఠినమైన మార్గదర్శకాలు రూపొందించనున్నారు. ఎటువంటి 3వ పేజీలో...

ఆర్థిక సర్వే ఆనంద గీతిక!



ఆర్థిక సర్వే దేశ ఆర్థికాభివృద్ధి గమనానికి అద్దం పట్టింది. జీఎస్టీ ప్రభావాన్ని మదింపు చేసిన తొలి ఆర్థిక సర్వే ఇది. దాని సానుకూల ప్రభావాన్ని గోరంతలుగా చూపే ప్రయత్నం జరిగింది. అలాగే పెద్ద నోట్ల రద్దు దుష్ఫరిణామాలు బాగా తగ్గాయని తేల్చింది. పన్నుల పరిధి పెరగడం దగ్గర్నుంచి పన్నుల చెల్లింపులు గణనీయంగా పెరిగాయని సూత్రీకరించారు. అలాగే వాస్తవాల పునాదుల మీద అంచనాలు కట్టారనడానికీ దృష్టాంతాలున్నాయి. జీడీపీ వృద్ధి రేటుని అమాంతం ఆకాశంలో చూపే ప్రయత్నం చేయకుండా నిగ్రహం పాటించారు. 7 నుంచి 7.5 శాతానికి చేరితే అంతే చాలునని స్థిరీకరించారు. అంతకన్నా ఎక్కువ ఆశించినా.. విశ్వవ్యాప్తంగా తలెత్తే వివిధ అనివార్య పరిణామాల వల్ల సాధ్యం కాకపోవచ్చునన్న చేదు నిజాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆవాహనం చేసుకున్నట్టు దీన్ని బట్టి అర్థమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అవాంతరాల ఛాయలు కనిపిస్తున్నా భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం అత్యంత వేగంగా పరుగులు పెడుతున్నదని ఆర్థిక సర్వే ధీమాగా చెప్పింది. మొత్తం మీద సానుకూలతలు ఎన్ని ఉన్నాయో ప్రతికూలతలూ అన్నే కనిపిస్తున్నా ఆర్థిక సర్వే మాత్రం వెలుగుల కోణాన్ని ఆవిష్కరించింది. మరో రెండు రోజుల్లో రాబోతున్న కేంద్ర బడ్జెట్ జీఎస్టీ నేపథ్యంలో సరికొత్త రూపంలో రాబోతున్నదన్న సంకేతాలనిచ్చింది.

వివరాలు 8,10,11లో...

వృద్ధికి అటు.. ఇటు..

ఆశాజనకం

- జీడీపీ 2017-18కి 6.75 ఉంటే, 2019నాటికి 7 నుంచి 7.5 శాతానికి చేరవచ్చు
- వ్యవసాయం, ఎయిరిండియా ప్రయివేటీకరణ, బ్యాంకుల ఉద్దీపన
- పరోక్షపన్నుల చెల్లింపుల్లో 50 శాతం జీఎస్టీ పెరుగుదల
- నిర్మాణ, సేవారంగాల్లో భారీగా ఉపాధి పెరుగుదల
- పట్టణీకరణ వల్ల సేద్యరంగంలో పెరిగిన మహిళా పాత్ర
- సంస్కరణల వల్ల సేవారంగంలో 15 శాతం పెరిగిన ఎఫ్‌డీఐలు
- సమ్మిళిత అభివృద్ధికి విద్య, వైద్య రంగాల్లో మరింత దృష్టి
- వాయు కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్రాల సంయుక్త ప్రణాళిక
- పొదుపు కంటే పెట్టుబడుల పెరుగుదల వల్ల వృద్ధి రేటుకు ఊతం
- ద్రవ్యోల్బణం గత ఆరు ఆర్థిక సంవత్సరాల్లో సరాసరిన తక్కువగా నమోదు

నిరాశాజనకం

- కొరియా యుద్ధవాతావరణం, మధ్యప్రాచ్యంలో తిరుగుబాట్లు, చమురు ధరలు
- అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక బుడగల అనూహ్య విస్తరణ, పేలిపోవడం
- బాండ్లు, ఈక్విటీల ఆదాయం పెరుగుతుంటే వడ్డీ రేట్లు పెరిగే ప్రమాదం
- జీతాల పెరుగుదలతో కంపెనీల లాభాల్లో కోత, ద్రవ్యోల్బణంపై ప్రభావం
- ఆస్తుల నికర విలువలు పడిపోతే వృద్ధిరేటు దిగజారుడే
- ఆస్తి విలువ క్షీణతతో పెట్టుబడులు ఉపసంహరణ
- చమురు ధరల పెరుగుదల... వినియోగ వ్యయం తగ్గుదల
- నోట్ల రద్దు, బంగారం ఊగిసలాటతో స్టాక్ మార్కెట్లపై నమ్మకం కోల్పోవడం
- స్టాక్ మార్కెట్లు పతనమైతే ఆర్థిక రంగం అల్లకల్లోలమే
- బలహీన గవర్నెన్స్, అవినీతి, తదితర సామాజిక సవాళ్లు

మల్లన్న సేవలో ఎంపీ కవిత

- తెలంగాణ అభివృద్ధిని కాంక్షించా
- ఇరురాష్ట్రాలు అభివృద్ధి చెందాలి 3






9 గంటలు చాలు..!

నిరంతర విద్యుత్‌పై పెరుగుతున్న ఒత్తిడి

- భూగర్భ జలాలకు ముప్పు
- రైతుల డిమాండ్లు పరిశీలన
- సానుకూల సంకేతాలు?
- ఎస్ఈలకు సీఎస్ ఆదేశం?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగానికి మరింత మేలు చేయాలన్న ప్రభుత్వ ఆలోచన క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులకు దారితీస్తోంది. ఈ ఏడాది జనవరి మొదలుకుని అమల్లోకి వచ్చిన నిరంతర విద్యుత్ సరఫరాపై మిగతా అన్ని రంగాల నుంచి హర్షం వ్యక్తమవుతున్నా, వ్యవసాయ రంగానికి మాత్రం రెండు కోణాల్లో నష్టం జరుగుతోంది. దీంతో 9 గంటలు చాలు మహాప్రభో... అంటూ అన్నదాతలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో రైతు కుటుంబాలపై ఎలాంటి ఆర్థిక భారం లేనప్పటికీ, సరైన నీరు అందని సందర్భాల్లో మోటార్లు కాలిపోతున్నాయి. అదే సమయంలో ఆటో స్టార్లర్లు బిగించిన కారణంగా అవసరానికి మించి నీటిని తోడేస్తున్నాయి. దీంతో భూగర్భ జలమట్టానికి తీరని 3వ పేజీలో...



నల్గొండ జిల్లాలో
జంట హత్యలు

5

- తల, మొండెం వేర్వేరు చోట్ల
- యువతి హత్య, పిల్లకాల్వ పక్కన దహనం



మృతుల ఫైల్‌ఫోటో



మృతులు అపర్ణ, చిన్నారి కార్తికేయి, తల్లి విజయమ్మ

చేసింది సహజీవనం పైగా అనుమానం

ఏకకాలంలో ముగ్గురి హత్య

- చందానగర్‌లో దారుణం
- మొదట భార్యను గోడకేసికొట్టి హత్య
- ఆ తర్వాత ఆమె తల్లి, కూతురి హత్య
- తానే చంపినట్లు భర్త మధు ఒప్పుకోలు
- పోలీస్‌స్టేషన్‌లో లొంగుబాటు 7



నిందితుడు మధు(ఫైల్)



మద్యం మత్తులో సీఐ

కారుతో బీభత్సం

- నాలుగు వాహనాలు ధ్వంసం • ముగ్గురికి గాయాలు • పోలీసుల అదుపులో సీఐ 7

ఉత్తమ్‌వి భ్రమలే!



వనపర్తి జిల్లా చిట్యాలలో వ్యవసాయ మార్కెట్ గోదాములను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

- ఉత్తమ్‌కుమారా... నీ ఒట్టిమాటలు ప్రజలు నమ్మరు
- ప్రాజెక్టులను అడ్డుకుని కేసులు వేస్తున్నది కాంగ్రెస్ నాయకులుకారా..?
- మూడేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాకు 6లక్షల ఎకరాలకు సాగునీరందించాం: మంత్రి హరీశ్

వనపర్తి, ప్రభన్యూస్: కాంగ్రెస్ హయాంలో పది సంవత్సరాల కాలంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వకుండా ఎడారిగా మార్చారని.. తెరాస హయాంలో సీఎం కేసీఆర్ మూడేళ్ల కాలంలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరందించిరైతులకు అండగా నిలిచారని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో పెద్దమందడి బ్రాంచ్ కెనాల్, పైలాన్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో హరీష్‌రావు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 70 సీట్లు వస్తాయని పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన మాటలు వట్టి మాటలేనని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు విత్తనాలకోసం, ఎరువుల అందుబాటులోలేకపోవడం తో మద్దతు ధర దొరక్కపోవడంతో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేసే వారిని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతు పక్షపాతిగా నిరంతరం శ్రమిస్తు రాష్ట్రంలో విత్తనాల కొరత లేకుండా ఎరువుల ఇబ్బంది కలగకుండా, రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పగలు 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని మాయ మాటలు చెప్పి, నిరంతరం 3 గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 90శాతం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేశామని చెబుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాంట్రాక్టుల కోసమే పనిచేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి మంత్రి, ప్రతి ఎమ్మెల్యేకు రోజు ఫోన్ చేస్తు సాగునీటి ప్రాజెక్టుల పురోగాభివృద్ధిపై తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి కృషి వలన భీమా, నెట్టెంపాడు, జూరాల, కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత తెరాస పార్టీకే దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధికి నిరోధకులుగా మారి వేగవంతంగా కొనసాగుతున్న ప్రాజెక్టుల నిర్మాణ పనులను అడ్డుకోవడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు. కోర్టులో వేసి కేసులను విత్‌డ్రా చేసుకుంటే తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతారని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీచైర్మన్ బండారు భాస్కర్, గ్రంథాలయ చైర్మన్ లక్ష్మయ్య, మున్సిపల్ చైర్మన్ రమేష్ గౌడ్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ,నిస్పృహలతోనే శవరాజకీయాలు

కాంగ్రెస్‌పై ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నల్లగొండలో శ్రీనివాస్ హత్యను రాజకీయం చేసే స్ట్రీట్‌పై ట్‌సుస్టేట్‌పై మారేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని, నిరాశా.. నిస్పృహలతో నే శవరాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ పల్లారాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైలా శేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ పూలరవీందర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. నల్లగొండలో జరిగిన మునిసిపల్ చైర్పర్సన్ లక్ష్మి భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి, తమ పార్టీ ఎమ్మెల్యే వీరేశంలకు ఎవరితోనూ వైరం లేదన్నారు. జిల్లాలో అన్ని పార్టీల మధ్య సుహృద్భావం కోరుకునే వారే తప్ప హింసారాజకీయాలను ప్రోత్సహించరన్నారు. ఇప్పటివరకూ నల్లగొండ జిల్లాలో టిఆర్ఎస్ పరంగా ఒక్క వ్యక్తికి కూడా బెదిరింపులు ఎదురుకాలేదన్నారు. ఎమ్మెల్సీ పూలరవీందర్ మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన శ్రీనివాస్ హత్యకు కోమటిరెడ్డి సోదరులు రాజకీయరంగు పులిమి గల్లీ లొల్లిని ఢిల్లీలొల్లి అన్నట్లు అభూతకల్పనలు ప్రచారం చేస్తున్నారన్నారు.

కోదండరాం, చిరుమర్తికి ప్రాణ హాని

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆందోళన



హైదరాబాద్ , ఆంధ్రప్రభ : నల్లగొండ మున్సిఫల్ చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ హత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఈ హత్యలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం తో పాటు డీజీపీ, జిల్లా ఎస్పీల పాత్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే చిరు మర్తి లింగయ్యను హత్య చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. టీజేఏసీ చైర్మన్ కోదండరామ్‌కు కూడా ప్రమాదం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మాజీ ఎంపీ వి. హనుమంతరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు.నల్లగొండ పట్టణంలో మరో హత్య జరిగిందని, తల, మొండెం వేర్వేరుగా పడేశారని ఆయన వివరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న తనకు ప్రాణహాని ఉందని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అను మానం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నందునే టీఆర్ ఎస్ ప్రభుత్వం హత్యారాజకీయాలకు పాల్పడుతోందన్నారు.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం

త్రిపురారం (రూరల్), ప్రభన్యూస్ : ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా, త్రిపురారంలో సోమవారం జరిగిన కాంగ్రెస్‌పార్టీ బూత్ కమిటీల సమావేశంలో పాల్గొన్న జానారెడ్డి ప్రసం గించారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని ఆరోపించారు. అధికార పార్టీ కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ పనిచేస్తూ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ఇలాంటి బెది రింపులకు భయపడరని అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని అంజనపల్లి, నీలాయగూడెం, పలుగుతండా, లోక్యాతండా, పూసలపాడు గ్రామా ల నుంచి వివి ధ పార్టీలకు చెందిన సుమారు 100మంది కార్యకర్తలు మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మర్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఖరీఫ్ బీమా అమలుకు కార్యాచరణ

వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ ఏడాది ఖరీఫ్‌లో అమలు చేయనున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి ఉమ్మడి నోటిఫికేషన్ జారీచేయాలని తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి ఆదేశాలు జారీచేశారు. ఈ అంశంపై సోమవారం సచివాలయంలో వ్యవసాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్‌రాంరెడ్డి, విత్తన ధృవీకరణ సంస్థడైరెక్టర్ డాక్టర్ కేశవులు, ఇతర అనుబంధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్, పసుపు, వేరుశనగ పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద గుర్తించాలన్నారు. అలాగే పత్తి, మిర్చి, బత్తాయి, పామాయిల్ పంటలను సవరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పరిధిలోకి వస్తాయన్నారు.

పల్లె..గులాబీదే

(మొదటిపేజీ తరువాయి)



కొనసాగింది. మెదక్ ఉప ఎన్నిక తర్వాత వరంగల్ పార్లమెంట్ ఉప ఎన్నిక, తర్వాత గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు, నారాయణఖేడ్ ఉప ఎన్నిక, పాలేరు ఉప ఎన్నిక.. ఇలా అన్ని ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ అద్భుత విజయాలు నమోదు చేసింది. మెజారిటీలోనూ రికార్డులు సృష్టించింది. కాంగ్రెస్ కంచుకోటలను బద్దలుకొట్టి రికార్డులు సృష్టించింది. తర్వాత జరిగిన వరంగల్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ, అచ్చంపేట నగరపంచాయతీ ఎన్నికల్లోనూ ఏకపక్ష విజయాలు సాధించింది. ఇపుడు సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న కీలక సందర్భంలో.. పల్లె నాడి సంకేతాలు ప్రస్ఫుటమయ్యే సమయంలో జరిగిన ఉప ఎన్నికలు రాజకీయపార్టీలకు పరీక్ష పెట్టగా, టిఆర్ఎస్ ఈ ఎన్నికలోనూ మునుపటి జోరునే కొనసాగించి.. తిరుగులేదని నిరూపించుకుంది.

వామపక్ష కోటలు బద్దలు..

రాష్ట్రవ్యాప్తంగా 23 గ్రామపంచాయతీల ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆరు ఎన్నికకు ముందే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 17స్థానాలకు సోమవారం ఎన్నిక జరగ్గా.. టిఆర్ఎస్ జైత్రయాత్ర కొనసాగించింది. దశాబ్దాలుగా వామపక్ష, కాంగ్రెస్ కంచుకోటలుగా ఉన్న స్థానాల్లో సంచలన మెజారిటీతో ఘన విజయాలు సాధించింది. కొత్తగూడెం నియోజకవర్గంలోని సుజాతనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ భారీ విక్టరీ నమోదుచేసింది. టిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఇక్కడ కాంగ్రెస్, టిడిపి, సిపిఐలు సిపిఎంకు మద్దతు ప్రకటించగా, 1126ఓట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. ఇక్కడ టిఆర్ఎస్ గెలవడం ఇదే తొలిసారి. ఈ స్థానం ఆదినుండీ సిపిఎంకు కంచుకోటగా గుర్తింపు ఉంది. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని పాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో టిఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రమ్మ 250కు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ పంచాయతీ ఆది నుండీ కాంగ్రెస్ కంచుకోట. జడ్చర్ల మండలం బూరుపల్లి సర్పంచ్ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ మద్దతు అభ్యర్థి కాట్రావత్ ఘుంప్లీ తన సమీప కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిపై 560ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. వార్డుల ఎన్నిక ఫలితాల్లోనూ ఇదే జోరు కనిపించింది. అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మేజర్ పంచాయతీలో 381ఓట్ల మెజారిటీతో టిఆర్ఎస్ అభ్యర్థి కీసరచిట్టెమ్మ గెలుపొందారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామసర్పంచ్‌గా టిఆర్ఎస్ అభ్యర్థి లలిత 106 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ అభ్యర్థి దేవరకొండ శ్రీనివాస్ 326ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇకరాష్ట్రపంచాయతీ రాజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావుకు తన సొంత నియోజకవర్గంలోనే ప్రజలు షాక్‌నిచ్చారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండల కేంద్ర గ్రామపంచాయతీకి నిర్వహించిన సర్పంచ్ ఉప ఎన్నికలో అధికార టిఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థి 113ఓట్లతో గెలిచింది. మంత్రి నియోజకవర్గంలోనే.. ఈ ఫలితాలు రావడం పాలమూరు జిల్లాలో చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మెజారిటీసర్పంచ్ స్థానాలు టిఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. పంచాయతీ విజయంతో ఆయా జిల్లాల్లో గులాబీశ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

అత్యధిక వార్డులు ఏకగ్రీవం

- సర్పంచి స్థానాలకు పోటాపోటీ
- ఉపపోరులో అధికార పార్టీదే హవా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు జరిగిన ఉప ఎన్నికల సమరం చెదురు మదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల ప్రక్రియను రాజకీయపార్టీల రహితంగా నిర్వహించినప్పటికీ పరోక్షంగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులే రంగంలోకి దిగి ఈ ఎన్నికల్లో పోటీ పడ్డారు. సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపట్టి సాయంత్రానికే ఫలితాలను వెల్లడించారు.రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు 2013ఆగస్ట్ లో ఎన్నికలు నిర్వహించారు. అయితే వివిధ కారణాల రిత్యా ఖాళీగా ఉన్న 28 జిల్లాల్లోని 23 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 165 వార్డు మెంబర్ల స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికలు నిర్వహించిం ది. నామినేషన్ల ప్రక్రియ దశలోనే అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల మంత్రులు ఉప ఎన్నికలపై దృష్టిపెట్టి అత్యధిక స్థానాల్లో పోటీలేకుండా తమ అనుచరుల ను ఏకగ్రీవంగా గెలిపించుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 165 వార్డుమెంబర్ స్థానాలకు గాను 129 స్థానాల్లో వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటిలో అత్యధిక స్థానాలు అనధికారికంగా టీఆర్ఎస్ ఖాతాలోకే చేరిపోయాయి. మిగిలిన 36 వార్డు మెంబర్ల స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. ఇందులోకూడా అధికార పార్టీకి చెందిన అభ్యర్థులే తమపట్టు నిలబెట్టుకున్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 17 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు జరిగిన ఎన్నికలు పోటాపోటీగానే సాగినట్టు సమాచా రం. మరో ఆరేడు నెలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోనుంది. అయినప్పటికీ గ్రామ పంచాయతీ సర్పంచ్ పీఠంపై కొద్దిరోజులు ఉన్నాచాలన్న అభిప్రాయంతో పాటు, గ్రామాల్లో తమ ఆధిక్యతను నిలబెట్టుకోవాలన్న పట్టుదల కూడా ఉప ఎన్నికల్లో గట్టి పోటీవాతావరణం ఏర్పరచింది. మొత్తం 23 పంచాయతీ సర్పంచ్ స్థానాలకు గాను ఆరు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎన్నిక ఏకగ్రీవం కాగా మిగిలిన 17స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో జిల్లాల వారీగా అదిలాబాద్ , కరీంనగర్ , మహబూబ్ నగర్, మెదక్, నాగరకర్నూల్ , పెద్దపల్లి ,సంగారెడ్డి, సూర్యాపేట, వనపర్తి, జిల్లాల్లో ఒక్కో సర్పంచ్ స్థానానికి ఎన్నికలు జరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ , నల్లగొండ, సిద్దిపేట్ జిల్లాల్లో ఒక్కో జిల్లాలో రెండేసి సర్పచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

ఈవీఎంలు ధ్వంసం

రాష్ట్రంలో పలు గ్రామ పంచాయతీలకు జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తలు చోటు చేసుకున్నాయి.మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడురు మండలం గుండమరాజు పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ టీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలింగ్ కేంద్రంపై దాడిచేసి ఈవీఎంను ధ్వంసం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. అటు అధికార పార్టీకి చెందిన వార్డు మెంబర్ ఎన్నికల విధుల్లో ఉన్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో రెండు వర్గాలు పరస్పర దాడులకు దిగాయి. దీంతో డీఎస్పీ రాజారత్నం అదనపు బలగా లతో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తిరిగి పోలింగ్ ప్రక్రియ కొసాగింది. మొత్తం మీద పంచాయతీ ఉప ఎన్నికల సమరం ప్రశాంతగా ముగిసింది.

ఉత్తమ్.. దమ్ముంటే పరకాలలో గెలువ్

తెరాస ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సవాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉత్తరకుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారని, ఉత్తమ్‌కు దమ్ముంటే పరకాలలో పోటీచేసి గెలవాలని టిఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సవాల్ చేశారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయం లో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70స్థానాలు వస్తాయని ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు పగటికలేనన్నారు. మొత్తం 119స్థానాల్లో ఒక్క చోట కూడా కాంగ్రెస్ గెలవదన్నారు. ఉత్తమ్, పొన్నాల వంటి వారు కూడా అవినీతి గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. పార్టీ మారిన బ్రోకర్ అంటూ ఉత్తమ్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉత్తమ్, రేవంత్‌లలో ఎవరొచ్చి పరకాలలో పోటీచేసి గెలిచినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, 2019లో టిఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు.

అక్రమ కేసులపై ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ చెప్పారు. ప్రజా సమస్యలను లేవనెత్తుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే సమాధానం చెపలేని ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులుపెట్టి వేధిస్తోందని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమంపై సోమవారం ఎన్‌టిఆర్ భవన్‌లో సమీక్షించారు. ఈసమావేశంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు. పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమాన్ని సమీక్షించుకుని పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని రమణ సూచించారు

తెదేపా మద్దతు లేకుండా ఏ పార్టీ అధికారంలోకి రాలేదు



పొలిట్‌బ్యూరో సభ్యుడు రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం సహకారం లేకుండా రాష్ట్రంలో ఏ పార్టీ కూడా సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని అన్నారు. కార్యకర్తలు నిరుత్సాహ పడవద్దని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, పల్లెపల్లెకు తెదేపా కార్యక్రమానికి ప్రజలు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, రాజ్యసభసభ్యుడు గరికపాటి మోహన్‌రావు, జాతీయ పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యులు బక్కని నర్సింహులు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధులు కొత్తకోట దయాకర్‌రెడ్డి, అరవింద్ కుమార్ గౌడ్, రాష్ట్రపార్టీ ఉపాధ్యక్షుడు సామ భూపాలరెడ్డి, అమర్‌నాథ్‌బాబు పాల్గొన్నారు.

శ్రీనివాస్ హత్యకేసు సీబీఐకి అప్పగించాలి



నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ : కాంగ్రెస్ నాయకు లు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ భర్త శ్రీనివాస్ హత్య పథకం ప్రకారం టీఆర్ఎస్ పెద్దల హస్తంతోనే జరిగిందని మాజీ మంత్రి, గద్వాల శాసనసభ్యురాలు డికె అరుణ ఆరోపిం చారు. చైర్‌పర్సన్ లక్ష్మీని సోమ వారం ఆమె నివాసంలో పరామ ర్శించి శ్రీనివాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా అరుణ మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య విషయంలో పూర్తిగా దర్యాప్తు జరగ కుండానే పోలీస్ అధికారులు విలేకరుల సమావేశంలో క్షణికావేశంలో హత్య జరిగిందని చెప్పడం అనుమానాలకు తావిస్తుందన్నారు. అధికార పార్టీ రాష్ట్రంలో తమ ప్రభుత్వంతో కలిసి రాలేదనే విషయంతో హత్యలు చేయడానికి కూడా వెనుకాడడంలేదన్నదానికి శ్రీనివాస్ హత్యే నిదర్శనమన్నారు. ప్రాణభయం ఉందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించడంతో పాటు తమకు గన్‌మెన్, గన్‌కు లైసెన్సు ఇవ్వాలని చైర్‌పర్సన్ లక్ష్మీ, భర్త శ్రీనివాస్ పలుమార్లు కోరినప్పటికి వారికి రక్షణ కల్పించకుండా ప్రాణాలు తీశారన్నారు. లక్ష్మీ అనుమానాలు నిజం చేసే విధంగా పోలీసులు సీబీఐకి కేసును అప్పగించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.శ్రీనివాస్ హత్య కేసును సీబీఐ విచారణ జరిపించకపోతే చైర్‌పర్సన్ లక్ష్మీ చేపట్టే ఆమరణ నిరాహారదీక్షకు తమ మద్దతు ఉంటుందని, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చెప్పారు. కాగా కేసును సీబీఐకి అప్పగించి న్యాయం చేయకపోతే తన కుటుంబ సభ్యులతో ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగానికి కూడా వెనుకాడబోనని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

ముమ్మాటికి ప్రభుత్వ హత్యే: కాంగ్రెస్

నల్లగొండ మున్సిఫల్ చైర్‌పర్సన్ భర్త, కాంగ్రెస్ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై రాజకీయ రగడ కొనసాగుతోంది. అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే హత్య చేయించారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. శ్రీనివాస్ హత్య రాజకీయ హత్యేనని డీజేపీకి ఫిర్యాదు చేయడమే కాకుండా ఈ హత్యలో సీఎం కేసీఆర్, డీజీపీల హస్తం ఉందని కాంగ్రెస్ నేతల ఆరోపించడంతో రాష్ట్రంలో కలకలం రేగుతోంది. కాంగ్రెస్ పార్టీ నేతలు సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిగా టీఆర్ఎస్ నేతలు స్పందిస్తూ శ్రీనివాస్‌కు హత్యకు తమ పార్టీకి గానీ, ఎమ్మెల్యే వీరేశంకు , పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని అంటున్నారు. అయితే నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఒక పోలీసు అధికారిని ముందుపెట్టి తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నేతలను హత్య చేయిస్తోందని, టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సీఎల్పీ నేత జానారెడ్డి, తదితరులు అన్నారు.

విభేదాలు వీడుదాం...విజయం సాధిద్దాం



ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నేతలు

- ఆత్మీయ సమ్మేళనంలో టీ కాంగ్రెస్ నేతలు
- కలిసొచ్చే పార్టీలతో జట్టు కట్టాలని నిర్ణయం
- నాయకులు ఐక్యంగా ఉంటేనే కేడర్‌లో ఉత్సాహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికలను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు జీవన్మరణ సమస్యగా భావిస్తున్నారు. 2019లో అధికారంలోకి రాకుంటే కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ముఖ్యనేతలందరూ విభేదాలు పక్కనపెట్టి ప్రజల్లోకి వెళ్లితేనే అధికారం సాధ్యమవు తోందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి నేతల మధ్య ఏమైనా మనస్ఫర్ధలు ఉంటే వాటినిక పక్కన పెట్ట పార్టీ విజయం కోసం కృషి చేయాలనే అభిప్రాయానికి కాంగ్రెస్ నేతలు వచ్చారు. టీ పీసీసీ కోశాధికారి, కాంగ్రెస్ సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి నివాసంలో టీ పీసీసీ ముఖ్యనేతల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రులు జైపాల్‌రెడ్డి, సర్వే సత్యానారాయణ, మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ, ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు, మాజీ మంత్రులు గీతారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్, ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి, సంపత్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, పద్మావతి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్,మల్లు రవితో పాటు డీసీసీ అధ్యక్షులు, పార్ట సీనియర్లు హాజరయ్యారు. కాగా ఈ ఆత్మీయ సమావేశ ఏర్పాటుకు గూడూరు నారాయణరెడ్డి ప్రత్యేక చొరువ తీసుకోగా పార్టీ ముఖ్యులం దరూ ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు, ఐక్యతారాగాలను వినిపించుకున్నారు. రాజీయ ఎత్తుగడలు, వ్యూహాలకు సంబం ధించి ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని, ప్రధానంగా గత ఎన్నికల్లో టీఆర్ఎస్ ఇచ్చిన అమలు కానీ హామీలు తదితర అంశాలను ప్రజలకు వవరించాలనే అభిప్రా యానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లకుండా టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్నా వివిధ రాజకీయ పార్టీలో కలిసి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలడం వల్ల అంతిమంగా ప్రభుత్వానికి మేలు జరిగే అవకాశం ఉందని, అలా కాకుండా కలిసొచ్చే శక్తులతో ముందుకు సాగు తోనే కాంగ్రెస్‌కు లాభమనే అంశంపై చర్చించారు. అవసరమైతే ప్రజా సంఘాలు, కుల సంఘాల మద్దతును కూడగట్టుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా పార్టీ రథసారధిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీలోని ప్రతి ఒక్క నాయకుడిని కలుపుకుని ముందుకు సాగాలని, అందరి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుపోవాలని ఒకరిద్దరూ సీనియర్ నేతలు సూచించినట్లు తెలిసింది.

కొందరు ముఖ్యులు దూరం

ఇదిలా ఉండగా టీ పీసీసీ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి కొంత మంది సీనియర్ నేతలు దూరంగా ఉన్నారు. నియోజక వర్గాల్లో అంత్యంత కీలకమైన సమావేశాలు ఉండగా రాలేకపోయారని, మరికొందరూ మాత్రం కావాలనే ఈ సమావేశానికి దూరంగా ఉన్నట్లు కూడా చర్చ జరుగుతోంది. టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో పాటు మరి కొందరూ నియోజక వర్గాల్లో ముందస్తు కార్యాచరణ ఉంటడంతో రాలేకపోయారని తెలిసింది. అయితే మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ, మాజీ మంత్రి డీకే అరుణతో పాటు కొంత మంది సీనియర్లు హాజరుకాకపోవడంపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. అయితే హాజరుకాని వారిలో ఉత్తమ్‌ను వ్యతిరేకిస్తున్న వారే ఎక్కువగా ఉన్నారనే చర్చ జరుగుతోంది.

రంగారెడ్డి జిల్లాలో 12స్థానాలు మావే



వచ్చే ఎన్ని కల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరు ద్ఘాటిం చారు. పూర్వపు రంగారెడ్డి జిల్లాలో ఉన్న 12 అసెంబ్లీ నియోజక వర్గాలను కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసు కుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే ఇబ్రాహీ పట్నం అసెంబ్లీ నియోజ క వర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేష్ కూడా విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. అయితే అదే నియోజక వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు ఆయన సోదరుడు కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నా రు. టీ పీసీసీ చీఫ్ అభ్యర్థిని ముందస్తుగానే ప్రకటించడంతో కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారీ తీసింది. సోమవారం ఇబ్రాహీ పట్నం అసెంబ్లీ నియోజ వర్గానికి చెందిన అధికార టీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల నేతలు క్యామ మల్లేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

దేశ ఉత్పత్తుల్లో తెలంగాణ టాప్



● అనతి కాలంలోనే ఐదో స్థానానికి చేరాం ● ఐటి ఉత్పత్తులు కలిపితే అగ్రస్థానమే ● యూనివర్సిటీలు ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేయాలి ● పర్యావరణ హిత కార్యక్రమాలకు ప్రాధాన్యత: ఐటిశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ ఉత్పత్తి రంగంలో మొదటి ఐదు అగ్రస్థాయి రాష్ట్రాల స్థాయిలో నిలవడం గర్వించదగ్గ విషయమని పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. 2017 - 18 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేలో తెలంగాణ ఐదవ స్థానంలో నిలిచి తన సత్తా చాటిందని ఆయన అన్నారు. పునరుత్పత్తి విద్యుత్ స్టోరేజీకి అన్వేషణలు జరిపేందుకు టి-హబ్‌తో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ గ్రామీణ విద్యుత్ సంస్థ (ఆర్ఈసీ) సోమవారం జరిగిన ఎంవోయూ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఆర్‌సి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాంను ఆయన ప్రారంభించారు. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్నాటక తర్వాత ఐదవ స్థానంలో తెలంగాణ నిలిచిందని కేటీఆర్ చెప్పారు. ఐటి ఉత్పత్తులు మినహాయిస్తే ఐదవ స్థానంలో నిలిచామని, ఐటితో కలిపితే అగ్రస్థానంలో నిలుస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న టిఎస్-పాస్, పారిశ్రామిక రాయితీలు, ప్రోత్సాహకాలతో పారిశ్రామికపెట్టుబడులు రాష్ట్రానికి దండిగా వస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ పారిశ్రామిక ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో నిలువనుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో విశ్వవిద్యాలయాలకు సాంకేతికత జోడించి వినూత్న ప్రయోగాలకు నాంది పలుకుతామని ఆయన చెప్పారు. యూనివర్సిటీల్లో చేసే పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. టి-హబ్, ఇఆర్‌సి ఒప్పందంలో భాగంగా ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాంలో తెలంగాణ, ఏపీలకు చెందిన 30 యూనివర్సిటీలకు చెందిన 1800 మంది విద్యార్థులు సౌర, పవన విద్యుత్, బయో వేస్ట్ పవర్ పరిశోధనలు చేయనున్నారని మంత్రి తెలిపారు. ఈ విద్యార్థులు 600 ప్రాజెక్టులపై అధ్యయనం, పరిశోధన చేస్తారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు యూనివర్సిటీల్లోనే ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేశారని, అన్ని యూనివర్సిటీల్లో వీటిని ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ హిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. మిషన్ కాకతీయ, హరితహారం, సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా పర్యావరణ పరిరక్షణ చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలాలు పెరిగాయని, హరితహారంతో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని కేటీఆర్ అన్నారు. సౌర విద్యుత్‌లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, రాష్ట్రంలో జరిగే విద్యుత్ ఉత్పత్తిలో 16 శాతం సౌర విద్యుత్ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. దేశం ఎంతో ప్రగతి సాధిస్తోందని, విద్యుత్ ఉత్పత్తులకు స్టోరేజీ సమస్యను అధిగమించాల్సి ఉందన్నారు. ఇప్పటికే టెస్కల్యాబ్ స్టోరేజీపై పరిశోధన చేస్తోందని, దీన్ని మరింత విస్తరించి విద్యుత్ ఉత్పత్తిని నిల్వ చేసేందుకు తగిన వసతులు పెంచేందుకు అన్వేషనలు కొనసాగించాల్సి ఉందని కేటీఆర్ చెప్పారు. జపాన్‌లో పాఠశాల దశనుంచే సాంకేతికతపై ఆసక్తి పెంచుతున్నారని చెప్పారు. టోక్యో సమీపంలో ఉన్న సుజూకీ కంపెనీలో పదేళ్ళ వయసుగల పిల్లలు కారు విడి భాగాలు, పరిశీలిస్తున్నారని చెప్పారు. మన విద్యాసంస్థలు కూడా అలాంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టి పిల్లల్లో చిన్నప్పటి నుంచే ఆలోచనలను రేకెత్తింపజేసి వారిలో అన్వేషణా శక్తి పెంచాలని కేటీఆర్ సూచించారు. అదీనికి సంబంధించి త్వరలో విస్తృతస్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీ ఎండి డాక్టర్ పివి రమేష్, ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ కూడా పాల్గొన్నారు.

టీ- హబ్ టెక్నాలజీకి అంతర్జాతీయ గుర్తింపు

టి-హబ్ టెక్నాలజీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, కార్పొరేట్ ఇన్నోవేషన్స్‌లో ప్రపంచ సంస్థలకు టెక్నాలజీ ఇచ్చే స్థాయికి ఎదిగిందని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బీరు ఉత్పత్తిచేసే కంపెనీ కార్ల్స్‌బెర్గ్ సీఈవో సీస్ టి.హార్ట్ కూడా టి.హబ్ అన్వేషణలు తమకు అందించాలని అభ్యర్థించాయని ఆయన చెప్పారు. టి-హబ్‌తో ఆర్ఇసి ఎంవోయూ కుదుర్చుకున్న సందర్భంలో ఈ అంశాన్ని ఆయన చెప్పారు.ప్రపంచ ఆర్థిక సదస్సు వద్ద కార్ల్స్‌బెర్గ్ సీఈవో తనను కలిసి బీరు తయారీలో నీటి వినియోగం సమస్య పరిష్కారానికి టి-హబ్ అన్వేషణ ద్వారా సహకరించాలని తనను కోరారని కేటీఆర్ చెప్పారు. ఈ సంస్థ ఒక లీటరు బీరు తయారీలో 3.8 లీటర్ల నీటిని వినియోగిస్తుందని, అయితే ఈ నీటి పరిమాణాన్ని 3 లీటర్లకుగానీ, 2 లీటర్లకుగానీ తగ్గించాలని భావిస్తున్నామని చెప్పారు. నీటి పరిమాణం తగ్గించేందుకు అన్వేషణలు చేసి తమకు సహకరించాలని హార్ట్ కోరారని మంత్రి చెప్పారు. ఈ సంస్థ దావోస్‌లో తమ అధికారులతో చర్చలు జరిపిందని, టి-హబ్‌తో ఒప్పందం చేసుకునేందుకు త్వరలో రాష్ట్రానికి రానుందని చెప్పారు. ఆ సంస్థ ప్రతినిధులు నెదర్లాండ్స్ నుంచి హైదరాబాద్ వస్తారని, టి-హబ్, కార్ల్స్‌బెర్గ్ భాగస్వామ్యం ఒప్పందం చేసుకుంటాయని ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు.

రాబోయే ఎన్నికలలో జనసేన పోటీ



అనంతపురం, ప్రభ న్యూస్ బ్యూరో: చేతిలో ఎంతో నైపుణ్యం ఉండి.. దాన్ని కళాత్మకంగా వస్త్రాలపై నేయగలిగే కళాకారులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధాకరమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఛలోరే.. ఛలోరే.. ఛల్.. పేరిట నిర్వహించిన మూడు రోజుల అనంతపురం జిల్లా పర్యటన సోమవారం హిందూపురంలో ముగిసింది. అనంతలో తొలి రాజకీయ పర్యటనకు అత్యంత ప్రజాదరణ లభించింది. ముఖ్యంగా యువతను ఆయన విశేషంగా ఆకట్టుకోగలిగారు. జిల్లా సమస్యలు, రాయలసీమ సమస్యలనే ఎక్కువుగా ఆయన ప్రస్తావిస్తూ.. ఈ ప్రాంత వాసులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. చివరి రోజు ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తితో పాటు ధర్మవరం, హిందూపురంలలో ఆయన వివిధ వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన పలు అంశాల పై తన అభిప్రాయాలను వెల్లడించారు 2019 ఎన్నికలలో జనసేన పోటీకి సిద్ధమవుతుందని.. పార్టీ కార్యకర్తలు అందుకు సంసిద్ధులు కావాలని పార్టీ కేడర్‌కు పవన్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పై పోరాడే పార్టీలకే తమ పార్టీ వచ్చే ఎన్నికలలో మద్ధతిస్తుందన్నారు. 70 సంవత్సరాలుగా ప్రజా సమస్యలు ఇంకా అలాగే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోందని.. గడిచిన మూడున్నరేళ్ల పాలననూ పరిశీలించామ న్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించడం తానొక్కడి వల్లే సాధ్యం కాదని చెప్పారు. తెలంగాణ ఉద్యమ క్రమంలో వచ్చిన విధంగా ప్రజల్లో కదలిక రావాలన్నారు. ప్రత్యేక ప్యాకేజీ వల్ల ఏ విధంగా తమకు మేలు జరుగుతుందన్న విషయంలో ప్రజల్లో స్పష్టత కనిపించడం లేదన్నారు. కరవు, వెనుకబాటును ప్రారద్రోలేందుకు జనసేన పని చేస్తుందని రాయలసీమ మట్టి పై ప్రమాణం చేస్తున్నానన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఏపికి కొత్త సమస్యలు వచ్చాయన్నారు. సీమపై నేటికీ వివక్షత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు. ప్రజల కోసం పని చేసే తనకు ఎన్నికలలో గెలుపోటములు సమానంగా స్వీకరించే పరిపక్వత ఉందన్నారు.

మల్లన్న సేవలో ఎంపీ కవిత

● తెలంగాణ అభివృద్ధిని కాంక్షించా ● ఇరు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధనకు ఆలయాల్లో పూజలు చేశామని, తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో పయనింపజేస్తూ దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని మల్లిఖార్జునస్వామిని కోరుకుంటున్నట్లు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చెప్పారు. సోమవారం ఆమె కర్నూలు జిల్లా శ్రీశైల మల్లిఖార్జున స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తెరాస, తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి కవిత కుటుంబ సమేతంగా స్వామివారి హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ అన్నదమ్ములుగా కలిసి ఉంటూ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. కొందరు భక్తులు, స్థానికులు శ్రీశైలానికి బస్సు, రైలు సౌకర్యం ఆశించినంతగా లేవని, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, శ్రీశైలంనుంచి హైదరాబాద్‌కు బస్సుల సంఖ్య తక్కువగా ఉందని ఆమెకి విన్నవించారు. ఈ అంశాన్ని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసికెళ్లి భక్తులకు మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీ అంశాలను ప్రస్తావిస్తారని ప్రశ్నించగా విభజన చట్టంలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. గత సమావేశాల్లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాష్ట్రానికిచ్చిన హామీలను తిరిగి గుర్తుచేస్తామన్నారు. పెండింగ్ హామీలపై తమ పార్టీ ఎంపీలమంతా గళమెత్తుతామని ఆమె చెప్పారు. తెలంగాణ శైవక్షేత్రాలకు పెట్టింది పేరని, శ్రీశైలానికి వచ్చే దారిలో అత్యంత ప్రాముఖ్యమైన మల్లెల తీర్థం ఉందని, పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ప్రకృతి జలపాతం శివలింగాన్ని అభిషేకిస్తుండటం ఇక్కడి ప్రత్యేకతని చెప్పారు. సోమశిల, మల్లెల తీర్థం, ఉమామహేశ్వరం దేవాలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.100కోట్లు మంజూరీ చేసిందన్నారు.

అలరించిన బీటింగ్ రీట్రీట్

న్యూఢిల్లీ: బీటింగ్ రీట్రీట్ వేడుకలను సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కేంద్ర మంత్రులతో పాటు త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. రిపబ్లిక్ వేడుకల ఘన విజయం కోసం నెలల తరబడి శ్రమించిన వారిలో కొత్త ఉత్సాహం నింపడానికి ఈ బీటింగ్ రీట్రీట్‌ను నిర్వహిస్తారు. ఈసారి ఈ వేడుకలో మార్షల్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ దివంగత అర్జున్‌సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఇది తొలి రీట్రీట్. ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో జరిగిన ఈ వేడుకలకు హాజరైన రాష్ట్రపతికి సంప్రదాయ రీతిలో స్వాగతం పలికాయి త్రివిధ దళాలు. సాయం సంధ్యలో, ఆహ్లాద కరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో నేవీ, ఎయిర్‌ఫోర్స్, మిలటరీలోని ప్రత్యేక దళాలు తమదైన, తమకే స్వంతమైన బ్యాండ్‌లను వీనుల విందుగా వినిపిస్తూ, విన్యాసాలు చూపిస్తూ ఆహూతులను కట్టిపడేశారు. త్రివిధ దళాలతో పాటు వివిధ విభాగాలకు చెందిన అనేక ట్రూప్‌లు తమ ప్రదర్శనలతో ఈ వేడుకకు మరింత వెలుగులద్దారు. వైమానిక దళానికి చెందిన బ్యాండ్ ట్రూప్ తమ వాయిద్యాలతో అప్పటికే కేరింతలు కొడుతూ ఉత్సాహంగా ఉన్న వీక్షకుల ఆనందాన్ని శిఖరాగ్రానికి చేర్చారు.

ఇటీవల తన 98వ ఏట మరణించిన దివంగత ఎయిర్‌మార్షల్ అరున్‌సింగ్‌కు ఘన నివాళి అర్పించేందుకు ప్రత్యేకంగా ఆఫ్రికన్ డ్రమ్స్ ట్రూప్‌ను వినియోగించారు. వేడుక జరుగుతున్న ప్రాంగణానికి సమీపంలోని రైల్‌భవన్, ఉద్యోగ భవన్ తదితర భవనాలను సంప్రదాయ లైటింగ్‌తో అందంగా ముస్తాబు చేశారు. కార్యక్రమం అనంతరం ప్రధాని తన సెక్యూరిటీని దాటి మరీవచ్చి ప్రజలతో కరచాలనం చేయడం విశేషం.

9గంటలు చాలు..!

(మొదటి పేజీ తరువాయి)

ముప్పు వాటిల్లుతోంది. నిరంతరం నీరు తోడేయడంతో ఈ విషయం అధికారుల సర్వేలోనూ బహిర్గతమైంది. సందర్భం వచ్చినప్పుడల్లా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా కుదించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇదే అంశంపై గత కొన్ని రోజులుగా ప్రజాభిప్రాయా లను సేకరిస్తున్న ఉన్నతాధికారులు వాస్తవాలను ఇటీవలే ముఖ్యమంత్రికి నివేదించారు. దీంతో మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకు పునరుద్ధరణ చర్యలు మొదలుపెట్టా రు. ఈ విషయంలో ప్రభుత్వం అతిగా వ్యవహరించిం దంటూ ప్రతిపక్షాల రాద్ధాంతానికి అవకాశం లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడికక్కడ అనధికార ఆదేశాలతో కొన్ని ప్రాంతాల్లో 9 గంటలు, మరికొన్ని ప్రాంతాల్లో 12 గంటలు, ఒత్తడి లేనిచోట్ల 18 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో గృహ వినియోగానికి, వ్యవసాయ వినియోగానికి వేర్వేరు ఫీడర్లను ఏర్పాటు చేసి త్వరలోనే నిరంతర విద్యుత్ ప్రణాళికను రెండు పద్ధతుల్లో అమలు చేయాలని నిర్ణయించినట్లు తాజా సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ నెల మొదటివారంలో వరంగల్ కేంద్రంగా జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీష్‌రావు నిరంతర విద్యుత్ వ్యవసాయ రంగానికి నష్టం కలిగిస్తుందన్న ప్రతిపాదనను అంగీకరిస్తూ గ్రామాలు, జిల్లాల వారీగా తీర్మాణాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తే స్థానిక అవసరాల మేరకు కుదిస్తామని బహిరంగంగానే ప్రకటించారు. తాజాగా కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో 24 గంటల విద్యుత్ రైతులకు నష్టం కలిగిస్తుందని, ప్రభుత్వానికి ప్రతిపాదించి అవసరం మేరకే సరఫరా చేసేలా చూడాలని తీర్మాణం చేశారు. అలాగే గడిచిన పక్షం రోజుల్లోనే అనేక గ్రామాల్లో నిరంతర విద్యుత్ వద్దంటూ ఏకగ్రీవ తీర్మాణాలు చేసి స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి పంపారు. ఈ పరిస్థితులు, పరిణామాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం అంతర్గత చర్యలను శ్రీకారం చుట్టింది.

జిల్లా కలెక్టర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈల సమన్వయంతో ఏఏ ప్రాంతాల నుంచి తగ్గించాలన్న డిమాండ్ వస్తుందో పరిశీలించి ఆ మేరకే సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. కానీ ప్రభుత్వానికి అందుతున్న తీర్మాణాలు, ప్రతిపాదనలు ఏ మేరకు వాస్తవాలున్నాయన్న కోణంలో సీఎం కేసీఆర్ దృష్టిపెట్టారు. అధికార యంత్రాంగం ద్వారా ఆరా తీస్తున్నారు.

రాజకీయ కోణంపైనా ప్రభుత్వం దృష్టి

నిరంతర విద్యుత్‌పై రాజకీయ కోణంలో ఒత్తిడి పెరుగుతోందా? అన్న అంశంపై స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల ద్వారా ఆరా తీస్తున్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకుని దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టారు. బోరుబావుల వద్ద ఆటోస్టార్టర్ల తొలగింపు ప్రభుత్వ యంత్రాంగానికి అసాధ్యంగా మారడంతో ఒక అడుగు వెనక్కి వేయక తప్పడంలేదు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. అనధికార లెక్కల ప్రకారం 28 లక్షల పంపుసెట్లు ఉన్నట్లు ఇటీవలే లెక్కలు తేల్చారు. గత కొన్నేళ్ళుగా వీటన్నింటికీ ఆటోస్టార్టర్లు బిగించారు. రైతులు వాటికే అలవాటు పడ్డారు. ఈ ఏడాది మొదలుకుని నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నందున కొన్ని ప్రాంతాల్లో బోర్లలో నీరులేక మోటార్లు కాలిపోతున్నాయి. అదే సమయంలో భూగర్భ జలాల పరిరక్షణకు పెనుముప్పు పొంచివుంది. ఏ కోణంతో చూసినా 24 గంటల విద్యుత్ సరఫరాపై గ్రామస్థాయిలో సరాసరిగా 50శాతానికి పైగా రైతుల్లో వ్యతిరేకత కనిపిస్తోంది.

లాభ, నష్టాల బేరీజుపై ప్రభుత్వం దృష్టి

వ్యవసాయ రంగానికి నిరంతర ఉచిత విద్యుత్ లాభ, నష్టాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. గత ఏడాది ఆఖరులో ప్రయోగాత్మకంగా అమలు చేసిన మూడు జిల్లాల్లో కొంత మేరకు ప్రతికూల పరిస్థితులు కనిపించినప్పటికీ, తెలంగాణ ప్రతిష్టను దేశానికి చాటి చెప్పాలన్న సంకల్పంతో ముందడుగు వేసిన ముఖ్యమంత్రి తదనంతర పరిణామాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల నిరంతర విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేయడం వ్యవసాయ అనుబంధ రంగాల్లో కొంతమేరకు ఫలితాన్నిస్తున్నప్పటికీ, మెజారిటీ రైతుల నుంచి వస్తున్న వ్యతిరేకతను గమనించారు. అన్నదాతల కోసమే నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ప్రభుత్వం, అవసరం మేరకు విరమించుకోవాలన్న ప్రతిపాదనను కార్యరూపంలోకి తీసుకువచ్చారు. గ్రామ సభల్లో తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపిస్తే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఫీడర్లను వేరుచేసి 12 నుంచి 18 గంటలు మాత్రమే ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు.

'జాత్యహంకారి గాంధీ'



జైపూర్: మహాత్మాగాంధీ ఒక జాత్యహంకారి అని భారత్ అమెరికన్ రచయిత సుజాత గిడ్లా వ్యాఖ్యానించారు. కులవ్యవస్థ ను కాపాడాలని, రాజకీయ ప్రయోజనం కోసం దళిత ఉద్ధరణకు లబ్ధిని అందించాలని కోరుకున్న గాంధీజీ ఒక జాత్యహంకారని ఆమె అన్నారు. జైపూర్ సాహితీ ఫెస్టివల్లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీజీ కులాలకు వ్యతిరేక మనిషి అని ఎలా చెప్పగలను అన్నారు. కుల వ్యవస్థను కాపాడాలని ఆయన నిజంగా కోరుకున్నారన్నారు. అంటరానివాసుల పెంపునకు గాంధీ కృషి చేశారన్నారు. ఎందుకంటే బ్రిటీష్ ప్రభుత్వంలో రాజకీయ ప్రాతినిధ్యం కోసం ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు అవసరమన్నారు. హిందూనాయకులు కుల సమస్యలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదని గిడ్లా అన్నారు. నిజానికి గాంధీ జాతివివక్ష, జాత్యహంకారి ఈ విషయం జాత్యహంకారంపై పోరాడిన నల్లజాతీయులకు, తెల్లజాతీయులకు ఆయన నిజమైన ఉద్దేశాలు తెలుసన్నారు. కాంగ్రెస్ లేదా బీజేపీకి ముందు పాలించిన ఏ పార్టీ మోడీకి భిన్నంగాలేదన్నారు. అమెరికాలో మాదిరిగానే ప్రజాస్వామ్యవాదులు నిజానికి ట్రంప్‌కు భిన్నంగా లేరన్నారు. 1984లో స్వర్ణదేవాల యం ఘటన అనంతరం ఇందిరాగాంధీ హత్యాకాండ తరువాత 3000కు పైగా సిక్కులు హత్యచేయబడ్డారని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో హత్యాకాండ యథేచ్ఛగా జరిగిందన్నారు.

డస్ట్‌బిన్‌లో మృత శిశువు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వెలుపల ఉన్న డస్ట్‌బిన్‌లో శిశువు మృతదేహం లభించింది. ఈఘటనపై ఆసుపత్రి అధికారులు మాట్లాడుతూ శిశువు గర్భంలోనే మరణించిందని, ఆ మృతశిశువు దేహాన్ని శిశువు తండ్రికి అప్పగించగా అతను డస్ట్‌బిన్‌లో పడవేశాడని తెలిపారు. ఈసందర్భంగా సీనియర్ పోలీస్ అధికారి ఒకరు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న మార్చురీ వెనుక ఉన్న డస్ట్ బిన్‌లో ఒక చిన్నారి బాలిక మృతదేహం పడుందని సమాచారం వచ్చింద న్నారు. ఘటన ప్రాంతానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని పరిశీలించగా బాలిక ప్రిమెచ్యూర్ బేబీ గా గుర్తించామన్నారు. బరువు 1.42కేజీలు ఉందన్నారు. బాలిక పుట్టిన తేదీ, సమయం జనవరి 27, 11.58 పిఎం అని తెలిసిందన్నారు. మృత శిశువుపై ఉన్న ట్యాగ్‌పై ఈ వివరాలు ఉన్నాయన్నారు. అనంతరం ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తు చేయగా చనిపోయిన బాలికకు తన భార్య జన్మనిచ్చిందని శిశువు తండ్రి తెలిపాడన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీలకు ముకుతాడు.. 30 మూత?

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లోనూ నిబంధనలను ఉల్లంఘించిన కళాశాలలను పక్కనబెట్టి వాటికి అనుబంధ గుర్తింపునివ్వకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇప్పటికే హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఉపకులపతికి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. రెండేళ్ళ క్రితం ప్రవేశపెట్టిన ప్రమోషన్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మొదటి సంవత్సరంలో పరీక్ష తప్పి తిరిగి రెండో సంవత్సరంలో చేరేందుకు అవసరమైన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే సంబంధిత విద్యార్థులకు నిబంధనలకు అనుగుణంగా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి ఇరవై మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలన్న నిబంధనను కళాశాలలు ఖచ్చితంగా అమలు చేసేలా చూడాలని, అధ్యాపకుల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో ఫొటోలతో సహా పొందుపరచాలని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జేఎన్‌టీయూని ఆదేశించినట్టు తెలుస్తోంది. కళాశాలల పనితీరును అధ్యయనంచేసి అధ్వాన్న స్థితిలో ఉన్న వాటిపై వేటు వేయాలని కోరింది. గత మూడేళ్ళలో ఏ ఏ ఇంజనీరింగ్ బ్రాంచులలో ఎన్నెన్ని సీట్లు భర్తీ అయ్యాయి, 30 శాతంలోపు సీట్లు భర్తీ అయిన కోర్సులేవీ? అలా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నెన్ని కళాశాలలు ఉన్నాయి, వాటి వివరాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపాలని కోరినట్టు సమాచారం. మెజారిటీ కళాశాలల్లో డిమాండ్ బాగా ఉన్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో 180 నుంచి 240 సీట్లు ఉన్నాయని ఇందులో కేవలం 50 శాతం సీట్లు మాత్రమే కొన్ని కళాశాలల్లో భర్తీ అవుతున్నాయని ఆ తరహా కళాశాలలు గుర్తించి వాటికి కేవలం ఒక ఇంజనీరింగ్ బ్రాంచ్‌ను నిర్వహించుకునేందుకే అనుమతి ఇవ్వాలని మిగతా సీట్లకు కోత విధించాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. గత ఏడాది కేవలం 80వేల సీట్లు మాత్రమే భర్తీకాగా 50 వేలకు పైగా సీట్లు ఇంజనీరింగ్ కళాశాలల్లో మిగిలిపోయాయి.

ఈసంవత్సరం ఇలా వేలకు వేలు సీట్లు మిగిలిపోకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జేఎన్‌టీయూ అధికారులు రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో మూడు సంవత్సరాలుగా ఆయా కళాశాలలు అనుమతి పొందిన కోర్సులు, భర్తీ అయిన సీట్లు, చేరిన విద్యార్థుల వివరాలు అందులో ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల సంఖ్యను తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. వచ్చే నెల రెండో వారంలో రాష్ట్రంలోని అన్ని కళాశాలలు తనిఖీ చేసిన తర్వాతే వాటికి అనుబంధ గుర్తింపునివ్వాలని జేఎన్‌టీయూ ఇప్పటికే నిర్ణయించి అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీచేసింది. పదిహేనేళ్ళ క్రితం ప్రారంభమైన ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ అంతంత మాత్రంగానే ఉండడంతో వాటిని ప్రభుత్వం మూసివేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. 1996వ సంవత్సరం నుంచి రాష్ట్రంలో పెద్దఎత్తున ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేశాయి. రెవెన్యూ డివిజన్‌ను విద్యాపరంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఒక్కో డివిజన్‌లో లెక్కకు మించి కళాశాలలకు అనుమతులు ఇవ్వడం, ఆ కళాశాలలను నిర్వహించలేని పరిస్థితుల్లో కొందరు ఇప్పటికే మూసివేసుకోగా మరికొంతమంది వాటిని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభ్యం కాకపోవడంతో నిరుద్యోగులుగా మారుతున్నార న్న విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించేకళాశాలలను గుర్తించి వాటికి మాత్రమే అనుబంధ గుర్తింపు ఇవ్వాలని ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని జేఎన్‌టీయూని కోరింది. రాష్ట్రంలో 230 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా గత మూడేళ్ళలో 70 కళాశాలలు మూతపడ్డాయి.

ప్రభుత్వం తాజాగా జారీచేసిన నిబంధనలు అమలుచేస్తే మరో 30 కళాశాలలు మూతపడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఒక్కో యాజమాన్యం రెండు, మూడేసీ ఇంజనీరింగ్ కళాశాలలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నాయి. ఒక్క కళాశాలకు సంబంధించి మాత్రమే పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతుండడంతో మిగతా రెండు కళాశాలలు మూసివేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అవసరమైతే యాజమాన్యాలను పిలిచి వారితో సంప్రదింపులు జరపాలని వినకపోతే షోకాజ్ నోటీసులు జారీచేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జేఎన్‌టీయూని ప్రభుత్వం ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల విషయంలో ఇదే జరిగిందని ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యలవల్ల ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అవుతున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు ఏటా లక్ష మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుని ఎంపిక పరీక్షకు హాజరవుతున్నారని ఇందులో కేవలం 60 నుంచి 70 వేల మంది మాత్రమే ప్రవేశాల కోసం ముందుకు వస్తున్నారని అధికారులు చెబుతున్నారు. సీట్లు పొందాక కూడా పది వేల మంది విద్యార్థుల వరకు స్పందించడం లేదని దీంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయని వారు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఈ విద్యా సంవత్సరంలో ఉత్పన్నం కాకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వారు తెలిపారు.


సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 30 జనవరి 2018

నీ చల్లని గుణమే మాకివ్వు

జాతి పిత మహాత్మా గాంధీ అంత్యక్రియల ఊరేగింపులో ఆయన నిరంతరాయంగా ఏడు గంటల సేపు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. మహాత్ముడంటే జాతికి ప్రాణం. బాపూజీ చనిపోయారనే వార్తనే జీర్ణించుకోలేకపోయింది యావద్దేశం. అలాంటి తరుణంలో ఆయన పార్థివదేహం పక్కనే నిలబడి.. వ్యాఖ్యానం చెప్పడమంటే ఎంత కష్టం. ఒకవైపు ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ.. భారమైపోయిన గుండెను సముదాయించుకుంటూ తన కర్తవ్యాన్ని నిర్వహించారు ఆయన. ఆయనే ప్రఖ్యాత వ్యాఖ్యాత మెల్వి డిమెలో. ఆకాశవాణి న్యూఢిల్లీ కేంద్రంలో 1971 వరకూ పనిచేశారు. ఆయన ప్రతిభకు మెచ్చి, పదవీ విరమణ తరవాత మరో ఐదేళ్ళు పనిచేసే అవకాన్నిచ్చింది ప్రభుత్వం. 1963లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. మెల్వి డిమెలో గళంతో మహాత్ముని గురించి వ్యాఖ్యానాన్ని వినలేని వారికి తన రచన చదివే అవకాశాన్ని కల్పించారు. డిమెలో రచన యథాతథంగా...





స్వావలంబనే గాంధీయిజం!

గాంధీజీ డెబ్బయ్యో వర్ధంతి తరుణంలో ఆయన సిద్ధాంతాలు, కార్యక్రమాలను సింహావలోకనం చేసుకోవడం అవశ్యమే. ఆయన ఆశించిన పూర్ణ స్వరాజ్‌కి ఇంకా మనం చాలా దూరంలో ఉన్నాం. గాంధీజీ జయంతి, వర్ధంతుల సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడం తప్ప ఆయన ఆచరించి ప్రబోధించిన సిద్ధాంతాలను అమలు జేయకపోవడం వల్లే పేదరికం, అంటరానితనం దేశానికి ఇప్పటికీ పెను సవాళ్ళుగా ఉన్నాయి. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని ఏనాడో చాపచుట్టేయడం వల్ల దేశంలో ఏదో మిషపై హింస పెచ్చరిల్లుతోంది. కుల, మత, భాషాపరమైన విభేదాలతో రగిలే హింసకు తోడుగా, పొరుగు దేశం నుంచి దిగుమతి అవుతున్న ఉగ్రవాదం మన దేశాన్ని కుదిపేస్తోంది. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం ఒక నినాదంగానే మిగిలిపోయింది. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాల సత్ఫలితాలు మనకు అందకపోయినా, అవినీతి, ఆర్థికపరమైన అంతరాల వంటి దుష్ఫలితాలు దేశాన్ని వెంటాడుతున్నాయి. నగరాలు, పట్టణాల వృద్ధిని గాంధీజీ వ్యతిరేకించలేదు. కానీ, దేశ జనాభాలో ఇప్పటికీ 50 శాతం మందిపైగా నివసిస్తున్న గ్రామాలల్లో కూడా మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నదే గాంధీజీ సిద్ధాంతం. అదే సిద్ధాంతాన్ని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ కూడా జీవితాంతం ప్రచారం చేశారు. గ్రామాల కోసం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా ఖర్చు కాకపోవడం వల్లే, రోడ్లు, మురుగునీటి పారుదల మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కొరవడటం వల్లనే పట్టణాలకూ, నగరాలకూ వలస పోతున్నారు. వలసలను నిరోధించేందుకు గ్రామాలను ప్రజా ప్రతినిధులు దత్తత తీసుకునేందుకు ఉద్దేశించిన పథకం ప్రచారానికే పరిమితం అయింది. గ్రామాభ్యుదయమే గాంధీజీకి మన జాతి అర్పించే నివాళి. మద్యనిషేధ కార్యక్రమం అవహేళన పాలైంది. గాంధీ జయంతి, వర్ధంతి వంటి పర్వదినాల్లో బార్‌లు, మద్యం,మాంసం దుకాణాలను మూసివేయాలన్న ఉత్తర్వులు ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు జారీ చేస్తున్నా, అవే రోజుల్లో వాటి అమ్మకాలు ఎక్కువ కావడంతోఆ మహనీయుని పట్ల అపచారం ఏటా జరుగుతూనే ఉంది. ఖాదీ వస్త్ర ధారణ ఒక ప్రహసనంగా ఏనాడో మారింది. గాంధీజీ సిద్ధాంతాలు ఆధునిక సమాజంలో సాధ్యపడవన్న వితండ వాదనలు కూడా తరచూ వినిపిస్తున్నాయి. మిగిలిన నిర్మాణ కార్యక్రమాల సంగతి అటుంచినా,సత్యం,అహింస గాంధీజీ సిద్ధాంతాల్లో అత్యంత ముఖ్యమైనవి.వాటిని గురించి ఎవరైనా మాట్లాడితే సత్తెకాలపు వాడిగా ముద్ర వేయడం కూడా ఆధునిక సమాజంలో చూస్తున్నాం. గాంధీజీ ఆశయాలనే కాదు,ఆయన బొమ్మను కూడా కనుమరుగు చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. కరెన్సీ నోట్లపై గాంధీజీ బొమ్మకు బదులు కళ్ళజోడు మాత్రమే ముద్రిస్తుండటం వల్ల భావితరాలకు గాంధీజీ రూపం చూసే అవకాశం ఉండదు. గాంధీజీ కార్యక్రమాల్లో ముఖ్యమైనది అయిన పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ మూడేళ్ళ క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రచారం జరిగిన స్థాయిలో అమలు జరగడం లేదు. బహిరంగంగా కాలకృత్యాలు తీర్చుకునే అలవాటును మాన్పించేందుకు ఈ కార్యక్రమం ప్రజలను జాగృతం చేసిందని చెప్పక తప్పదు. ఇలాంటి వారి సంఖ్య 2014లో 55కోట్లు ఉండగా,ఇప్పుడది 25 కోట్లకు తగ్గింది. 8 రాష్ట్రా లు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ పూర్తిగా విజయవంతం కావడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ కార్యక్రమం మహిళలను జాగృతం చేసిందనడం నిస్సందేహం. అత్తారింట్లో మరుగు దొడ్డి లేకపోతే కాపురానికి వెళ్ళబోమని నవవధువులు చేస్తున్న ప్రకటనలే ఇందుకు నిదర్శనం. గాంధీజీ సిద్ధాంతాలన్నీ దేశాన్ని స్వయం పోషకత్వాన్ని చేయడానికిఉద్దేశించినవే. దీనినే స్ఫూర్తిగా తీసుకుని మోడీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. విదేశీ పరిజ్ఞానంతో స్వదేశంలోనే అత్యంత ఆధునికమైన ఆయుధాలు, యంత్ర సామగ్రి తయారు చేసుకోవడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటున్నా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 49 శాతాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం మళ్ళీ విదేశాల నుంచి రక్షణోత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఆలోచనలు సాగించడం దురదృష్టకరం. అగ్ని-5క్షిపణితో చైనాలో గుబులు పుట్టించినప్పటికీ, అది నామమాత్రంగానే మిగిలిపోయింది. కీలకమైన అణ్వాయుధాల విషయంలో మన దేశం ఇంకా వెనకబడే ఉంది. రక్షణ శాఖ కేటాయింపుల్లో అత్యధిక భాగం విదేశాలనుంచి దిగుమతులకే సరిపోతోంది.ఈ పరిస్థితిని నివారించగలిగినప్పుడే మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం విజయవంతం అయినట్టు.అదే సందర్భంలోరిటైల్ రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను అనుమతిం చడం వల్ల దేశంలో ఈ రంగంపై ఆధారపడిన కోట్లాది మంది ఉపాధికి హాని జరుగుతుంది.గాంధీజీ సిద్ధాంతాల అమలు అంటే, స్వదేశీ పరిశ్రమలు, పరిజ్ఞానానికి,వ్యాపారాలకు ప్రాధాన్యం ఇవ్వడమే.

సత్యాన్వేషణే ఆయన ఆత్మకథ!

జాతిపిత మహాత్మాగాంధీ రాసిన మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్‌ట్రూత్ అనే గ్రంథం గుజరాతీ మూలాన్ని మహదేవ్ దేశాయ్ ఆంగ్లంలోకి అనువదించారు. సత్య హరిశ్చంద్ర నాటకం తన జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేసిందో ఆయన ఈ గ్రంథంలో ఉన్నదున్నట్టు రాశారు. సత్యానికి గాంధీజీ ఎందుకంత ప్రాధాన్యం ఇచ్చారో ఈ గ్రంథం చదివినా, ఇందులో భాగాల గురించి విన్నా అర్థం అవుతుంది. అందరి లాగే, తాను కూడా తప్పులు చేసినట్టు, మత్స్య మాంసాలను తిన్నట్టు,పొగ తాగినట్టు, మద్యపానం చేసినట్టు గ్రంథంలో పేర్కొన్నారు. బ్రిటిష్ వారి తుపాకీ గుండుకు గుండె చూపి ఆంధ్రకేసరిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రకాశంగారు కూడా నాజీవిత యాత్రలో తన బాల్యంలో చేసిన తప్పిదాల గురించి ధైర్యంగా పేర్కొన్నారు. సత్యశోధనకు కట్టుబడిన వ్యక్తులు కనుకనే వారిద్దరూ తమ జీవితం తొలినాళ్ళలో చోటు చేసుకున్న ఉదంతాలను వివరించారు. మతం గురించి ఆయన పెద్ద పెద్ద గ్రంథాలు చదవలేదు.తన సన్నిహితమిత్రుడు రాయ్ చంద్ అనే జైన్ మతస్తుడు అన్ని మతాల గురించి చెప్పిన విషయాలను ఆకళింపుచేసుకున్నారు.అన్ని మతాల సారం మానవసేవే మాధవ సేవ అన్నదేనని గాంధీజీ గ్రహించారు.అందుకే ఆయన సమాజంలో అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారు.అంటరానితనం నిర్మూలన, హరిజనుల అభ్యున్నతి, కుష్టురోగుల సేవ, హిందీ ప్రచారోద్యమం, ఖాదీ వస్త్రాల వాడకం, తేనెటీగల పెంపకంవంటివి నిర్మాణ కార్యక్రమాల్లో చేర్చారు. సంపూర్ణ మద్యనిషేధం కోసం ఆయన ఎంతో కృషి చేశారు. పరమత సహనం,సహజీవన సిద్ధాంతాలను ఆయన ఆచరించి ప్రబోధించారు.గాంధీ తాను ప్రబోధించినవన్నీ ఆచరించారు. ఆయన మహాత్ముడు అయ్యాడు. ముఖ్యంగా,అహింసా వాదిగా ఆయన అఖండ కీర్తిని ఆర్జించారు . సత్యాహింసలే ఆయుధాలుగా బ్రిటిష్ వారితో పోరాడి దేశానికి స్వాతంత్ర్యా న్ని తెచ్చారు.ఆయన జయంతి అయిన అక్టోబర్ రెండవ తేదీన అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.





ఒక మహాపురుషుణ్ణి గూర్చి ఏమని రాయాలి? మహాత్మా గాంధీ నిర్యాణంపై ఒక వ్యాసాన్ని రాయమని నన్నడిగినప్పుడు నాకుగా నేను వేసుకున్న ప్రశ్న ఇది. రాయడానికి కూర్చున్న ప్పుడు దానికి న్యాయం చేయగలనా అనిపించింది. నేనొక రేడియో వ్యాఖ్యాతని. గుండెలు పగిలిపోయిన ఆఖరు క్షణాల్నీ, బాపూజీ అంతిమ యాత్రనీ ఏమని వర్ణించాలి? ఏ విధంగా నా కలం కదులుతుంది? నాకు మాత్రం ఆ రాత్రి సుదీర్ఘంగా అనిపించింది. కాళరాత్రిని తలపించింది. బాధ, విషాదం పొంగిపొర్లుకొచ్చాయి. మాటలలో వర్ణించలేని భావన మెదులాడింది. కాలం అన్నింటికీ మందు. క్రమేపీ బాధ తగ్గుముఖం పడుతుంది. కొన్ని దృశ్యాలు నా మెదడులో నిక్షిప్తమైపోయాయి. ఆ దృశ్యాల గురించే నేనిప్పుడు రాయబోయేది.

ఆరోజు ఉదయం 6గంటలు. మహాత్ముని పార్థివ దేహాన్ని ఉంచిన బిర్లా హౌస్‌కు వెళ్ళాను. బాపూజీ అంతిమ సంస్కారం నిర్వహించే రోజది. నేను వెళ్ళేసరికే పెద్ద సంఖ్యలో ప్రజలు బరువెక్కిన గుండెలతో వరుసలో నిలబడి ఉన్నారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ కనిపిం చారు. నన్ను ఒక ప్రత్యేక ద్వారం ద్వారా గాంధీ మృతదేహమున్న చోటకు తీసుకెళ్ళారు. విశాలమైన ఆయన ఛాతిని నిర్దయగా గాయపరిచిన తూటాల గుర్తులు కనిపించాయి. అవి ద్వేషానికీ, పిచ్చి పనికీ పరాకాష్టగా కనిపించాయి. బాపూజీ ముఖంలోకి చూశా. ఎంత అద్భుతమైన ముఖమది. మృత్యు పరిష్వంగంలో చేరిపోయింది. ఆయన అభిమానుల వదనాలు దీనంగా మారిపోయాయి. ఎగురుతున్న గులాబీ రేకుల మధ్యలో నుంచి కనిపిస్తున్న మహాత్ముని వదనం నా నోటి నుంచి ధారాళంగా పదాల వెల్లువను సృష్టించింది. బాల్యంలో నేను చదువుకున్న ఏసు క్రీస్తు బోధనలలో ఒక వాక్యం గుర్తుకొచ్చింది. ఓ తండ్రీ వారిని మన్నించు. వారేం చేస్తున్నారో వారికే తెలియదు... శాశ్వత నిద్రలో ఉన్న మహాత్ముని పెదవులు కూడా అలాగే అన్నట్లు నాకనిపించింది. బాపూజీ మన్నించడానికి పెట్టింది పేరు. ఇంతవరకూ నేనలాంటి మనీషిని చూడలేదు. అదే సమయంలో నా భుజంపై ఓ చేయి పడింది. వెనక్కి చూస్తే ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ. ఆయన కళ్ళలోనూ అదే రకమైన అనుభూతి కనిపించింది. అది కూడా నేను మరిచిపోలేను.

గులాబి రేకలతో అంతిమ వీడ్కోలు

మహాత్ముని అంత్యక్రియల ఊరేగింపులో రేడియో వాహనం మెల్లిగా నడుస్తోంది. క్వీన్స్‌వే, కింగ్స్‌వే, హార్డింగే అవెన్యూ, బీటా రోడ్..మీదుగా రాజ్‌ఘాట్‌కు వాహనం చేరాలి. మా వెనుకే మహాత్ముని పార్థివదేహాన్ని ఉంచిన ట్రాలీ కదులుతోంది. ప్రజలంతా చూసేలా దేహాన్ని ఉంచారు. పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, దేవదాస్ గాంధీ, సర్దార్ బల్‌దేవ్ సింగ్, ఆచార్య కృపలానీ, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నిలబడి ఉన్నారు. లక్షలాదిమంది గాంధీ మహాత్మునికి ఇష్టమైన శ్లోకాలను చదువుతున్నారు. ఆ సమయంలో చెమర్చని కన్ను నాకు కనిపించలేదు. మరణానికి రెండు నెలల ముందు బహిరంగ సభలో ప్రసంగించిన జిల్లా జైలు వద్దకు యాత్ర చేరింది. జైలు శిక్ష అనుభవిస్తున్న వారినుద్దేశించి బాపూజీ అప్పుడు ప్రసంగించారు. ఆ ప్రసంగాన్ని నేనూ విన్నాను. ప్రేమాభిమానాలను వర్ణిస్తూ ఆయన ప్రసంగం సాగింది. సరిగ్గా అదే రోడ్డు మీదుగా యాత్ర సాగడం యాదృచ్ఛికం. గాంధీ భౌతిక కాయంపై స్వర్గం నుంచి పూల రేకులను వర్షించినట్లుగా ఉంది. యాత్రలో పాల్గొన్న ప్రజలు గుప్పెట్లో గులాబీలను తీసుకుని ఆకాశంలోకి విసురుతున్నారు. గాంధీజీ అమర్ రహే అంటూ నినదించారు. రోడ్డుకిరువైపులా ఉన్న భవనాలపై నుంచి పూలను జల్లుతూ గాంధీకి జై అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. యాత్ర అక్కడ కొద్ది నిముషాలపాటు నిలిచింది. గాంధీజీని కడసారి చూసుకునేందుకు ప్రజలు ముందుకు తోసుకొచ్చారు. మా రేడియో వ్యాన్‌ను కూడా లాగేశారు. దుఖం తాండవిస్తున్న వదనాలు గాంధీజీ మరణాన్ని జీర్ణించుకోలేమంటున్నాయి. ఓ మహిళ.. ఇది నిజం కాదు.. రేపు ప్రార్థనల సమయానికి బాపూజీ తిరిగొస్తారంటకూ భోరుమంది. ఎక్కడో తప్పు జరిగిందని అంటోంది. ఆమెలో ఆమె మాట్లాడుకుంటోందని నాకర్థమైంది. తనను తాను ఆమె అలా సంబాళించుకుంటోంది. ఆమె పక్కనే ఓ భిక్షువున్నాడు. అతడి కళ్ళు ఏడ్చిఏడ్చి ఉబ్బిపోయాయి. ఆ పక్కనే చక్కని దుస్తులు ధరించి ఉన్న మహిళ పరిస్థితి సైతం అదే. ధనిక, పేద లేకుండా దేశం యావత్తూ కుమిలిపోయిన క్షణాలవి. ఒక మరణం పేద, ధనికులను ఒకచోట చేర్చింది.. ఎంత ఆశ్చర్యం. గాంధీజీ భారత దేశమంతటా నిండిపోయారు. ఆయన సాధారణ తత్వం ప్రపంచంలోని అన్ని హృదయాలనూ గెలుచుకుంది. మా వ్యాను ముందుకు కదులుతుంటే ఓ చిన్నారి తన తల్లిని అడిగిన ప్రశ్న నా చెవిన పడింది. అమ్మా! గాంధీజి నిజంగా, శాశ్వతంగా వెళ్ళిపోయారా! అని. అసలు తిరిగి రారా అని కూడా ప్రశ్నించింది. తల్లి చెప్పిన సమాధానం గుర్రపు డెక్కల చప్పుడులో కలిసిపోయింది. బాపూజీ అంత్యక్రియలకు హాజరైన గుర్రాలు సైతం విచారంగా నడుస్తున్నట్లే అనిపించింది.

నిమజ్జన యాత్రలోనూ కన్నీటి ధారలు

యాత్ర రాజ్ ఘాట్‌కు చేరడానికి 5 నిముషాల ముందే నేను అక్కడికి చేరుకున్నాను. మా రెండో వాహనం అంత్యక్రియల వేదికకు 30 అడుగుల దూరంలో నిలిచి ఉంది. అక్కడికి చేరిన ప్రజలంతా నాకు కనిపించేందుకు నేను వాహనంపైకి ఎక్కి



నిలబడ్డాను. ప్రజలకు ఎటువంటి ప్రమాదమూ జరగకుండా చూసేందుకు చేసిన ఏర్పాట్లు నా దృష్టిని ఆకర్షించాయి. రక్షణ సిబ్బంది సాసర్ ఆకారంలో భుజంభుజం కలిసి రక్షణగా నిలుచున్న తరుణంలో చందనపు చెక్కలతో రూపొందించిన చితినుంచి తొలి జ్వాల నింగికెగిసిన తరుణంలోనే సూర్యభగవానుడు అస్తమించడం ఆరంభమైంది. అదే సమయంలో ప్రజల నుంచి పెద్ద నిట్టూర్పు కూడా ఆకాశానికెగిసింది. రాజ్‌ఘాట్‌పై ఒక తుపాను విరుచుకుపడిన తీరును తలపించింది. అడ్డుగా కట్టిన బ్యారికేడ్లను, తాళ్ళనూ, తీగలను తెంచుకుంటూ ఆడా, మగ తేడా లేకుండా చితిమంటలను చూసేందుకు బాధాతప్త హృదయాలతో ముందుకు తోసుకొచ్చారు. చందనపు చితి చుట్టూ చేరారు. వారి శోకంతో పాటూ చితిమంటలు ఉవ్వెత్తున ఎగిరిపడ్డాయి. చందనపు పరిమళం ఆ ప్రాంతాన్ని ఆవరించింది. గవర్నర్లు, రాయబారులు, క్యాబినెట్ మంత్రులు.. యమునా నదీ జలాలతో పవిత్రమైన, హరితహారంలా ఉన్న ప్రాంతంలో ఈ దృశ్యాలకు సాక్ష్యాలుగా నిలిచారు. ఈ సన్నివేశాలను చూసిన నా పరిస్థితి సుడిగుండంలో చిక్కుకున్న ఆకులా మారిపోయింది. మహాత్ముని పార్థివ దేహాన్ని ఆబగా కబళిస్తున్న చితిమంటల ఎత్తు మరింత పెరుగుతుండగా.. ఒక పక్క నుంచి చీకటి చుట్టుముట్టేసింది. లక్షలాదిమంది ఇళ్ళకు తిరుగు ముఖం పట్టినప్పుడు వారి కాలి నుంచి లేచిన ధూళి ఆ ప్రాంతాన్ని ఆవరించింది. జాతి పిత లేకుండానే ఇక తమ ప్రయాణం కొనసాగించవలసి ఉంటుందని వారికి అప్పటికి అర్థమైంది. ఆయన ప్రేమ లేదనీ అవగతమైంది. **చితిమంటల్లో వారు కడసారి బాపూజీ చిరునవ్వుల్ని చూసుకున్నారు. సోదరీ, సోదరుల్లారా అంటూ ఆయన చేసే సంబోధనలను ఆ చిటపటల్లో విన్నారు.** తుచ్ఛమైన ఈ ప్రపంచాన్ని వీడిన బాపూజీకి గుడ్‌బై చెప్పారు. అసత్యం, హింసలతో కూడిన ప్రపంచంలో జన్మించిన గాంధీ సత్యం, అహింసలతో కూడిన తనదైన ప్రపంచాన్ని నిర్మించారు. రాజ్‌ఘాట్‌నుంచి హృదయభారంతో వెనుదిరుగుతున్న ప్రజల శిరస్సులపైనుంచి చితిమంటలను గమనించిన నాకు గొంతులో ఏదో అడ్డం పడినట్టనిపించింది. మింగడానికి కష్టమైంది. ఆ రోజంతా అలాగే ఉంది. అలా అడ్డం పడిందేమిటో? లక్షలాదిమంది బరువెక్కిన గుండెలతో తిరుగుముఖం పడుతుండగా, వెండిరంగులో నక్షత్రాలు మెరుస్తూ, ప్రేమ, సత్యం, అహింసలకు ప్రతిరూపమైన బాపూజీకి స్వాగతం పలుకుతున్నట్లుగా కనిపించింది.

వ్యాఖ్యానం పూర్తయిన తరవాత నేను కొద్దిగంటల పాటు వ్యాన్‌పైనే కూర్చుండిపోయాను. ప్రజలంతా వెళ్ళేవరకూ అలాగే ఉండిపోయాను. మూర్ఛిల్లిన ఓ మహిళను వ్యానుపైకి

నేడు 70వ వర్ధంతి

చేర్చారు. ఒక బాలుడు, బాలికను కూడా అక్కడికి చేర్చారు. **ఆ జనప్రవాహంలో ఒక చేయి వ్యాను పైభాగాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించడం కనిపించింది. చూస్తే.. అది ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ. వెంటనే చేయి అందించి, ఆయనను పైకి లాగాను.** గవర్నర్ జనరల్‌ని చూశారా అని ఆయన నన్ను ప్రశ్నించారు. ఆయన అరగంట ముందే ఇక్కడినుంచి వెళ్ళిపోయారని బదులిచ్చాను. సర్దార్ పటేల్??? ఆయన కూడా కొద్ది నిముషాల ముందు అక్కడి నుంచి నిష్క్రమించారు. ఆ ప్రజా సమూహంలో కలిసి వచ్చిన స్నేహితులై వేరైపోయారు. ప్రధానిని చూసిన ప్రజలు వ్యాను చుట్టూ చేరారు. ఆయనేమైనా మాట్లాడతారేమోనని చూశారు. ఆ సమయంలో నా మదిలో ఒక అద్భుతమైన ఆలోచన కలిగింది. ఒక అత్యద్భుతమైన వ్యక్తి దగ్గరగా ఉన్నానన్నదే ఆ యోచన. ఒక పక్కన జాతిపిత దేహం అగ్నికి ఆహుతవుతుంటే.. భారత మాత పుత్రుడు జవహర్‌లాల్ నెహ్రూ, స్వాతంత్ర్యమనే దీపశిఖను సజీవంగా ఉంచడానికి జాతికి తనను తాను అంకితం చేసుకున్నారు. మరుసటి రోజు 2 గంటలకు నేను ఇల్లు చేరాను. తిరిగి రాజ్‌ఘాట్‌కు వెళ్ళేసరికి అక్కడ చితినుంచి పొగలొస్తున్నాయి. ప్రజలు అదృశ్యమయ్యారు. దుమ్మూ, ధూళీ సర్దుకున్నాయి. ఒక గార్డును అక్కడుంచారు. ఒక్కసారి రాజ్‌ఘాట్‌వైపు చూశాను. మొత్తం దృశ్యాలను గుర్తుకు తెచ్చుకున్నాను. ఆ చీకటిలో తెల్లటి ఖాదీ వస్త్రాన్ని ధరించిన మచ్చలేని మహనీయుడు నా మస్తిష్కంలో ఆవిష్కృతమయ్యాడు. దృఢనిశ్చయంతో కూడిన దృక్కులతో ఆయన కనిపించారు. ప్రజల శిరసుల పైనుంచి ఆయన చూస్తున్నారు.

ఫిబ్రవరి 11వ తేదీ...సమయం తెల్లవారు జామున నాలుగున్నర గంటలు..నేను గ్రీన్ అస్తి స్పెషల్ కంపార్ట్ మెంట్ ఎదురుగా నిలుచున్నాను.ఆ బోగీలో గాంధీజీ అస్తికలు ఉంచారు. అందులో అన్నీ మూడవ తరగతి బోగీలే. గాంధీజీ ఎప్పుడూ మూడవ తరగతిలోనే ప్రయాణం చేసేవారు. మూడవ బోగీ లో ఏం మంట అది ఎర్రగా వెలిగిపోతోంది. బోగీలో దీర్ఘచతురాస్రాకారంలో ఒక టేబిల్ ఉంది. దానిపై శవపేటిక లో అస్తికల కలశం ఉంది.ఆ పేటికపై చేతితో నేసిన త్రివర్ణ పతాకం పరిచారు.ఆకుపచ్చ ఆకులతో నేసిన ఒక చాప ఉంది. దానిపై తెల్లని పూలు,కాషాయి రంగు ఆకులుఉన్నాయి. పూర్తిగా త్రివర్ణ పతాకంతో కప్పివేసారు.మధ్య భాగంపై ఫ్లడ్ లైట్ల కాంతి విరజిమ్మేట్టు ఏర్పాటు చేశారు.

బయట ఫ్లాట్ ఫారంపై వేలాది మంది ప్రజలు గాంధీజీ అస్తికల కలశాన్ని దర్శించి నివాళులర్పించేందుకు వేచి ఉన్నారు.ఉదయం ఆరున్నర గంటలకు గార్డు ఈలవేశాడు. గ్రీన్ బోగీలు కొత్తఢిల్లీ స్టేషన్ బయటకు వచ్చాయి. ఆ రైలు కదలుతుండగా, ప్రజలు కట్టలు తెగే కన్నీరు ధారగా ప్రవహిస్తుండగా, విలపిస్తూ జాతిపితకు కడసారి వీడ్కోలు చెప్పారు. గాంధీజీ అస్తికల కలశంపై గులాబీ రేకులనూ,పూలదండలను మంత్రాలు చదువుతూ విసిరారు. శిరసావహించి భక్తిప్రపత్తులతో ప్రణామం చేశారు. తమ తలలు ఎంత గర్వంగా పైకి ఎత్తాలో నేర్పిన జాతిపితకు శిరసు వంచి ప్రమాణం చేశారు.

మా బోగీ మధ్య బోగీ పక్కన ఉంది.ఆ బోగీలోనే గాంధీజీ అస్తికల కలశం ఉంది. కిటికీల్లోంచి బయటకు చూస్తే, పొలాలన్నీ బంగారు తివాచీల్లా కనిపించాయి. నేలపై పరిచిన బంగారు దుప్పట్ల మాదిరిగా కనిపించింది. మామూలుగా అయితే, ఆ దృశ్యం హృదయాలను పులకింపజేసేదే. పొలాల్లో రైతులకూ,వ్యవసాయ కూలీలకు బోధిస్తూ ఒక వ్యక్తి పెద్ద అడుగులేస్తూ వెళ్తున్న భావన కలిగింది.గ్రామీణులంతా రైలు కట్టకుఇరువైపులా నిలబడి ఉబికివస్తున్న కన్నీరును తుడుచుకుంటూ గాంధీజీకి నివాళులర్పించారు. స్పెషల్ రైలు అంతిమ యాత్ర కొనసాగుతోంది. ఘజియాబాద్,ఖుర్జా,ఆలీగఢ్, హథ్రాస్,తుండ్లా, ఫిరోజాబాద్, ఎటావా, ఫాఫుండ్,కాన్పూర్, ఫతేపూర్, రసూల్ బాద్ స్టేషన్లలో ఇసుక వేస్తే రాలనంతగా జనం ఉన్నారు.తుండ్లాలో మా బోగీ వైద్యశాలగామారిపోయింది.అనేక మంది మహిళలు స్పృహతప్పి పడిపోయారు. విషాదం నిండి ఉంది. సంపూర్ణమైన ఆశ ఉంది.గీతా శ్లోకాల పఠనం నిరంతరం సాగుతూనే ఉంది.అది చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే, ఆయనకు మరణం లేదనిపించింది.ఎవరో ఇలా అంటున్నట్టు అనిపించింది.


ఎవరనగలరు ఒక వ్యక్తిని హత్య చేశారని
ఎవరు భావించగలరు నేను వధించబడ్డానని...
జీవితాన్ని ఎవరూ అంతం చేయలేరు. జీవితం అంతంకాదు.
ఆత్మకు పుట్టుక లేదు. ఆత్మకు చావు లేదు.

బుల్లెట్ గాయాలపై ఎర్ర గులాబీ

మీకు నారింజ ఇష్టమేనా? ఇలా ఎవరో అడిగేసరికి నాకు గుర్తొచ్చింది నేనేమీ తినలేదు కదా అని.నా బోగీ కిటికీకి దగ్గరగా వచ్చిన వ్యక్తివైపు చూశాను.మళ్ళీ బోగీలో చూశాను.అక్కడ అంత గాంధీజీని గౌరవించేవారు,భక్తితో ఆరాధించేవారూ ఉన్నారు.

విఎ సుదర్శన్ అనే మా మిత్రుడు ముప్పయిరెండేళ్ళ వయస్కుడు. గాంధీజీకి ప్రియ శిష్యుడు. మేం ఇప్పుడే ఫతేపూర్ దాటామని నాకు గుర్తుకు వచ్చింది. పురుషులు, బాలురు రైలుతో పోటీ పడి ఒక కిలోమీటరు దూరం పరిగెత్తారు. గాంధీజీ అస్తికల కలశంపై ఉంచేందుకు తెచ్చిన పువ్వులు వారిచేతుల్లో కనిపించాయి.రైలు వేగాన్ని అందుకోవడంతో వారంతా వెనక్కి వెళ్ళిపోయారు. మహాత్మాగాంధీ వర్ధిల్లాలి అనే వారి నినాదాలు మాత్రం చెవుల్లో చాలా సేపు గింగురు మన్నాయి. మా మిత్రుడు ఎర్రని గులాబీని చూస్తూ ఆలోచనలోపడ్డాడు.ఆతడి కళ్ళంట నీళ్ళు బొటబొటా రాలాయి.ఇలాంటి గులాబీనే బుల్లెట్ గాయాలపై ఉంచాను. అని గొణుక్కున్నా డు.మా మధ్య సంభాషణ ఏమీ జరగలేదు. బయట ఆకాశం ఎర్రగా కనిపించింది. స్వర్ణకాంతులీనుతూ సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆ గులాబీని చేతిలోకి తీసుకున్నాను.అది గతంలో ఎన్నడూ లేనంత అందంగా కనిపించింది. సువాసనలను వెదజల్లింది. అక్కడ ఒక సైనికుడు సైనిక దుస్తుల్లో ఉన్నాడు.రైలు ఆ స్టేషన్ దాటుతుంటే వంగి నమస్కరించాడు.

దారి పొడవునా లక్ష లాది మంది గాంధీజీకి కన్నీటి ధారలతో నివాళులర్పించారు. మహాత్మా గాంధీకీ జై అనే నినాదాలు మార్మోగాయి.లక్షలాది మంది ప్రార్థనలు చేశారు. అన్ని రంగాలకు చెందిన వారూ వచ్చారు.వారందరిలో గాంధీజీపై పరిపూర్ణమైన భక్తి ఉంది. వారి నోటంట మహాత్మాగాంధీ అమర్ రహే అనే నినాదాలు వినిపించాయి. త్రివేణి సంగమం వద్ద అంతిమ యాత్ర ముగిసింది. మహాత్మాగాంధీ పవిత్ర అవశేషాలను త్రివేణి సంగమంలో నిమజ్జనం చేశారు.పవిత్రమైన,యోగి పుంగవుడి అస్తికలను అంతే పవిత్రమైన త్రివేణి సంగమంలో రామదాస్ గాంధీ నిమజ్జనం చేశారు. నేను ఒకపడవపై నిలబడి ఉన్నాను. అస్తికల నిమజ్జనం జరిగిన ప్రదేశానికి కొద్దిగజాల దూరంలో ఉన్నాను.వేలాది మంది ప్రజలు ఆ దృశ్యాన్ని అతి దగ్గర నుంచి చూసేందుకు ఎంతో ఆత్రుతను ప్రదర్శించారు. పీపాల కొద్దీ పాలు పోశారు. ఆ పాలతో ఆ నదీ జలాలు శ్వేత జలాలుగా కనిపించాయి.అది ఒక ప్రస్థానపు ముగింపు.ఆయన అనంతలోకాల్లోకి చేరిపోయాడు.ఆ దృశ్యాన్ని వీక్షించిన వారంతా నాలాగే అనుకుని ఉంటారు.మనంకూడా అలా గాలిలో కలపాల్సిందేనని. ఓ భగవంతుడా! ఆలయాల్లో అర్చనలు చేయలేదు. నాది గంభీరమైన జీవితం కాదు, అలా అని క్లిష్టమైనదీ కాదు.కాని నేను కృతజ్ఞతలు తెలిపాను నదీ దేవత నిరంతరం ప్రవహిస్తూ, దప్పికగొన్నవారికి దాహంతీరుస్తోంది. ప్రయాగ అంతటా చీకటి అలుముకుంది. అప్పుడప్పుడే దీపాలు వెలిగిస్తున్నారు. మేం వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాం.త్రివేణి సంగమం వైపు ఒక్కసారి పరికించి చూశాను.ఇప్పుడు దీపాలు మరిన్ని కాంతివంతంగా వెలుగుతున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. ఆ నక్షత్రాల్లో బాపూజీ ఉన్నారు.ఆయన జ్ఞాపకాలు ఆ దీపాల మాదిరిగానే మెరుస్తున్నాయి. నిజమే దీపం ప్రకాశమానం అవుతుంది.దాని కాంతి నిశీధిలోకి చొచ్చుకునిపోతుంది.ఈ నాగరికత ఉన్నంతకాలం ప్రకాశిస్తూనే ఉంటుంది.



మెల్వీ డి మెలో, వ్యాస రచయిత

పల్స్ పోలియో విజయవంతం



ఓ చిన్నారికి మందు వేస్తున్న హైదరాబాద్ డీఎంహెచ్ఓ పద్మజ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలియో చుక్కలు వేయిద్దాం..పిల్లల బంగారు భవితకు బాటలు వేద్దాం అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం అనుకున్న దానికన్నా విజయ వంతంగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియోచుక్కలను వేయాలని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా 28 వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఒక్కరోజే 36,22,931 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. 29వ తేదీ ప్రభుత్వం అనుకున్న విధంగా టార్గెట్ పూర్తి కావడంతో పాటు ఎక్కువ మంది పిల్లలకు ఈ చుక్కలను వేశారు. మంగళవారం కూడా ఇంటింటికీ తిరిగే కార్యక్రమం ఉందని ఇంకా ఎక్కువగా చుక్కల నమోదు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం ఇంటింటికీ ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బంది తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. సోమవారం అనుకున్న విధంగా లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రాజెక్టు రెక్కల వాహనాలను సైతం అంగన్‌వాడీ వర్కర్లు ఉపయోగించారని అధికారులు పేర్కొన్నారు. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగామని పలు జిల్లాల డీఎంహెచ్ఓలు పేర్కొన్నారు. పోలియో కార్యక్రమంలో భాగంగా 50 లక్షల డోస్‌లను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచింది. మొదటిరోజు 22,768 పోలియో కేంద్రాల ద్వారా 95,500 మంది సిబ్బంది పోలియో చుక్కలను వేశారు. ప్రయాణాల్లో ఉన్న వారి కోసం ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లలో, రైల్వే స్టేషన్‌లలో మరియు ప్రధాన కూడళ్లలో ఈ పోలియో చుక్కలను వేశారు.

- రెండో రోజు టార్గెట్ పూర్తి
- అందుబాటులో 50 లక్షల డోస్‌లు

హైదరాబాద్ జిల్లాలో 100 శాతం పూర్తి

హైదరాబాద్ జిల్లాల్లో 3,97,388 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు 4,30,000 మంది పిల్లలకు చుక్కలను వేశారు. రెండోరోజూ 44,540 మంది పిల్లలకు ఈ చుక్కలను వేయించినట్టు హైదరాబాద్ డీఎంహెచ్ఓ కె. పద్మజ తెలిపారు. దీనికోసం మొదటిరోజు 2,888 పోలియో బూత్‌లను ఏర్పాటు చేయగా, 13,804 సిబ్బంది పనిచేశారని ఆమె తెలిపారు. వీరితో పాటు 188 సంచార వాహన టీంలు, 6616 ఇంటింటికీ తిరిటే టీంలను ఏర్పాటు చేశామన్నారు. 88 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధను పెట్టామని అక్కడ కూడా ఈ పల్స్ పోలియో చుక్కలను వేయించామన్నారు. మూడోరోజు మరో 30 వేల మంది చిన్నారులకు చుక్కలను వేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

ఖమ్మంలో మొదటి రోజు 96.9 శాతం

ఖమ్మం జిల్లాలో 1,26,741 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు 96.9 శాతం నమోదయ్యింది. రెండోరోజూ కూడా అది కూడా పూర్తయ్యిందని, పోలియో చుక్కలు వేయించుకొని వారు ఉంటే ఇంకా ఎవరైనా ఉంటే మంగళవారం అది కూడా పూర్తి చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండల్‌రావు తెలిపారు.

వరంగల్ అర్బన్‌లో 96.4 శాతం



ఓ చిన్నారికి మందు వేస్తున్న వరంగల్ డీఎంహెచ్ఓ డా. హరీష్‌రాజు

వరంగల్ అర్బన్‌లో 1,04,008 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు 1,00,268 మంది పిల్లలకు చుక్కలను వేశారు. మొదటి రోజు 96.4 శాతం నమోదయ్యింది. రెండోరోజూ ఇంటింటికీ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు తిరిగి పోలియో చుక్కలను వేశారని, దీంతోపాటు బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్‌రాజు తెలిపారు.

యాదాద్రి-భువనగిరి జిల్లాలో 95 శాతం

యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో 65,038 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు 63,335 మందికి చుక్కలను వేశారు. రెం డోరోజూ ఇంటింటికీ తిరిగి చుక్కలను వేశారని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు తెలిపారు.

రంగారెడ్డిలో 97 శాతం

రంగారెడ్డి జిల్లాల్లో 3,34,531 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా మొదటి రోజు 3,31,085 మంది పిల్లలకు చుక్కలను వేశారు. మొదటిరోజు ప్రతి డివిజన్‌లో ఎమ్మెల్యేతో ఈ కార్యక్రమం నిర్వహించడం బాగా కలిసొచ్చిందని రంగారెడ్డి డీఎంహెచ్ఓ బాలాజీ పవార్ తెలిపారు. రెండోరోజూ జిల్లాల్లో ఏఎన్ఎం, అం గన్‌వాడీలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగి 18 వేల మం ది చిన్నారులకు పోలియోచుక్కలను వేశారని ఆయన తెలి పారు. మొదటిరోజు 1,600 బూత్‌లు, 8,037 మంది సిబ్బంది పనిచేశారని ఆయన పేర్కొన్నారు.

ఇది సమష్టి విజయం



పల్స్ పోలియో విజయవంతం కావడం సంతోషంగా ఉంది. ఇది అందరి సమష్టి విజయంగా భావిస్తున్నాం. గతంలోనూ టీకాల విషయంలో 100 శాతం సక్సెస్ సాధించాం. అందుబాటులో ఉన్న అన్ని వాహనాలను రాష్ట్ర వ్యాప్తంగా ఉపయోగించి పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు కృషి చేశారు. బంగారు తెలంగాణలో భాగంగా ఇంటింటికీ వైద్యం అందించడానికి కృషి చేస్తున్నాం.

కోడిపందాల నిర్వహణపై ఆగ్రహం

- నిందితులెవరు? ఎన్ని కేసులు పెట్టారు?

వివరాల కోసం ఏపీ సీఎస్‌కు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలను నిర్వహించడంపై ఉమ్మడి హైకోర్టు అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసింది. కోడిపందేలను నిర్వహించకుండా నిలువరించాలని తాము ఇచ్చినప్పటికీ అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడి పందేలకు ప్రజాప్రతినిధులు బహిరంగంగా మద్దతివ్వడం పట్ల హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉభయగోదావరి జిల్లాల్లో నిర్వహించిన కోడిపందేలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయని నిలదీసింది. ఆ రెండు జిల్లాల్లో 806 ప్రదేశాల్లో జరిగిన కోడిపందేలను ఎవరు నిర్వహించారు. నిందితులు ఎవరో చెప్పండి. గత సంవత్సరం కోడి పందేలను నిలువరించడంలో విఫలమైన తహసీల్దార్లు,ఎస్‌ఐలపై తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలను నాలుగు వారాల్లో సమర్పించాలని ఏపీ సీఎస్, డీజీపీలను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎమ్మెస్కే జైస్వాల్ తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. గత ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ హైకోర్టుకు హాజరయ్యారు. అయితే అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశం ఉన్నందువల్ల ఏపీ డీజీపీ మాలకొండయ్యకు వ్యక్తిగత హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు నిచ్చింది. తదుపరి విచారణకు తనకూ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ సీఎస్ అభ్యర్థించగా ధర్మాసనం అంగీకరించి, అనుమతించింది.

నేరస్తుల సమగ్ర సర్వేపై వ్యాజ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సకల నేరస్తుల సమగ్ర సర్వే వ్యవహారంలో హాజరు కావాలంటూ పోలీసులు నేరస్తులను ఆదేశించవచ్చునని పేర్కొంటూ తెలంగాణ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్‌లో స్పష్టత లోపించినందువల్ల కొట్టివేయాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. తనపై ఎలాంటి కేసు పెండింగులో లేనప్పటికీ వేలిముద్రలు, ఫోటో, ఆధార్, పాసుపోర్టు వివరాల వంటి ఆధారాలు సేకరించేందుకు రావాలంటూ కల్వకుర్తి ఠాణా పోలీసులు ఇబ్బంది పెడ్తున్నారని పిటిషనర్ విన్నవించారు. ఈ వ్యాజ్యాన్ని నాగర్ కర్నూలు జిల్లా, కల్వకుర్తికి చెందిన అబ్దుల్ హఫీజ్ దాఖలు చేశారు. తనపై నమోదైన ఐపీసీ సెక్షన్లు 420, 465 కేసులను కల్వకుర్తి మెజిస్ట్రేట్ కొట్టివేశారని పిటిషనర్ తెలిపారు. తెలంగాణ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్ మళ్లీమళ్లీ తీవ్రమైన నేరాలు చేసే పాత నేరస్తులకు మాత్రమే వర్తిస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. అందువల్ల ఈ సర్క్యులర్ తనకు వర్తించదని కల్వకుర్తి పోలీసు ఠాణా లోని ఎస్ హెచ్‌వో ను ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా తెలంగాణ హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నాగర్ కర్నూలు ఎస్పీ, కల్వకుర్తి ఠాణా ఎస్ హెచ్ వో లను చేర్చారు.

రైల్వే ఉద్యోగికి జైలుశిక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేసిన రైల్వే ఉద్యోగి ఒకరికి సిబిఐ కోర్టు జైలు శిక్ష విధించింది. లాలాగూడలోని రైల్వే వాటర్ వర్క్స్‌లో ఫిట్టర్‌గా పని చేస్తున్న కోటి స్టీఫెన్ ఆదిత్య (కెఎస్ ఆదిత్య) రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు 2013లో సిబిఐకి ఫిర్యాదు అందింది. దీంతో రంగంలోకి దిగిన సిబిఐ అధికారులు ఒక వ్యక్తిని ఆదిత్య వద్దకు పంపించి ఉద్యోగం కావాలని కోరి రూ. 20 వేల లంచం ఇప్పిస్తూ పట్టుకున్నారు. అనంతరం విచారించగా, ఆదిత్య పలువురిని ఇదే తరహాలో మోసం చేసి దాదాపు రూ. 11 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. ఈ మేరకు కేసును నమోదు చేసిన సిబిఐ అధికారులు కోర్టుకు చార్జిషీట్‌ను సమర్పించారు. ఈ కేసును విచారించిన ప్రత్యేక కోర్టు ఆదిత్యకు లక్ష రూపాయల జరిమానాతో పాటు అయిదేళ్ళ సాధారణ జైలు శిక్షను వేర్వేరు సెక్షన్‌ల కింద విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది.

ఏసీబీకి చిక్కిన భద్రాద్రి డీఈవో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పాఠశాల గుర్తింపు కోసం ఫైల్‌పై సంతకం చేసేందుకు రూ. 25 వేల లంచం తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా శాఖ అధికారి సైదులు ఏసిబికి చిక్కారు. లక్ష్మీ చిల్డ్రన్స్ స్కూల్ ప్రిన్సిపల్, డైరెక్టర్ అంథోనీ డిసౌజా తన స్కూల్ ప్రభుత్వ గుర్తింపును కొనసాగించాలని దరఖాస్తు చేశారు. ఇందుకు రూ. 25 వేల లంచం ఇవ్వాలని డిఇవో సైదులు డిమాండ్ చేశారు. దీంతో డిసౌజా ఏసిబి అధికారులను ఆశ్రయించగా మాటు వేసిన ఏసిబి అధికారులు సోమవారం మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలోలంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి డిఇవోను ఏసిబి ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు.

చల్లప్ప కమిషన్ గడువు పొడిగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గిరిజన సమస్యలపై ఏర్పాటైన ఎస్, చల్లప్ప కమీషన్ గడువును పొడిగించారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్టీల సమస్యలతో పాటు వాల్మీకీ బోయ, కైతా లంబాడీలను ఎస్టీలుగా గుర్తించాలని వస్తున్న డిమాండ్లను కమీషన్ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందచేయవలసి ఉంటుంది. కమీషన్ అధ్యయనం పూర్తి కానందున ఫిబ్రవరి 2018 నుండి 2019 జనవరి 31 వరకు కాలపరిమితిని పొడిగించడం జరిగింది. 2015 మార్చి 3వ తేదీన చల్లప్ప చైర్మన్‌గా కె. జగన్నాథ్‌రావు, హెచ్. కె. నాగు సభ్యులుగా కమీషన్‌ను ఏర్పాటు చేశారు. అధ్యయనం పూర్తి కానందున ఇప్పటి వరకు గడువును పొడిగిస్తూ వస్తున్నారు. ఏడవ సారి పొడిగింపులో సంవత్సర కాలం గడువిచ్చారు.

రవాణా వాహనాలకు వే-బిల్ ఉండాల్సిందే


హై దరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సరుకులను తరలించే వాహనాలు తప్పనిసరిగా ఇ వే బిల్లులను కల్గి ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ వి అనిల్ కుమార్ వెల్లడించారు. రూ.50వేల విలువకు మించిన సరుకులను చేరవేసే వాహనాలు వీటిని కల్గి ఉండాల్సిందేనని, ఆయా సరుకులను రాష్ట్రంలో, రాష్ట్రం వెలుపల ఎక్కడకు తరలించినా వీటిని తీసుకోవాల్సిందేనని తెలిపారు. ఇందుకు నిర్దేశిత ఇ వే బిల్ ఎన్ఐసి వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని పొందాలన్నారు.

కాపురంలో చిచ్చురేపిన ఫేస్‌బుక్

భర్తను కాదని కానిస్టేబుల్‌తో సహజీవనం



కానిస్టేబుల్ సందీప్



నాగరాజు దంపతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫేస్‌బుక్ పరిచయం ఒక కాపురంలో చిచ్చు పెట్టింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన కానిస్టేబుల్‌తో తన భార్య పరిచయం పెంచుకుని తనను నిర్లక్ష్యం చేస్తోందని, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుని తన కాపురాన్ని నిలబెట్టాలని ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఈ సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మలక్‌పేటకు చెందిన స్వప్నకు కొన్నాళ్ళ క్రితం శంషాబాద్ ప్రాంతంలో నివసించే నాగరాజుతో వివాహమైంది. ఫేస్‌బుక్ ద్వారా స్వప్నకు మొఘల్‌పుర పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సందీప్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ఇద్దరి మధ్య ప్రేమకు దారి తీసింది. దీంతో స్వప్న భర్తను దూరం పెట్టి కొన్నాళ్ళుగా సందీప్‌తో అత్యంత చనువుతో తిరగడం ప్రారంభించింది. ఇదేమని నాగరాజు ప్రశ్నిస్తే నా ఇష్టమంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వసాగింది. దీంతో చేసేది లేని నాగరాజు తన భార్య స్వప్నను కానిస్టేబుల్ సందీప్ లొంగదీసుకున్నాడని, తనను నిర్లక్ష్యం చేయడానికి కారణం సందీపే కారణమని, వీరిద్దరికీ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైందని, ఆ పరిచయం తన కాపురాన్ని కూలుస్తోందంటూ ఆర్‌జిఐఎ పోలీసులను ఆశ్రయించాడు. సందీప్‌పై క్రమ శిక్షణ చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పిస్తే తన భార్య తనకు దక్కుతుందని వాపోయాడు. దీంతో విషయం తెలుసుకున్న అధికారులు సందీప్‌ను వెంటనే విధులలో నుంచి తప్పించి హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. స్వప్నకు కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసులు నిర్ణయించారు.

సర్కార్‌ను గద్దె దింపడమే లక్ష్యం

- అఖిలపక్ష సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ
- మద్దతు తెలిపిన విపక్షాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించడమే తమ కర్తవ్యమని, ఆ సమయం కోసం ఎదురు చూస్తున్నామని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం సోమవారం జరిగింది. దీనికి అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వాళ్లకు ప్రెస్‌క్లబ్‌లో సమావేశాలు జరుపుకోవడానికి పర్మిషన్‌ను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేరు మీద ఈ అఖిలపక్ష సమావేశానికి అనుమతి తీసుకున్నామన్నారు. కేసీఆర్ నియంతృత్వ ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను హరించడంలో కేసీఆర్ ముందున్నారన్నారు. కేసీఆర్ అహంకారాన్ని తగ్గించడానికి ప్రతిపక్షం ముందుండాలని మేము దానికి పూర్తి స్థాయి మద్దతిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం పార్లమెంట్ లోనే నానుతుందని ఇప్పటివరకు దానిపై ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

ఎమ్మార్పీఎస్‌ది కులపిచ్చికాదు: గద్దర్

ఎమ్మార్పీఎస్‌ది కులపిచ్చి ఉద్యమం కాదు.. కుల స్పృహ ఉద్యమం. అందుకే ఈ ఉద్యమానికి నేను కూడా మద్దతు ఇస్తున్నానని ప్రజాకవి గాయకుడు గద్దర్ పేర్కొన్నారు. వర్గీకరణ ఉద్యమంలో భాగంగా మంద కృష్ణనాయకత్వంలో పనిచేస్తానని గద్దర్ పేర్కొన్నారు.

హక్కుల కోసమే ఉద్యమం: కోదండరాం

టీజేఏసీ చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ ఉద్యమం మాదిగ హక్కుల కోసం జరిగే ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వం తరపున అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లకపోతే మనమే అఖిలపక్షంగా ఢిల్లీకి వెళ్లి ప్రభుత్వానికి విన తిపత్రం ఇద్దామని ఆయన సూచించారు. ఉమ్మడి రాష్ట్రం లో అరెస్టు కానీ మందకృష్ణ సొంత రాష్ట్రంలో ఇప్పటికి రెండుసార్లు ఎందుకు అరెస్టు అయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రిజర్వేషన్ల ఫలాలు అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు దక్కడం లేదని న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్ పేర్కొన్నారు.

కోర్టు జోక్యం చేసుకోవడం వల్లే ...: లక్ష్మణ్

కోర్టు జోక్యం చేసుకోవడం వలన ఎస్సీ వర్గీకరణ వెనకకు వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే లక్ష్మణ్ పేర్కొన్నారు. వర్గీకరణకు బీజేపీ సానుకూలంగా ఉందన్నారు.సీఎం బాధ్యత వహించి తీర్మానం చేస్తే కేంద్రాన్ని ఒప్పించడానికి మేము సిద్ధమేనని తెలిపారు. వర్గీకరణకు టీడీపీ సంపూర్ణంగా మద్ధతు ఇచ్చిందని తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ పేర్కొ న్నారు.

రాహుల్‌గాంధీతో మాట్లాడతా:ఉత్తమ్‌కుమార్

వర్గీకరణ విషయమై రాహుల్‌గాంధీతో మాట్లాడతానని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మందకృష్ణమాదిగకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఈ విషయంపై ఎందుకు మాట్లాడడం లేదో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అఖిలపక్షంలో తీసుకున్న నిర్ణయాలను పార్టీ పరంగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తానన్నారు. ఒకవేళ ఈ ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లలేకపోతే సీపీఐ ఆధ్వర్యంలోనైనా ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలవడానికి సిద్ధమని ప్రకటించారు.

విజయవాడ-కాకినాడ-రాయచూర్ మధ్య 16 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విజయవాడ - రాయచూర్, కాకినాడ టౌన్-రాయచూర్ మధ్యన 16 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. విజయవాడ - రాయచూ ర్ మధ్యన 8, కాకినాడ - రాయచూర్ మధ్యన 8 ప్రత్యేక రైళ్లను నడిపించనున్నామని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఎం. ఉమా శంకర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ - రాయచూర్ ప్రత్యేక రైలు విజయవాడలో ఫిబ్రవరి 1, 8, 15, 22 తేదీల్లో 23.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 11.30 గం. రాయచూర్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో రాయచూర్ నుండి ఫిబ్ర వరి 4, 11,18, 25 తేదీలలో 17.30 గం. బయలుదేరి మరుసటి రోజు 5.30 గం. విజయవాడ చేరుకుంటాయి. కాకినాడ - రాయ చూర్ ప్రత్యేక రైళ్లు కాకినాడలో 3, 10, 17, 24 తేదీల్లో 13.40 గం. బయలుదేరి మరుసటి రోజు 08.15 గం.కు రాయచూర్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో 2, 9, 16, 23 తేదీల్లో బయలుదేరి మరుసటి రోజు కాకినాడకు చేరుకుంటాయి.

నల్గొండ జిల్లాలో జంట హత్యలు

- అక్రమ సంబంధంతో తల, మొండెం వేర్వేరుచోట్ల...
- యువతి హత్య, పిల్లకాల్వ పక్కన కాల్చి పడేశారు



రమేష్ మొండెం. దర్గాపై రమేష్ తల

నల్గొండ (టౌన్)/నాగారం, ప్రభన్యూస్ : నల్గొండ జిల్లాలో రెండు వేర్వేరు సంఘటనల్లో రెండు హత్యలు సంచలనం కలిగించాయి. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య జరిగి ఐదు రోజులు గడవకముందే మరో హత్య జరిగింది. దుండగులు అతి కిరా తకంగా చంపి తల, మొండెం విడదీసి ప్రకాశం బజార్‌లోని దర్గావద్ద తలను ఉంచి వెళ్ళారు. మొండెంను భారత్ గ్యాస్ గోదాం సమీపంలోని చర్చి పక్కన పడేశారు. ఈ హత్య వివాహేతర సంబంధంతోనే జరిగిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

కనగల్ వాసి పాలకూరి రమేష్ ట్రాక్టర్, ఆటో డ్రైవర్. రమేష్‌కు కూతురు అశ్విని, కుమారుడు భాను ప్రసాద్, భార్య అనిత ఉన్నారు.రమేష్ కామెర్ల వ్యాధికి మందుకూడా ఇస్తుంటాడు. ఇదిలా ఉంటే రమేష్ భార్య అనితకు అదే గ్రామానికి చెందిన రాయల రామకృష్ణకు కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఆ నేపధ్యంలోనే ఆరు నెలల క్రితం హతుడు రమేష్‌కు, రామకృష్ణల మధ్య గొడవలు జరిగాయి. అయితే తమ సంబంధానికి రమేష్ అడ్డువస్తున్నాడని నల్గొండలో ఉన్న స్నేహితుడు సత్తార్‌కు విషయం చెప్పాడు. సత్తార్ తన బంధువైన మోసిన్‌ను సంప్రదించి రమేష్ హత్యకు పథకం పన్నారు. కామెర్ల మందులు ఇచ్చే రమేష్‌కు మోసిన్ ఫోన్‌చేసి తనకు మందు కావాలని నల్గొండకు పిలిపించుకున్నాడు. మిర్యాలగూడ రోడ్డులోని భారత్‌గ్యాస్ గోదాం సమీపంలో రమేష్‌తో కొద్దిసేపు మాట్లాడి అక్కడే మద్యం సేవించారు. అనంతరం రమేష్‌ను హత్యచేసి మొండెంను అక్కడే పడ వేసి తలను ప్రకాశంబజార్‌లోని దర్గా దిమ్మెవద్ద పెట్టి వెళ్ళారు. దర్గావద్ద ఉన్న తలను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్‌పి సుధాకర్, వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మొండెంను వెతికేందుకు డాగ్ స్క్వాడ్‌ను ఉపయోగించగా నిందితుని ఇంటి వద్దకు డాగ్‌స్క్వాడ్ వెళ్ళడంతో ఇంటిలో ఉన్న మోసిన్, సత్తార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామకృష్ణ శివలు కర్నూలు పారిపోయారు.

యువతి దారుణ హత్య..కాల్చిపడేశారు

నల్గొండ జిల్లా, నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట ఆవాస గ్రామమైన విజయనగర్ కాలనీకి చెందిన ఆకారపు అడిమయ్య - లక్ష్మమ్మ దంపతులకు నాల్గవ సంతానమైన ఆకారపు అన్నపూర్ణ (20)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి కాల్చివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకారపు అడిమయ్య-లక్ష్మమ్మ దంపతుల నాల్గవ కుమార్తె అన్నపూర్ణ తిరుమలగిరి మండల కేంద్రంలోని సత్యం కంప్యూటర్‌లో శిక్షణ పొందుతుంది. ఈనెల 26న ఉదయం 7 గంటలకు ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్ళిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్ళలో ఆరా తీశారు. సోమవారం ఉదయం ఎస్ ఆర్ఎస్‌పి పిల్ల కాలువ పక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని శవం ఉందని అటుగా వెళ్తున్న వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిఐ జె.రవీందర్ చేరుకోగా, విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి లక్ష్మమ్మ అక్కడకు చేరుకొని చెప్పులు, కాళ్ళ పట్టీలను గుర్తించి ఆ మృతదేహం కుమార్తె అన్నపూర్ణదే అని పోలీసులకు తెలిపారు. అన్నపూర్ణ తండ్రి అడిమయ్య పెద్దకుమార్తె ధనమ్మ భర్తను చంపిన కేసులో జీవిత ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు అన్నపూర్ణను కొంత కాలంగా వేధిస్తున్నట్లు తల్లి లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని ఏఎస్‌పి ఇస్మాయిల్, డీఎస్‌పి నాగేశ్వర్‌రావులు పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గంగరాజు అలియాస్ గౌతమ్, లింగస్వామిలను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి కాల్‌డేటా ప్రకారం నేరస్థులను త్వరలోనే పట్టుకుంటామని విలేకరుల సమావేశంలో తెలిపారు.



అన్నపూర్ణ

భారత్ పర్వ్‌లో మెరిసిన తెలుగు రాష్ట్రాల కళారూపాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో తెలంగాణా రాష్ట్రానిది ప్రత్యేక ఆకర్షణ అని తెలంగాణా భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి అన్నారు. భాషా, సాంస్కృతిక వికాసంలో తెలంగాణా జాతి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజెప్పాలనే సంకల్పానికి సాంస్కృతిక ఉత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట ముందు ఏర్పాటు చేసిన భారత్ పర్వ్‌లో తెలంగాణా సంస్కృతి, కళారూపాలు ఆకట్టుకున్నాయి. దేశవ్యాప్తంగా విభిన్న కళలు, సంస్కృతులు, సంప్రదాయాలను ఒక్క చోటుకి చేర్చే లక్ష్యంతో కేంద్ర పర్యాటక శాఖ భారత్ పర్వ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జనవరి 26 నుంచి 31 వరకు భారత్ పర్వ్-2018 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. భారత్ పర్వ్‌లో భాగంగా సోమవారం తెలంగాణా డే కార్యక్రమాన్ని తెలంగాణా సర్కార్ ఘనంగా నిర్వహించింది. తెలంగాణా రాష్ట్రానికి సొంతమైన పేరిణి శివతాండవం, ఒగ్గు రవి శిష్య బ ృందం డోలు విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణా భవన్ అదనపు కమిషనర్ వేదాంతం గిరి మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గంగా, జమున తెహజీబ్ తెలంగాణా సొంతమని అన్నారు. గిరిజన, గ్రామీణ సంప్రదాయాలు తెలంగాణా సంస్కృతిలో భాగమని, ప్రతి పండుగలోనూ, పాటలోనూ భిన్నత్వంలో ఏకత్వం స్పష్టంగా కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వేదాంతం సత్య నరసింహ శాస్త్రి శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆంధ్ర సంస్కృతికి అద్దం పట్టింది.

ఢిల్లీకి రైల్వే జోన్ రగడ

- కొణతాల రామకృష్ణ నాయకత్వంలో బృందం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా నినదిస్తున్న ఉత్తరాంధ్ర ప్రజల గళం ఇప్పుడు హస్తినలో వినిపిస్తోంది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఢిల్లీ చేరిన ఉత్తరాంధ్ర చర్చా వేదిక వరుస ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా తొలిరోజు ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ నుంచి ఇండియాగేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఏపీ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టిన సభ్యులంతా, ఆ తర్వాత పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించాలని, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరుతూ పలువురు ఆంధ్రప్రాంత ఎంపీలను ఈ బృందం కలిసింది. సీపీఐ ప్రధాన కార్యాలయంలో సీపీఐ నేతలతో చర్చించారు. తాము చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం సాయంత్రం సౌత్ ఎవెన్యూలోని శ్రీకాకుళం ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లిన బృంద నేతలు, ఆయనతో రాష్ట్ర సమస్యలపై చర్చించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు, ఎయిమ్స్, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, గిరిజన విశ్వవిద్యాలయం వంటి డిమాండ్లతో ఉత్తరాంధ్ర చర్చా వేదిక పోరాటం చేస్తుందని ఆయనకు వివరించారు.

హస్తినలో 'వాక్ విత్ జగనన్న'

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా సంకల్ప యాత్ర పేరుతో వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా ఢిల్లీలో ఆ పార్టీ ఎంపీలు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే 1,000 కి.మీ పైగా పాదయాత్ర చేసిన తమ పార్టీ అధినేతకు సంఘీభావం తెలుపుతూ ''వాక్ విత్ జగనన్న'' పేరుతో వైకాపా ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి పాదయాత్ర చేపట్టారు. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించిన యాత్రను పండిట్ రవిశంకర్ శుక్లా లేన్ వరకు కొనసాగించారు. వైకాపా ఎంపీల వెంట ఢిల్లీలో ఉన్న వైకాపా కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో జగన్ లక్షలాది మంది సామాన్యులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటున్నారని, అలా ఆయన దృష్టికొచ్చిన సమస్యలను తాము పార్లమెంటులోనూ లేవనెత్తుతాం అని పేర్కొన్నారు.

భాషా పండితుల అప్‌గ్రేడేషన్‌పై

న్యాయసలహా కోరతాం

● వచ్చే ఏడాది నుంచి ఇంటర్‌లో తెలుగు తప్పనిసరి

● ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ భాషా పండితులకు ఇచ్చిన హామీ మేరకు భాషా పండితుల అప్‌గ్రేడేషన్‌పై అధికారులతో ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి చర్చించారు. న్యాయ సలహా తీసుకొని అప్‌గ్రేడేషన్ జరిగే విధంగా పరిష్కారా మార్గాలను సూచించాలన్నారు.

1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని ఉప ముఖ్య మంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగని రీతిలో తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేసేలా, స్కోరిం గ్ సబ్జెక్టుగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలుగు భాష తప్పని సరి అమలుపై ఏర్పాటు చేసిన సబ్‌కమిటీ సభ్యులతోపాటు, విద్యా శాఖ అధికారులతో కడియం శ్రీహరి సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్షసమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్, తెలుగు భాష తప్పనిసరి అమలు సబ్ కమిటీ చైర్మన్ తెలుగు విశ్వవిద్యాలయం వీసీ సత్యనారాయణ, కన్వీనర్ ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, సభ్యులు దేశపతి శ్రీనివాస్, అధికార భాష సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

1వ తరగతి నుంచి ఇంటర్ వరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా, ఐదో తరగతి వరకు తెలుగు భాషను చదువుకోని వారికి ఆరో తరగతిలో అత్యంత సులభమైన పద్ధతిలో సబ్జెక్టును నేర్చుకునే విధంగా పాఠ్య పుస్తకాలు రూపొందిస్తున్నట్టు కమిటీ తెలిపింది. అదేవిధంగా 8వ తరగతి, ఇంటర్‌లోనూ సులువుగా నేర్చుకునేలా పాఠ్యాంశాలతో పుస్తకాలను రూపొందించినట్టు తెలిపారు. తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో మాతృభాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తున్న విధానాన్ని, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలో కూడా తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడంపై తీసుకుంటన్న చర్యలను వివరిస్తూ, రాష్ట్రంలో ఇంకా బాగా అమలు చేయడంపై సబ్‌కమిటీ ఉపముఖ్యమంత్రికి వివరించింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలో కూడా తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడంపై ఆయా ఉన్నతాధికారులతో మాట్లాడామని, అమలులో తమ కెలాంటి అభ్యంతరం లేదని వారు చెప్పినట్టు ఉపముఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 2018-19లో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు కావల్సిన సిలబస్, పుస్తకాలను తయారు చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ హాజరు

● వచ్చే ఏడాదినుంచి అమలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. ఉపాధ్యాయుల హాజరులో కొంత అవకతవకలను గమనించిన పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారులు దీనిని నివారించడం కోసం ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ హాజరు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం 2018-19 నుంచి అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి యాప్‌ను ఆవిష్కరించనున్నారు. ఉపాధ్యాయుల హాజరును స్థానిక ప్రధానోపాధ్యాయులు 10 గంటల వరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు పంపించాలి. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులకు అప్‌లోడ్ చేస్తారు. వారు జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారులకు, వారు జిల్లా విద్యాశాఖాధికారులకు అప్‌లోడ్ చేస్తే అక్కడి నుంచి రాష్ట్ర కేంద్రానికి అనుసంధానం అవుతుంది. ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత ఉండటం కోసం ప్రత్యేకంగా ఇటువంటి విధానాన్ని అమలు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్, యాప్ రూపకల్పనకు సాంకేతిక విభాగం వారిని ఆదేశించినట్టు సమాచారం. 2018-19 విద్యా సంవత్సరం నుంచేదీనిని అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల సెలవులపై ప్రత్యేకంగా ఆర్‌సీ 83ను జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ అధికారులు పారదర్శకంగా ఉండేందుకని ఈ విధానం అమలుకు నిర్ణయించారు.

1నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎల్లుండి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రయోగ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1632 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం 6410 మంది ఎగ్జిమినర్లను నియమించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 3,33,480 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ఎంపీసీ విద్యార్థులు 1,66,364 మంది ఉండగా బైపీసీ 91,745 మంది, జియోగ్రఫీ విద్యార్థులు 422 మంది, వృత్తివిద్యా కోర్సు విద్యార్థులు మొదటి సంవత్సరం వారు 40,365 మంది ఉండగా ద్వితీయ సంవత్సరం వారు 34,584 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ పరీక్షా కేంద్రాల్లో అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారు. పరీక్షల నిర్వహణ కోసం 6410 మంది ఎగ్జిమినర్లను నియమించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ పరీక్షా కేంద్రాల్లో జరిగే పరీక్షల తీరును పరిశీలించనుంది. అదేవిధంగా ఇంటర్‌బోర్డు కూడా రాష్ట్ర కార్యాలయం నుంచి స్టేట్ అబ్జర్వర్లను పంపించనుందని బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 1632 పరీక్షా కేంద్రాల్లో 1468 జనరల్ విద్యార్థుల కోసం ఉండగా 164 కేంద్రాలు ఒకేషనల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచే ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో పరీక్షకు కేవలం అరగంట ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఎగ్జిమినర్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్ ద్వారా ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షను నిర్వహిస్తారు. పరీక్షనిర్వహించిన అనంతరం వెంటనే విద్యార్థుల మార్కులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణపై లెక్చరర్లకు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహించినట్టు బోర్డు కార్యదర్శి అశోక్ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు 4 సెషన్లలో జరుగుతాయి. 28 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం అవుతాయి. సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్వీరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు. పరీక్షకు 4,61,844 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 4,46,804మంది హాజరయినట్టు, 15,040 పరీక్షకు హాజరు కాలేదని అన్నారు.

యాడ్ ఫిల్మ్ పేరుతో మోసం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రోజుకో తరహా మోసాలలో గ్రేటర్ హైదరాబాద్ వార్తల్లో నిలుస్తోంది. నేరగాళ్ల ఆట కట్టించేందుకు పోలీసులు వేస్తున్న ఎత్తులకు నేరగాళ్ళు ప్రతి ఎత్తులను వేస్తున్నారు. తాజాగా యాడ్ ఫిల్మ్ పేరుతో సంపన్నులను కొంతమంది బోల్తా కొట్టించి రూ. 10 లక్షలతో ఉడాయించారు. కెపిహెచ్‌బిలోని సుజనా మాల్‌లో జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా సేల్స్ జరిగాయి. ఈ మాల్‌కు సంపన్నులు వస్తారని భావించిన నిందితులు కొంత మంది అక్కడ మకాం వేసి రిచ్ కిడ్స్‌ను టార్గెట్ చేశారు. మీ పిల్లలు యాడ్ ఫిల్మ్‌కు బాగుంటారని, యాక్టింగ్ చేయిస్తే లక్షల రూపాయలు వస్తాయని నమ్మించారు. ఇలా ఒకరిని కాదు ఇద్దరిని కాదు ఏకంగా 250 మంది చిన్నారుల కుటుంబసభ్యులను ట్రాప్ చేశారు.

ట్రాప్‌లో పడిన వారందరినీ శని, ఆదివారాలలో బంజారాహిల్స్‌లోని లినార్ ఫోటో స్టూడియోకు రావాలని చెప్పారు. దీంతో 100 మందికిపైగా కుటుంబసభ్యులు చిన్నారులను తీసుకుని స్టూడియోకు వచ్చారు. దీంతో మోసగాళ్ళు చిన్నారుల ఫొటోలను తీశారు. తర్వాత యాడ్ ఫిల్మ్ కోసం మీ చిన్నారి సెలక్ట్ అయిందని, యాడ్ చేయాలంటే ఏడాదికో టారిఫ్ ఉంటుందని ముఠా సభ్యులు నమ్మించారు. ఈ గ్యాంగ్ మాటలు నమ్మిన 15 మంది లక్షల రూపాయలను చెల్లించారు. ఇలా కేవలం రెండు గంటల్లోనే రూ. 10 లక్షలను వసూలు చేశారు. వచ్చిన వారందరినీ స్టూడియోలోనే కూర్చోబెట్టిన ముఠా సభ్యులు భోజనం చేసి వస్తామని చెప్పి వెనుక గేట్ నుంచి జంప్ అయ్యారు. ఎంతసేపటికీ రాకపోవడంతో ఫోన్ చేసిన వారికి స్విచాఫ్ అని వచ్చింది. దీంతో తామంతా మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదును అందుకున్న పోలీసులు స్టూడియో యజమాన్యాన్ని ప్రశ్నించగా వారెవరో తమకు తెలయదని, రెండు రోజులకు అద్దెకు కావాలంటే ఇచ్చామని చెప్పడంతో బిత్తరపోవడం పోలీసుల వంతైంది.

కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు కావాలి

● రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా వినతులు ● పలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లుగా మారే అవకాశం ● పెద్దసంఖ్యలో నగర పంచాయతీలుగా మారనున్న గ్రామపంచాయతీలు ● పెరగనున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్ల కోసం పెద్దఎత్తున డిమాండ్ పెరుగుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా వినతలు అందుతున్నాయి. కొత్తగా నగర పంచాయతీల ఏర్పాటు, సమీప గ్రామాలను పట్టణాల్లో విలీనం చేయడం, గ్రామాల విలీనంతో మున్సిపాలిటీల స్థాయి పెంపు వంటి ప్రతిపాదనల పరిశీలన ప్రస్తుతం రాష్ట్రంలో బాగా వేగంగా సాగుతోంది. దీనికారణంగానే ప్రభుత్వానికి పెద్దఎత్తున డిమాండ్లు వస్తున్నాయని తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి అయితే రాష్ట్రంలో నగర పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లస్వరూపంగా పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాటిని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పట్టణ నవీకరణను మరింత వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దీని వల్ల ఆయా ప్రాంతాల పరిధిలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందని భావిస్తోంది. పైగా ఆర్థిక నిధులను స్వయం సంవృద్ధి ద్వారా పెంచుకుని ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలను కల్పించనున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా, మున్సిపాలిటీలను కార్పొరేషన్లగా మార్చాలని తలపెట్టింది.

ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొత్తగా నలభై మున్సిపాలిటీలను ఏర్పాటు చేయాలని తలపెట్టిన విషయం తెలిసిందే. అలాగే పట్టణ స్వభావం, పట్టణానికి సమీపంలో ఉన్న గ్రామాలను కూడా పరిసర మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కూడా ప్రభుత్వం సంకల్పించింది. దీంతో పెద్ద ఎత్తున గ్రామ పంచాయతీలు నగర పంచాయతీలుగా మారడంతో పాటు పలు మున్సిపాలిటీలు కూడా కార్పొరేషన్లగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ సాఫీగా జరిగేందుకు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల వారిగా ప్రత్యేకంగా అధికారులను కూడా నియమించింది. సదరు అధికారులంతా ఆయా జిల్లాల్లో సమావేశాలను నిర్వహించి ప్రతిపాదనలు రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పలు పంచాయతీలు నగర పంచాయతీలుగా మార్చే ప్రక్రియ దాదాపుగా సిద్ధమైంది. అలాగే స్పెషల్ గ్రేడ్‌లో ఉన్న మహబూబ్‌నగర్, సిద్దిపేట మున్సిపాలిటీలను సమీప గ్రామాల విలీనం ద్వారా కార్పొరేషన్లుగా మార్చాలన్న నిర్ణయానికి సంబంధిత అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు తగు ప్రతిపాదనలను కూడా ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం.



ఇదిలా ఉండగా పలు పంచాయతీలను నగర పంచాయతీలుగా మార్చే విలీన ప్రతిపాదనలను స్థానికులు వ్యతిరేకిస్తున్నట్లుగా తెలుస్తోంది. విలీనం, మున్సిపాలిటీలుగా మార్చే క్రమంలో సుమారు ఐదు వందల గ్రామాలు పట్టణాల పరిధిలోకి రానున్నాయి.

ఇదిలా ఉండగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు గ్రామాలుకూడా జీహెచ్ఎంసీ పరిధిలో కలిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిల్లో ఆదిభట్ల, బొంగలూరు, కొంగరకలాన్, కంచ్రకోయ, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి, మునిరాబాద్, పూడురు, బండ్లగూడ, గండిపేట్, హిమాయత్‌సాగర్, హైదర్షాకోట, ఖానాపూర్, కిస్మత్‌పురా, కోకాపేట్, మంచిరేవుల, మణికొండ, నార్సింగ్, నెక్నాపూర్, పీరంచెరువు, పుప్పాలగూడ, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడ, ఊట్‌పల్లి, తొండపల్లి, చిన్నగొల్లపల్లి, సాతంరాయి, శంషాబాద్, ఖాన్‌పూర్, హమీదుల్లానగర్, తొర్రూర్, బ్రాహ్మణపల్లి, మునగనూరు, కోహెడ్, ఇంజాపూర్,తుర్కయాంజల్, కమ్మగూడ, కుత్బుల్లాపూర్, గౌరెల్లి, రాగన్నగూడ, మన్నెగూడ, తారామతిపేట, అబ్దుల్లాపూర్, జవహర్‌నగర్, తూంకుంట, శామీర్‌పేట్, ఉప్పరిపల్లి, బొమ్మరాసిపేట, దేవరయాంజల్, పోతాయిపల్లి, అంతాయిపల్లి, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, మల్లంపేట్, బోరంపేట్, దొమ్మరపోచంపల్లి, బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి, దుండిగల్, గాగిల్లాపూర్, ఘనాపూర్, పోచారం, యమ్నంపేట్, ఘట్‌కేసర్, ఎన్ఎఫ్‌సీనగర్, చౌదరిగూడ తదితర గ్రామాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారన్న ప్రచారం వినిపిస్తోంది. దీంతో గ్రేటర్ పరిధి కూడా మరింతగా పెరగడం తథ్యమని తెలుస్తోంది.

కొత్తగా 20 వృద్ధాశ్రమాలు

● సంక్షేమంపై అవగాహన సదస్సులు ● పరిశీలనలో బస్సు పాస్‌లు: డైరెక్టర్ శైలజ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో వయోవృద్ధుల కోసం కొత్తగా 20 జిల్లా కేంద్రాల్లో వృద్ధాశ్రమాలు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ వెల్లడించారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశంలో శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 36లక్షల మంది వయో వృద్ధులు ఉన్నారని అందులో 13లక్షల మందికి ప్రభుత్వం నుంచి పెన్సన్లు అందుతున్నాయన్నారు. నేటి బాలలే రేపటి వృద్ధులవుతారన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వృద్ధుల అనుభవాలను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధుల్లో ఒంటరితనం, మానసిక వత్తిడి తగ్గించేందుకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాత పది జిల్లాల్లో వృద్ధులకోసం ప్రత్యేకంగా ట్రిబ్యునళ్లు ఉన్నాయని , త్వరలోనే కొత్త జిల్లాల్లో కూడా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. మన పిల్లలపై ఫిర్యాదులు చేసే పరిస్థితి ఏ తల్లితండ్రులకు రాకుండా పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చెనెలల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వృద్ధుల సంక్షేమంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం ద్వార మూడు వృద్ధాశ్రమాలు మాత్రమే నడుస్తున్నాయన్నారు. సమర్ధవంతంగా వృద్ధాశ్రమాలు నడిపే వారికి ప్రభుత్వ పరంగా కూడా తగిన సహాయం అందిస్తామన్నారు. వృద్ధులకు ఆర్టీసీ బస్‌లలో 30శాతం రాయితీ కల్పించే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. త్వరలోనే వృద్ధులకోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబరు కేటాయిస్తామని డైరెక్టర్ శైలజ పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ పి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దలను గౌరవించటం మనదేశసంస్కృతిలో భాగమన్నారు. చట్టపరంగా ఏవరైతె వారసులో వారే వృద్ధుల పోషణ భారం వహించాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్మించబోయే వృద్ధాశ్రమాల నిర్వహణ భాధ్యతలను ఆయా జిల్లాల సీనియర్ సిటిజన్ అసోసియేషన్లకే అప్పగించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వృద్ధుల పట్ల ఎనలేని గౌరవాభిమానాలు ఉన్నాయని సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పిలుపు అన్న త్రైమాసిక పత్రిక తొలి సంచికను ఆవిష్కరించారు. రాష్ట్రంలో 40 లక్షల మంది వృద్ధులున్నారని అందులో ఏ ఆసరా లేని పేద వృద్ధులకు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని, వృద్ధాశ్రమాల ఏర్పాటు తొపాటుగా డబుల్ బెడ్ ఇళ్లను కేటాయించాలని, భార్యభర్తలిద్దరికి పెన్సన్ ఇవ్వాలని, నగరాల్లో డేకేర్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని, వినికిడి మిషన్లు, కంటి అద్దాల వంటి వాటిని ఉచితంగా అందచేయాలని కోరుతూ అసోసియేషన్ నాయకులు డైరెక్టర్ శైజకు వినతిపత్రం సమర్పించారు.

కేంద్ర కార్యదర్శి సింగరేణి సందర్శన

● నిర్వహణ, కొత్త ప్రాజెక్టులపై ఆరా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ సోమవారం సింగరేణిగనులను, సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రాన్ని సందర్శించారు. సంస్థ చైర్మన్ శ్రీధర్‌తో పాటు సంస్థ డైరెక్టర్లు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పాల్గొన్నారు. రామగుండం-3 ఏరియాలోని ఓసి-2 గనిని మొదట పరిశీలించిన ఆయన తర్వాత ఇన్‌పుట్ క్రషింగ్ అండ్ కన్వేయర్ పద్ధతిని వ్యూపాయింట్ నుండి పరిశీలించారు. దీనికి సంబంధించి విషయాలు అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ఆర్‌జి ఓసి-2ను సందర్శించిన ఆయన గని లోపల గల డ్రాగ్‌లైన్ యంత్రాల పనితీరు. బొగ్గు ఉత్పత్తి అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. సంస్థ చైర్మన్ శ్రీధర్‌తో పాటు డైరెక్టర్లు వివిధ అంశాలపై సమాచారాన్ని కేంద్ర కార్యదర్శికి వివరించారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సుశీల్‌కుమార్ సందర్శిం చారు. థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎస్. శంకర్, ఈడి సంజయ్ నూర్, జిఎం రాజేష్‌లు ప్లాంట్ ఉత్పత్తి తీరును వివరించారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో గల సర్వీస్ బిల్డింగ్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. సింగరేణి విద్యుత్ కేంద్రం మరింత ప్రగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కోలిండియాలో ఏ ఇతర బొగ్గు ఉత్పత్తి సంస్థలో లేనివిధంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం, విజయవంతంగా నిర్వహిస్తూ జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకు సాధించిన అంశాన్ని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ కేంద్రానికి సంబంధించి పలు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించనున్న 800మెగావాట్ల ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను సిఎండి శ్రీధర్ కేంద్ర బొగ్గు కార్యదర్శికి వివరించారు. ఇటు బొగ్గుగనులు, అటు విద్యుత్‌కేంద్రాన్ని పరిశీలించి.. పలు సందేహాలు నివృత్తి చేసుకున్న కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్ సింగరేణి పర్యటన సోమవారం సాయంత్రం ముగించారు.

'ఫ్రెండ్లీ పోలీసింగ్' మా బాధ్యత

● స్పెషల్ పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: విధి నిర్వహణలో పోలీసులు నైతికంగా పని చేసేందుకు కుటుంబసభ్యులు తోడ్పాటును అందించాలని డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి కోరారు. గత ఏడాది తొమ్మిది మాసాల శిక్షణకు వెళ్ళిన తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసులు 935 మంది పాసింగ్ అవుట్ పరేడ్ ఇబ్రహీంపట్నంలోని ఆక్టోపస్ క్యాంపస్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిజిపి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు శాఖ అందించే విధివిధానాలు, నైపుణ్యాన్ని శిక్షణా కాలంలో అందించామన్నారు.

శిక్షణ అనంతరం సామాన్య పౌరుడి నుంచి మానసికంగా, శారీరకంగా క్రమశిక్షణతో ప్రతి ఒక్కరు పోలీసు శాఖ లక్ష్యాలు సాధించే దిశగా మలచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజల రక్షణ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధించేందుకు ఎప్పటికప్పుడు అందించే సేవలపై జవాబుదారితనం, ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం చాలా అవసరమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు వారు నిర్వహించే విధులను పరిశీలించుకోవాలని, తద్వార శాఖాపరమైన ఉద్దేశ్యాలను సాధించడం సులభమవుతుందన్నారు. ప్రజలను రక్షించేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసేందుకు ప్రతి ఒక్కరు తమ ఆలోచనలో, విధి నిర్వహణలో ప్రజల పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం పోలీసు శాఖకు ఉన్న ముఖ్యమైన అంశం అంత గ్గత భద్రత అనీ, దీని కోసం ముందు చూపుతో, నైపుణ్యంతో, సమస్య పరిణామాలను ఊహించే శక్తిని, సామర్థ్యాన్ని శిక్షణలో భాగంగా అందించామన్నారు.

ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ ఎం భగవత్, బెటాలియన్స్ ఐడి అభిలాష్ బిష్ట్ ఆపరేషన్స్ ఐజి కె. శ్రీనివాస్‌రెడ్డి, సిఐడి ఐజి షికాగోయల్, ఎఐజి ఎం. రమేష్‌రెడ్డి, సిటిసి ప్రిన్సిపల్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణాకాలంలో వివిధ అంశాలలో ప్రతిభను కనబరచిన పలువురికి డిజిపి అవార్డులను అందించారు. పరేడ్ అనంతరం సైలెంట్ డ్రిల్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నిర్మాణ రంగంలో షార్ట్‌టర్మ్ కోర్సు

● 16 వరకు దరఖాస్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: భవన నిర్మాణాల్లో నిర్మాణ సామర్థ్యాల పెంపునకు సంబంధించి షార్ట్ టర్మ్ కోర్సును హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఫిబ్రవరి 12 నుంచి 16 వరకు స్వీకరించనున్నారు. ఈ కోర్సులో ప్రధానంగా సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన అధునాతన టెక్నాలజీలు ఉంటాయని డాక్టర్ విశాల్ గర్ తెలిపారు. ఈ కోర్సులో ఇంటర్మీడియట్ స్థాయి టాపిక్స్ ఉంటాయని తెలిపారు. ప్రధానంగా ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ) కోర్సులో భాగంగా ఉంటుందని తెలిపారు. కమర్షియల్ బిల్డిండ్‌లకు ఈసీబీసీ తప్పనిసరి చేశారు.

రాజకీయ విరాళాలు

రూ.637.54 కోట్లు

న్యూఢిల్లీ: గడచిన 4 సంవత్సరాల్లో గుర్తిపు పొందిన 9 'ఎలక్ట్రోరల్ ట్రస్ట్'లు దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు 637.54 కోట్ల రూపాయలను విరాళాలుగా ఇచ్చాయి. వీటిలో సింహభాగం బీజేపీ కే దక్కడం విశేషం. 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' అనే సంస్థ ఈ ట్రస్ట్‌ల ద్వారా వివిధ రాజకీయ పార్టీలకు దక్కిన విరాళాలను వెల్లడించింది. దీని ప్రకారం 2013-14, 2016-17 సంవత్సరాల్లో ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 488.94 కోట్లను, కాంగ్రెస్ పార్టీ 86.65 కోట్లను విరాళాల రూపంలో తీసుకున్నాయి. మొత్తం నగదులో 5 జాతీయ పార్టీలు 92.30 శాతం (588.44 కోట్లను) దక్కించుకోగా, దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రాంతీయ పార్టీలు కేవలం 7.70 శాతం (49.09 కోట్ల రూపాయలను) దక్కించుకున్నాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ ప్రధాన జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీలు ఈ విధంగా విరాళాలు పొందుతూ వస్తున్నాయి.

2013-14 సంవత్సరాలకు గాను రాజకీయ పార్టీలకు 85.37 కోట్లు, 2014-15లో 177.40 కోట్లు, 2015-16లో 49.50 కోట్లు, 2016-17లో 325.27 కోట్లను వివిధ ఎన్నికలకు సంబంధించిన సంస్థలు విరాళాలుగా ఇవ్వడం జరిగింది. వీటిలో 'ప్రుడెంట్', 'సమాజ్' సంస్థలు రెండుసార్లకు పైగా విరాళాలను ఇవ్వడం విశేషం. గుర్తింపు పొందిన 21 సంస్థలకు గాను 14 సంస్థలు తమ విరాళాల వివరాలను ఎలక్షన్ కమీషన్‌కు నిరవధికంగా సమర్పిస్తున్నాయి. ప్రభుత్వ అదేశాల ప్రకారం గుర్తింపు పొందిన ఎన్నికల సంస్థలు తమ ఆదాయంలో 95 శాతాన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు విరాళాలుగా సమర్పించు కోవాలి. అయితే 11 సంస్థలు మాత్రం ఇప్పటి వరకూ తమ కార్యకలాపాలకు సంబంధించిన నివేదికలను సమర్పించకపోవడం విశేషం.

2016-17 సంవత్సరాలకు గాను 6 సంస్థలు 325.45 కోట్ల రూపాయలను వివిధ కార్పొరేట్ సంస్థలు, వ్యక్తుల నుంచి సేకరించినట్లు పేర్కొన్నాయి. ఇందులో నుంచి 325.27 కోట్లను రాజకీయ పార్టీలకు పంచినట్లు పేర్కొన్నాయి. వీటిలో 'ప్రుడెంట్ ఎలక్ట్రోరల్ ట్రస్ట్' ఒక్కటే 2016-17 సంవత్సరానికి గాను అత్యధికంగా 283.73 కోట్ల రూపాయలను సేకరించి, 283.72 కోట్ల రూపాయలను ఆరు రాజకీయ పార్టీలకు పంచినట్లు తన నివేదికలో పేర్కొంది. 2016-17లకు గాను 'ప్రుడెంట్' తన నిధుల నుంచి 88.90 శాతం అనగా 252.22 కోట్లను కేవలం బీజేపీకే ఇవ్వగా, 'జన్‌తా నిర్వచక్' సంస్థ మరో అడుగు ముందుకేసి తన నిధులను 100 శాతం అనగా 25 కోట్లను బీజేపీకి సమర్పించుకోవడం మరింత విశేషం.

మారణాయుధాలు స్వాధీనం

● 12 మంది అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆన్‌లైన్‌లో మారణా యుధాలను కొనుగోలు చేసి వాటిని సామాజిక మాధ్య మాలలో పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్న 12 మం దిని హైదరాబాద్ నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 13 మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు వేర్వేరు బృందాలు సోమవారం పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించి సోదాలు జరిపారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో సీతారాంబాగ్‌కు చెందిన సూద్ అవన్‌సింగ్, తుసం కునాల్‌సింగ్, దూద్‌ఖానాకు చెందిన సుదీర్‌సింగ్, మంగళ్‌హాట్‌కు చెందిన మహ్మద్ సల్మాన్, పాతబస్తీ శాలిబండకు చెందిన మహ్మద్ ముజీబ్, హుస్సేనీ ఆలం ఫాతిమా కాలనీకి చెందిన ముస్తఫాహుసేన్, కందికల్‌గే ట్‌కు చెందిన బిసెంట్ శశికాంత్‌సింగ్, గోల్కొండ చోటా బజార్‌కు చెందిన మహ్మద్ యాసిన్ అహ్మద్, ఖాజాగల్లీకి చెందిన మహ్మద్ రవూఫ్, హుమాయున్‌నగర్‌కు చెందిన సల్మాన్‌ఖాన్, బహదూర్‌పుర బిఎన్‌కె కాలనీకి చెందిన మహ్మద్ సిరాజుద్దీన్, అంబర్‌పేట బాపూనగర్‌కు చెందిన మహ్మద్ సోహైల్‌లను అరెస్టు చేశారు. వీరంతా ఆన్‌లైన్ ద్వారా కత్తులు, తల్వార్లు, పొడువాటి కత్తులను కొనుగోలు చేశారని, వాటిని ఫేస్‌బుక్, వాట్సప్‌లలో పెట్టి ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించేం దుకు ప్రయత్నించారని పోలీసులు గుర్తించారు. వాస్తవానికి ఆన్‌లైన్ వ్యాపారం చేసే వారు కూడా నిషేధిత వస్తువులను విక్రయించడం చట్ట వ్యతిరేకమని పోలీసులు పేర్కొన్నారు. వీరంతా గడచిన ఆరు మాసాలుగా ఆన్‌లైన్‌లో వీటిని కొను గోలు చేసినట్లు గుర్తించామని టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిష న్‌రావు తెలిపారు. నిషేధిత వస్తువులను విక్రయిస్తున్న సం స్థలకు, వాటిని సరఫరా చేస్తున్న ఫ్లిప్‌కార్ట్, అమేజాన్, స్నాప్ డీల్ సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నామని డిసిపి పేర్కొ న్నారు. స్నాప్‌డీల్‌పై కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీనివాస్‌గౌడ్‌తో సహకార శాఖ అధికారుల భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సహకార శాఖ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం హైదరా బాద్ అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయిన జి నాగేశ్వరరావు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. శ్రీనివాస్‌గౌడ్ వారిని అభినందించారు. సంఘం పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. అసోసియేషన్ కార్యక్రమాలకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. టిజీవో అధ్యక్షురాలు మమత, ఓంప్రకాష్ యాదవ్, ఎ వెంకట్‌రెడ్డి, కె వెంకట్‌రావు, నాగనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోరక్షకుల దాడులపై

మూడు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: గోవధ నిషేధం పేరిట దాడులకు పాల్పడేవారిని నియంత్రించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ ప్రభుత్వాలపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్లను పురస్కరించుకుని ఈ మూడు రాష్ట్రాలకూ సుప్రీంకోర్టు నోటీసులు దాఖలు చేసింది.ఈ మూడు రాష్ట్రాలపై కోర్టు ధిక్కార నేరం కింద చర్యలు తీసుకోవాని కోరుతూ మహాత్మా గాంధీ ముని మనవడు తుషార్ గాంధీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఎఎం ఖాన్ విల్కార్,జస్టిస్ డివై చంద్ర చూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ నోటీసులను జారీ చేసింది.

సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వు జారీ చేసిన తర్వాత కూడా ఈ మూడు రాష్ట్రాల్లో గోరక్షకుల దాడులు కొనసాగుతున్నాయని తుషార్ గాంధీ తరఫున వాదిస్తున్న సుప్రసిద్ధ న్యాయవాదిని ఇందిరా జైసింగ్ కోర్టుకు తెలియజేశారు. గతంలో తుషార్ గాంధీ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్లతో పాటు ఈపిటిషన్లపై కూడా విచారణ జరుపుతామని బెంచ్ పేర్కొంది.

గోరక్షకుల దాడులను నిరోధించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రా లను సుప్రీంకోర్టు గత సంవత్సరం సెప్టెంబర్ ఆరవ తేదీన ఆదేశించింది. సీనియర్ పోలీసు అధికారులను నోడల్ అధికారులుగా నియమించాలని కూడా సూచించింది. ఇలాంటి దాడులు మానవతకే మచ్చ అనీ, వాటిని వెంటనే నిరోధించాలని ఆదేశించింది. ఎక్కడైనా గోరక్షకులు దాడులకు పాల్పడితే నోడల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది.ఏ ఒక్కరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదనీ, అలాంటి వారిని వెంటనే గుర్తించి శిక్షలు విధించాలని కూడా కోర్టు రాష్ట్రాలను ఆదేశించింది. రాజ్యాంగంలోని 256 అధికరణం కింద తగిన చర్యలు తీసుకునేట్టు ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషనర్ వాదనకు సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది.

ఐఐఎం ర్యాంకింగ్‌లో వెనుకబడ్డ హైదరాబాద్

హైదరాబాద్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్కూల్స్‌కు సంబంధించి ప్రపంచ వ్యాప్త ర్యాంకింగ్‌లో హైదరాబాద్ వెనుకబడింది. ప్రతి సంవత్సరం 'ఫైనాన్షియల్ టైమ్స్ లండన్' ప్రతిక 'గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్' పేరిట ప్రపంచ వ్యాప్తంగా ఐఐఎం స్కూల్స్‌కు ర్యాంక్‌లు ప్రకటిస్తుంది. తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో మన దేశానికి సంబంధించి బెంగుళూరు, కలకత్తా స్కూల్స్ గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి తమ ర్యాంకులను మెరుగు పరుచుకోగా, హైదరాబాద్, అహ్మదాబాద్ స్కూల్స్ వెనుక బడ్డాయని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

'స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్' మొదటి స్థానాన్ని దక్కించుకుంది. 2017లో 28వ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈసారి 29వ స్థానానికి పడిపోయింది. గత ర్యాంకింగ్‌లో 29వస్థానంలో ఉన్న అహ్మదాబాద్ స్కూల్ ఈసారి 31కి పడిపోయింది. ఐఐఎం-బెంగుళూరు 49 నుంచి 35కి చేరుకోగా, ఐఐఎం-కలకత్తా 95 నుంచి 78కి చేరుకుంది.

ఈ సందర్భంగా హైదరాబాద్ ఐఎస్‌బి డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో తమ స్కూల్‌కు సంబంధించి పీజీ ప్రోగ్రామ్ 28వ ర్యాంకు పొందడం గర్వంగా ఉంది అని, ప్రపంచస్థాయి విద్య, సౌకర్యాలు, పరిశోధన తదితర విషయాలలో తాము మరింత శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి రూ.కోటి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లోని గ్రంథాలయాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి రూ. కోటి విడుదల చేస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. జంటనగరాల్లోని గ్రంథాలయాల అభివృద్దికి తీసుకోవల్సిన చర్యలపై మంత్రి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితా రాణా సమక్షంలో సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎంపిక చేసిన 20 గ్రంథాలయాల్లో కనీస అవసరాలు కల్పించేందుకు ఖర్చు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నగరంలో 86 గ్రంథాలయాలు పనిచేస్తున్నట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రంథాలయాల అభివృద్దికి 10 మందితో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రంథాలయాల సమస్యలను ముఖ్యమంత్రి కెసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామి ఇచ్చారు. చాలా గ్రంథాలయాల్లో ఎప్పుడో కొనుగోలు చేసిన పుస్తకాలు ఉన్నాయని, ప్రస్తుత అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలు లేవని తెలిపారు. పోటీపరీక్షలకు హాజరయ్యే వారు ఖరీదైన పుస్తకాలను కొనుగోలు చేయలేక అనేక మంది గ్రంథాలయాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. అటువంటి వారికి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శిధిలావస్థలో ఉన్న భవనాలను తక్షణమే మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

'ఆకలి రహిత హైదరాబాద్ లక్ష్యం'



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : బంగారు తెలంగాణను ఆకలి లేని నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని హరేకృష్ణమూవ్‌మెంట్ మరియు అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస పేర్కొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఫౌండేషన్ భోజనామృత హైటెక్ వంటశాల పూర్తి చేసి రెండేళ్లు అయిన సందర్భంగా నార్సింగ్‌లోని కోకాపేటలో ద్వితీయ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 5 వేల మందితో ప్రారంభించిన వంటశాల నేడు రోజుకు సుమారుగా 50 వేల మందికి భోజనం సరఫరా చేస్తూ దిబెస్ట్ మాస్ కుకింగ్ కిచెన్‌గా పేరు తెచ్చుకుందన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ కేంద్రానికి చుట్టుపక్కల 10 కిలోమీటర్లలోపు పేదలు ఆకలితో పస్తుండకూడదన్నది తమ ఆలోచన అని ఆ మేరకే తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. పేదలు ఆకలితో అలమటించకూడదన్న సీఎం మనోసంకల్పానికి దన్నుగా జీహెచ్‌ఎంసీ సహకారంతో అన్నపూర్ణ 5 రూపాయల భోజనానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతిరోజు 150 సెంటర్లకు, 45వేల మందికి భోజనం సమకూర్చుతున్నామన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 15 ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారుగా 4 వేల మంది కడుపునిండా తినగలుగుతున్నారన్నారు. మార్కెట్ యార్డుల వద్ద నున్న రైతులు, హమాలీలకు నాణ్యమైన భోజనాన్ని అందించడానికి సద్దిమూట కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మేయర్ బొంతు రామ్మోహన్, అరబిందో ఫార్మా కంపెనీ లిమిటెడ్ వైస్‌చైర్మన్ కె.నిత్యనందరెడ్డి , జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నేడు మహాత్ముని వర్ధంతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నేపథ్యంలో మంగళవారం (జనవరి 30న) రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా రెండు నిముషాలపాటు మౌనం పాటించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా సోమవారం జీవో విడుదల చేశారు. స్వాతంత్ర్యం సిద్దించేందుకు జీవితాలను త్యాగంచేసిన వారిని స్మరించుకోవడం ప్రజల బాధ్యత అంటూ పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్లు ఈ ఆదేశాలను విధిగా పాటించాలని సూచించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రప్రజలంతా రెండు నిముషాల పాటు మౌనం పాటించేందుకు గ్రామ స్థాయి వరకు అధికార యంత్రాంగం ద్వారా సందేశం పంపించాలన్నారు. అన్ని జిల్లాల్లో కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, పోలీస్ కమిషరేట్లు, వివిధ శాఖల కార్యాలయాల్లో, డివిజన్, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మౌనం పాటించేందుకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. మౌనం పాటించే సమయంలో రహదారులపై వాహనాల రాకపోకలను నిలిపివేయాలని సూచించారు.

కేబీజీవి, యుఆర్‌ఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల గౌరవ వేతనాలను పెంచుతూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే 2 యుఆర్‌ఎస్ స్కూల్స్ కొనసాగుతుండగా 2017-18 విద్యా సంవత్సరంలో మరో 29 యుఆర్‌ఎస్‌లను ప్రారంభించినట్టు సర్వశిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, పాఠశాలవిద్యా సంచాలకులు జి కిషన్ తెలిపారు. ఆయా స్కూల్స్‌లో పనిచేస్తున్న బోధన,బోధనేతర సిబ్బంది గౌరవ వేతనాలను పెంచుతున్నట్టు ఉత్తర్వులిచ్చారు.

స్పెషల్ ఆఫీసర్లకు రూ. 25,000 కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టి)కు రూ. 20,000 చేసినట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారులు పెంపు ఉత్తర్వులను అమలు చేయాలని సూచించారు.

చేసింది సహజీవనం.. అందులోనూ అనుమానాలు...

- ఏకకాలంలో ముగ్గురి హత్య
- చందానగర్‌లో దారుణం
- మొదటి భార్యను గోడకేసి కొట్టి హత్య
- ఆ తర్వాత ఆమె తల్లి కూతురి హత్య
- తానే చంపినట్లు భర్త మధు ఒప్పుకోలు
- పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు

హైదరాబాద్, చందానగర్, ఆంధ్రప్రభ : శేరిలింగంపల్లి సమీపంలోని చందానగర్‌లో ఒకే ఇంట్లో మూడు హత్యలు కలకలం రేకెత్తించాయి. హతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు, హంతకుడు కూడా వారి బంధువే కావడం చర్చనీయాంశంగా మారింది. ఆవేశంతో చేసిన హత్యలు కాదు, ఆగ్రహంతో ఉద్దేశ్యపూర్వకంగానే చేసిన హత్యలు.ఒకరిని చంపాక మిగతా ఇద్దరిని అనివార్యంగా చంపదలచుకుని మరీ చంపాడు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఘటనలో నిందితుడు విషయం వెలుగులోకి రాగానే పోలీసులకు లొంగిపోయాడు.

తూర్పు గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామానికి చెందిన రావడ మధు జీవనోపాధి కోసం నగరానికి వచ్చి కెపిహెచ్‌బి కాలనీలో నివసిస్తూ చందానగర్ ప్రాంతంలో మొబైల్ రిపేరింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భీమవరం ప్రాంతానికి చెందిన గూడురి అపర్ణదేవి (30) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి చందానగర్ ప్రాంతంలో నివాసం ఉంటుంది. ఈ తరుణంలో మధు, అపర్ణదేవిల మధ్య ప్రేమ చిగురించింది. దీంతో ఇద్దరూ కలిసి సహజీవనం చేయడం ప్రారంభించారు. వీరి బంధానికి గుర్తుగా కార్తికేయి (4) అనే పాప జన్మించింది. అయితే అపర్ణతో పరిచయం కంటే ముందుగానే మధుకు వివాహమైంది. వివాహమైందన్న విషయాన్ని అపర్ణకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. అపర్ణ, మధుల సంబంధం మధు భార్యకు తెలియడంతో కలహాలు ప్రారంభమయ్యాయి. అపర్ణ చందానగర్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూంలో పని చేస్తూ తల్లి విజయమ్మ (65), చిన్నారి కార్తేకేయి (4)తో కలిసి సమీపంలోని కెయస్ బేకర్స్ వెనుక వీధిలో నివాసం ఉంటున్నది. మధు మాత్రం తన మొదటి భార్యతో ఉంటూ, అప్పడప్పుడు అపర్ణ వద్దకు వచ్చి వెళ్ళేవాడు. అపర్ణతో సంబంధాన్ని తెంచుకోవాలని మధును భార్య కోరడంతో పాటు అపర్ణతోనూ గొడవ పడేది. ఈ గొడవలు రోజురోజుకూ తీవ్రం కావడంతో కొన్నాళ్ళుగా అపర్ణ వద్దక ు రాకపోకలను మధు తగ్గించాడు. ఇదే సమయంలో అపర్ణ తాను పని చేసే చోట మరొకరితో చనువుగా ఉంటున్నట్లు మధు అనుమానించాడు. దీన్ని తట్టుకోలేని మధు శుక్రవారం సాయంత్రం అపర్ణ ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. ఆవేశంలో అపర్ణ గొంతును పట్టుకుని గోడకేసి బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కంగారుకు గురైన మధు విషయం వెంటనే తెలిస్తే ఇబ్బందులకు గురవుతానని భావించి ఇంట్లోనే ఉన్న కూతురు కార్తికేయి, అత్త విజయలక్ష్మిని గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం శవాలను ఇంట్లోనే వదిలేసి గదికి బయటి నుంచి తాళం వేసి వెళ్ళిపోయాడు. రోజూ తన ఉద్యోగం చేసుకొని ఇంటికి వచ్చి, తిరిగి ఉదయం వెళ్ళే అపర్ణ సోమవారం ఎంతకూ తలుపులు తీయక పోవడంతో పాటు, వారు నివాసం ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో నిత్యం పాలు పోసే వ్యక్తి అనుమానంతో స్థానికులకు సమాచారం అందచేశారు. దీంతో స్థానికులు చందానగర్ పోలీసులకు సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇంటి తలుపులు పగుల గొట్టి చూడగా, అపర్ణతో పాటు తల్లి విజయమ్మ, కార్తేకేయి మృతి చెందినట్లు గుర్తించారు. అపర్ణ మృత దేహం వంటగదిలో తలుపు వద్ద తలకు తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉండగా, విజయమ్మ, కార్తేకేయి మృతదేహాలు మంచంపై పడి ఉన్నాయి.

హత్యల విషయం తెలిసిన వెంటనే సైబరాబాద్ జాయింట్ సిపి షానవాజ్, ఎసిపి రవిలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. క్లూస్ టీంను రంగంలోకి దించి ఆధారాలను సేకరించారు. అనంతరం అపర్ణ పని చేసే ఎలక్ట్రానిక్ దుకాణంలో విచారించగా శుక్రవారం ఉదయంవిధులకు హాజరైందని, మధ్యాహ్నం భోజనం చేసి వస్తానని వెళ్ళి తిరిగి రాలేదని తేలింది. అనంతరం అపర్ణ ఫోన్‌కాల్ డాటాను పరిశీలించగా రాత్రి గం. 11ల ప్రాంతంలో చివరి కాల్ చేసినట్లుందని గుర్తించారు.

అసూయతోనే చంపేశా :మధు

అపర్ణ, విజయలక్ష్మి, చిన్నారి కార్తికేయి హత్యలకు తానే కారణమని మధు పేర్కొన్నాడు. హత్యల విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి వివిధ కోణాలలో దర్యాప్తును ప్రారంభించారు. అపర్ణ ఫోన్ కాల్ డాటా, స్థానికులు, అపుర్ణ పని చేసే ఎలక్ట్రానిక్ షోరూం తోటి సిబ్బందిని విచారించగా వచ్చిన సమాచారం ఆధారంగా హంతకుడు మధు కావచ్చునని భావించి గాలింపును తీవ్రం చేశారు. ఎలాగూ పట్టుబడక తప్పదని భావించిన మధు కెపిహెచ్‌బి పోలీసులకు లొంగిపోయాడు. వెంటనే పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా మధును రామచంద్రాపురం పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించగా పలు ఆసక్తికరమైన విషయాలను తెలిపినట్లు సమాచారం. తనతో అపర్ణకు పెళ్ళి కానప్పటికీ కలిసి ఉన్నామని, మా ఇద్దరికి కార్తికేయి జన్మించిందని చెప్పాడు. తన భార్య గొడవల కారణంగా కొంత కాలంగా అపర్ణతో తరచూ కలవడం సాధ్యం కావడం లేదని, ఇదే సమయంలోఅపర్ణ మరొకరితో చనువుగా ఉంటున్నట్లు తెలిసిందని మధు చెప్పాడు. తనను ప్రేమించిన అపర్ణ మరొకరితో కలిసి ఉండటాన్ని సహించలేక నిలదీసేందుకు శుక్రవారం సాయంత్రం చందానగర్‌లోని అపర్ణ ఇంటికి వెళ్ళానని, ఇద్దరి మధ్య మాటామాటా పెరిగిందని, ఆవేశంలో గొంతు పట్టుకుని గోడకు బాదడంతో అపర్ణ ప్రాణాలు కోల్పోయిందని మధు పోలీసులకు వివరించాడు. దీంతో ఈ విషయం ఎక్కడవెంటనే బహిర్గతమవుతుందోనన్న ఆందోళనతో విజయలక్ష్మిని, కార్తికేయిని బెడ్‌రూంలోనే గొంతు నులిమి హత్య చేశానని అంగీకరించాడు. మధు ఇచ్చిన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరచాలని నిర్ణయించారు.

సినీఫక్కీలో యువతి కిడ్నాప్

భోపాల్: పోలీసులను కట్టేసి వారి యూనీఫాం వేసుకుని వెళ్లి సినీఫక్కలో ఓ యువతిని కిడ్నాప్ చేసిన ఘటన మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బర్మహా గ్రామంలో ఓ వ్యక్తి రోడ్డుపై పడున్నాడని పోలీసులకు ఫోను రావటంతో ప్రకాశ్ మండల్ అనే హెడ్ కానిస్టేబుల్, సుభాశ్ దుబే అనే జవాన్ పోలీసు వాహనంలో ఘటన ప్రాంతానికి వెళ్లారు. అయితే పోలీసులు రాగానే అప్పటివరకూ రోడ్డుపై పడిపోయినట్టు నటిస్తున్న వ్యక్తిఒక్క ఉదుటున లేచి పోలీసులకు రివాల్వర్ గురిపెట్టడంతో వారు నివ్వెరపోయారు. ఇంతలో సమీపం నుంచి మరో నలుగురు వ్యక్తులు పోలీసులు వద్దకు చేరుకుని వారిని బంధించి పోలీసుల యూనీఫాం ధరించి పోలీసుల జీపులోనే అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం పోలీసుల వాహనంలో నిజమైన పోలీసులు మాదిరిగానే వెళ్లి ఒక యువతిని కిడ్నాప్ చేశారు. ముందుగా పోలీసుల వేషంలో యువతి ఇంటికి వెళ్లారు. యువతి దాఖలుచేసిన లైంగిక వేధింపుల కేసు విషయమై మాట్లాడాలని, ఆమె స్టేట్‌మెంటు నమోదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు రావాలిసిందిగా చెప్పి ఆమెను తమతోపాటు తీసుకెళ్లారు. ఆమె తండ్రిని, సోదరుడిని కూడా వాహనం ఎక్కించుకోవటంతో బాధితులకు అనుమానం రాలేదు. కొద్ది దూరం వెళ్లాక యువతి తండ్రిని, సోదరుడిని బలవంతంగా వాహనం దింపేసి యువతిని మాత్రం తమతోపాటు తీసుకువెళ్లిపోయారు.

రోజుకు లక్ష గృహాల విద్యుదీకరణ

- దేశంలో 1,227 గ్రామాలకు విద్యుత్ లేదు
- తెలంగాణకు రూ. 40వేల కోట్ల రుణం ఇచ్చాం
- విద్యుత్ స్టోరేజీ టెక్నాలజీ కోసం టి-హబ్ అన్వేషణలు
- ఆర్‌ఇసీ చైర్మన్ పివి రమేష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో 4 కోట్ల 20 లక్షల ఇళ్ళకు విద్యుత్ కనెక్షన్ లేదనీ, అందరికీ విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో రోజుకు లక్ష గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామని ప్రభుత్వరంగ సంస్థ గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ (ఆర్‌ఇసి) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పివి రమేష్ చెప్పారు. 2015లో 18,450 గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదని, అది ఇప్పుడు 1,227 గ్రామాలకు తగ్గిందని చెప్పారు. ఇప్పటి వరకు 80వేల ఎల్ఇడి బల్బులు పంపిణీ చేసి ఇంధన పొదుపును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ లాంటి కొండ ప్రాంత రాష్ట్రాల్లో ఈ సమస్య ఉందన్నారు. మార్చి నాటికి దేశమంతా విద్యుత్ వెలుగులతో నిండాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్యానికి అనుగుణంగా నూరుశాతం పూర్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. టి-హబ్‌తో ఆర్‌ఇసి కుదుర్చుకున్న ఎంవోయూ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, దేశంలో 3.3 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన శక్తి కలిగిన కంపెనీలు ఉన్నాయని, అయితే ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు నిల్వచేసే సదుపాయాలు లేనందున పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం లేదన్నారు. దీనికోసం స్టోరేజీ టెక్నాలజీని పెంచేందుకు అన్వేషణల కోసం టి-హబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని రమేష్ చెప్పారు. దీన్‌దయాళ్ గ్రామీణ యోజన కింద కేంద్ర ప్రభుత్వం విద్యుద్దీకరణ, పంపిణీ సామర్థ్యం పెంచేందుకు రూ.45వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. తమ సంస్థ గ్రామీణ విద్యుద్దీకరణపై దృష్టి సారిస్తూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అమలు చేస్తున్నామన్నారు. టెక్నాలజీ మార్పిడిలో అనేక సంస్థలు సహకరిస్తున్నాయని, ఇందులో భాగంగా టి-హబ్ చేపట్టే అన్వేషణలో భాగస్వామ్యం అవుతున్నామని అన్నారు. తమ సంస్థ నేపాల్, భూటాన్, ఆఫ్రికా దేశాల్లో జల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఆర్థికసాయం అందిస్తోందని రమేష్ చెప్పారు. తెలంగాణ ప్రభుత్వానికి కూడా రూ.40వేల కోట్ల రుణం ఇచ్చామని, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులో తమ సంస్థ భాగస్వామ్యమైందని తెలిపారు. అలాగే సింగరేణి పవర్ ప్రాజెక్టులో కూడా పెట్టుబడులతో కలుస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అతి తక్కువ కాలంలో మిగులు విద్యుత్‌తో 24 గంటల సరఫరా స్థాయికి చేరిందని ఆయన కొనియాడారు. తమ సంస్థ రెన్యూవబుల్ ఎనర్జీపైనే దృష్టిసారించి ఆ దిశలో అన్వేషణలు చేస్తోందని చెప్పారు.ఆర్‌ఇసి రెండున్నర లక్షల కోట్ల టర్నోవర్ సాధిస్తుందని, సంస్థలో ప్రభుత్వ వాటా 52 శాతం మేరకు ఉందన్నారు. గత ఏడాది 80వేల కోట్ల రుణాలు ఇచ్చి 6,500 కోట్ల నికర లాభం ఆర్జించిందని రమేష్ తెలిపారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తూ, విద్యుత్ సంస్థలను ఆ దిశలో ప్రోత్సహిస్తుందని ఆయన చెప్పారు. టి-హబ్‌తో చేసుకున్న ఒప్పందంతో స్టోరేజీ, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి మంచి పరిష్కారం లభిస్తుందని రమేష్ ఆశాభావం వ్యక్తంచేశారు.

రైలు కిందపడి ఇద్దరు యువకుల ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్, ప్రభన్యూస్ : రైలు కింద పడి ఆదివారం రాత్రి ఒకరు, సోమవారం మరొకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆసిఫాబాద్ కుమ్రంభీం జిల్లా, కాగజ్‌నగర్ పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక సంజీవయ్య కాలనీ సమీపంలో కాగజ్‌నగర్ నుంచి బెల్లంపల్లివైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కింద పడి వేంపల్లి గ్రామానికి చెందిన చెన్నవేని చంద్రశేఖర్(24), అదే విధంగా చింతగూడ సమీపంలోని చందమామ బ్రిడ్జి వద్ద కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన గుర్లె వెంకటి(22) రైలు పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒకరు మనోవేదనతో, మరొకరు ఉద్యోగం దొరకడం లేదన్న బాధతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఐ డ్రంక్ అండ్ డ్రైవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్యం మత్తులో కారు నడిపిన ఒక సిఐ ఇష్టానుసారంగా వెళ్ళడంతో నాలుగు వాహనాలు ధ్వంసం కాగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. సిపిఎల్ అంబర్‌పేటలో ట్రైనింగ్ సిఐగా విధులను నిర్వహిస్తున్న గిరీష్‌రావు నగర శివార్లలోని యాప్రాల్‌లో ఆదివారం రాత్రి మద్యం తాగి డ్రైవింగ్ చేశాడు. సిఐ ర్యాష్ డ్రైవింగ్ వల్ల ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ర్యాష్ డ్రైవింగ్ విషయం తెలుసుకున్న జవహర్‌నగర్ పోలీసులు విషయం తెలుసుకుని రంగంలోకి దిగి కారు నడుపుతున్న సిఐని అదుపులోకి తీసుకున్నారు. తాగి కారు నడిపినట్లు గుర్తించిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో తెలుగు రాష్ట్రాలు టాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక శాతం పన్నులు వసూలైనాయని ప్రత్యక్ష పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.పి. చౌదరి తెలిపారు. దేశంలోనే అత్యధిక శాతం పన్ను వసూలైన రాష్ట్రాలుగా తెలుగు రాష్ట్రాలు గుర్తించబడ్డాయన్నారు. దేశంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 18 శాతం కాగా, తెలుగు రాష్ట్రాల్లో 30.9 శాతం పన్నుల వసూలు నమోదయిందన్నారు. అయినప్పటికీ అనేక మంది పన్ను చెల్లించడం లేదని, వారిని కూడా పన్ను చెల్లింపుదారుల జాబితాలో చేర్చడం తమ లక్ష్యం అని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక వాణిజ్య మండళుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన పన్నుల చెల్లింపులలో ఎదురవుతున్న సమస్యలు - సవాళ్లు అనే సదస్సులో ఎస్.పి. చౌదరి ముఖ్య అతిధిగా హజరయ్యారు. పారిశ్రామిక, ఆర్థిక వర్గాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపారు. కార్యక్రమానికి ఎఫ్టాప్సీ అధ్యక్షులు గౌరా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడారు. పన్నుల చెల్లింపులలో సీఏల పాత్ర అత్యం కీలకం అన్నారు. కొందరు చార్టర్డు అకౌంటెంట్లు పన్ను చెల్లింపుదారులను పక్కదారి పట్టిస్తున్నారని వివరించారు. తక్కువ పన్ను చెల్లించే విధంగా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధానం సరైంది కాదన్నారు.

ప్రతిభగల వారికే అవార్డులు

శాంతా బయోటెక్ అధినేత డాక్టర్.కె.ఐ వరప్రసాద్ రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: అచ్చమైన ప్రతిభకే అవార్డులు వరిస్తాయని శాంతా బయోటెక్ అధినేత పద్మభూషణ్ గౌరవ స్వీకర్త డాక్టర్.కె.ఐ వరప్రసాద్ రెడ్డి అన్నారు. తమ తమ రం గాల్లో ప్రతిభను ప్రదర్శించే వారిని తప్పక గౌరవించుకోవడం సంస్కారాన్ని చాటుతుందన్నారు. ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ రసమయి వ్యవస్థాపకులు, కవి డాక్టర్ ఎం.కె.రాముకు, ప్రముఖ కవి, విమర్శకుడు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా సహాయ సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌కు పరిషత్ సోమవారం డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కారాలను ప్రదానం చేసింది. డాక్టర్.కె.ఐ వరప్రసాద్ రెడ్డికి పరిషత్ తరపున పురస్కారం 3,116 రూపాయల నగదు, శాలువాతో సత్కరించారు.

ఇటీవలే కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యునిగా ఎన్నికైనందుకు పరిషత్ కార్యవర్గస భ్యుడు, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారా వును అభినందన పూర్వకంగా సత్కరించారు. సాహిత్య సృజనలో, అధ్యయనంలో విశేషమైన సేవలందిస్తున్న డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య ఇతర సాహితీమూ ర్తులను గౌరవించే దృష్టితో పురస్కారాలు అందజేసేందుకు నిధిని అందించారని పరిషత్ అధ్యక్షురాలు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తమ అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య స్వాగతం పలికారు. పురస్కారాలు నెలకొల్పిన డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య. పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డికి బెయిల్ మంజూరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘం తెలుగు రైతు అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత రెండు వారాలుగా చంచల్‌గూడ జైలులో ఉన్న ప్రతాప్‌రెడ్డికి సోమవారం ఈ మేరకు ఊరట కలిగింది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో గజ్వేల్‌కు చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నపుడు ఆందోళన చేసిన విద్యార్థులకు వంటేరు మద్దతు ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించి ఆత్మహత్యపై సమాచారం సేకరించి ఆందోళనకు దిగిన వంటేరుపై వివిధ సెక్షన్ల కింద అరెస్టు చేశారు. ఇటీవల ఒక కేసులో బెయిల్ మంజూరైనప్పటికీ మరో కేసులో ఆయనను అరెస్టు చేశారు.

అక్రమ హోర్డింగ్‌ల తొలగింపునకు చర్యలు

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగరంలో అక్రమంగా వెలసిన హోర్డింగ్ (ప్రకటనల బోర్డు)లను తక్షణం తొలగించాలని భవనాల యజమానులు, ఏజెన్సీలను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. వెంటనే ప్రకటనల బోర్డులను తొలగించని వారి పైన చట్టం పరిధిలో క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో అరవింద్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భవనాలపైన అనుమతి లేకుండా భారీ స్థాయిలో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి ఏజెన్సీలు, భవనాల యజమానులపైన కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల నుండి నిర్దిష్ట ప్రమాణంలో అనుమతి పొందిన తర్వాతనే భవన యజమానులు, ఏజెన్సీలు ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయవలసి ఉంటుందన్నారు. ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయడానికి అనుమతించిన భవనాల యజమానులు, ప్రకటనల బోర్డులను అక్రమంగా ఏర్పాటు చేసిన ఏజెన్సీల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామమని, జరిమానా విధించవలసి ఉంటుందన్నారు. అక్రమంగా వెలసిన హోర్డింగ్‌లు ట్రాఫిక్ సిగ్నల్స్ కనిపించకుండా చేస్తున్నాయని, ట్రాఫిక్ జామ్‌లకు కారణం అవుతున్నాయని వివరించారు. వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్న హోర్డింగ్‌లను తక్షణం తొలగించవలసి ఉందన్నారు. నగరంలో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్ కూలిన ఘటనలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగిన ఉదంతం కూడా ఉందని అరవింద్ కుమార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ పరిధిలో 2011 నుండి హోర్డింగ్‌లకు, ప్రకటన బోర్డుల ఏర్పాట్లకు అనుమతించడం లేదన్నారు. 2011కు ముందే అనుమతి పొంది ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల అనుమతులను ఏటేటా పునరుద్ధరించడం జరుగుతుందని ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌కు వివరించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆపరేషన్స్‌లో భాగంగా ఇప్పటికే అక్రమంగా వెలిసిన హోర్డింగ్‌లను తొలగించడం జరుగుతుందన్నారు. ప్రకటనల రుసుము, హోర్డింగ్ నిర్మాణ పటిష్టత, భవన యజమానుల నుండి నిరభ్యంతర ధృవీకరణ పొందిన ఏజెన్సీల హోర్డింగ్‌లను మాత్రమే నిబంధనల పరిధిలో అనుమతించడం, గడువు పొడిగించడం జరుగుతుందని వివరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం రవీంద్రభారతి బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, సంఘం నాయకులు జయంతి, మున్నూర్, నర్సింహగౌడ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చిరునామా ఉంటే చాలు..పాస్‌పోర్టు

- నిబంధనలు సరళతరం చేసిన విదేశీ వ్యవహారాలశాఖ
- తత్కాల్ పథకంలో మూడు రోజుల్లోనే మంజూరు
- ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత పౌరసత్వాన్ని ధృవీకరిస్తూ మంజూరుచేసే పాస్‌పోర్టు విషయంలో విదేశీ వ్యవహారాలశాఖ కఠినమైన నిబంధలను ఒక్కొక్కటి రద్దుచేస్తూ వస్తోంది. తాజాగా తత్కాల్ పాస్‌పోర్టు సేవలకు అవసరమైన డాక్యుమెంట్లను కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. కేవలం చిరునామా ధృవీకరణ పత్రం (అడ్రస్ ప్రూఫ్) ఉంటే చాలు.. పాస్‌పోర్టు మంజూరు చేస్తామని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి డాక్టర్ ఇ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కఠినమైన నిబంధనలతో కొన్ని వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వాటిని సరళీకృతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్‌పోర్టు సేవా కేంద్రాల విస్తరణతో పాటు నిబంధనలను సడలించడం ద్వారా మెరుగైన సౌర సేవలు అందించగలుగుతున్నామన్నారు. తాజాగా కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం పుట్టిన తేదీ ధృవీకరణకు గెజిటెడ్ అధికారి సంతకం అవసరం లేదన్నారు. అలాగే ఐఎఎస్,



ఐపీఎస్‌లాంటి కేంద్ర సర్వీసుల్లోని అధికారుల ధృవీకరణను కూడా తొలగించినట్లు చెప్పారు. అలాగే లాయర్ ద్వారా అఫిడవిట్ ఇవ్వాలన్న నిబంధనను కూడా రద్దుచేసి పాస్‌పోర్టు మంజూరుకు అవసరమైన 12 డాక్యుమెంట్లలో ఏదేనీ రెండింటిని నిరూపిస్తే సరిపోతుందన్నారు. అందులో ఒకటి సెల్ఫ్ డిక్లరేషన్ కాగా, మరొకటి పుట్టిన తేది ధృవీకరణగా ఆయన చెప్పారు.

Andhraprabha business 2018

బిజినెస్

బీఓఐ క్యాష్ ఎట్ పీవోఎస్

హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు ఆఫ్ ఇండియా (బీఓఐ) తెలంగాణ జోన్ క్యాష్ ఎట్ పాయింట్ సదుపాయాన్ని అందు బాటు లోకి తెచ్చింది. క్యాష్ ఎట్ పాయింట్ వినూత్నమైన సర్వీస్.. మర్చంట్ ఎస్టా బ్లిష్‌మెంట్ (దుకాణం) మినీ ఎటీఎంగా మారుతుంది. డెబిట్‌కార్డు హోల్డర్ కార్డును వినియో గించు కని బ్యాంకు ఆఫ్ ఇండి యా పీఓఎస్ డివైజ్‌ను డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చు. దీంతో కార్డు హోల్డర్ ఎటీఎం కోసం వెతుక్కోవాల్సిన పని ఉండదు. ప్రయాణికులు కానీ ఇతరు లు కానీ ఎటీఎంల వద్ద చాంతా డంత క్యూలై న్‌లో నుంచొని డబ్బు విత్‌డ్రా చేసుకోవాల్సిన ఇబ్బం దులు ఉండదు. అన్నీ లావాదేవీలు 100 శాతం భద్రత కలిగిఉంటుంది. దీనికి ఆర్‌బీఐ కూడా అనుమతులు మంజూరు చేసింది. కాగా బీఓఐ జోన్ 1000 పీఓఎస్ కార్డు రీడర్స్‌ను మెసర్స్ తేజారీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైద రాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఫిన్ టెక్ మొబైల్ కామ ర్స్‌సర్వీస్ ప్రొవైడర్‌కు అందజేసింది. మార్చి చివరి నాటికి వీటిని 5000కు పెంచుతుంది. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీజీ చైతన్య, జనరల్ మేనేజర్ ఆర్ కెమిత్రా, ఆర్‌సీ ఠాకూర్‌లు ఎన్‌పీఏలు తగ్గించుకోడానికి రిటైల్‌రుణాలపై దృష్టిపెడుతున్నట్లు చెప్పారు.



వసతులు పెంచితే దండిగా రాబడి!

- మౌలిక రంగానికి 25ఏళ్లలో 450లక్షల కోట్ల డాలర్లు అవసరం
- 390 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు తెచ్చుకోవచ్చు
- ఆర్థిక సర్వే అంచనా



న్యూఢిల్లీ : దేశంలో మౌలికరంగాన్ని అభివృద్ధి చేయాలంటే వచ్చే పాతికసంవత్సరాల్లో సుమారు 450 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమని ఆర్థికసర్వే పేర్కొంది. ఈ పెట్టుబడులపై సుమారు 390 లక్షల కోట్ల డాలర్ల ఆదాయం సంపాదించుకోవచ్చునని నివేదికలో వివరించింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలపడ్డంతో ఆదాయాలు పెరుగుతుండటంతో వచ్చే 25 సంవత్సరాల్లో భారత్ మౌలికరంగంలో పెద్దమొత్తంలో పెట్టుబడులు అవసరం అవుతాయి. దేశంలోని మౌలికరంగాన్ని బలోపేతం చేయడానికి 2040 నాటికి భారత్‌కు సుమారు 450 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని సర్వేలో పేర్కొంది. ఈ నివేదికను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సోమవారం నాడు పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం పరిస్థితులను బట్టి చూస్తే మొత్తం 450 లక్షల కోట్ల డాలర్లకుగాను 390 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులను సేకరించుకునే అవకాశాలున్నాయి. మొత్తానికి భారత్ మౌలికరంగంలో మొత్తం పెట్టుబడులు 2040 నాటికి 526 లక్షల కోట్ల డాలర్లు అవసరమవుతాయని నివేదికలో పేర్కొంది. ఈ రంగంలో పెట్టుబడులు రాబోయే సంవత్సరాల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని తెలిపింది. మౌలికరంగంలో పెట్టుబడుల కోసం ప్రైవేట్ పెట్టుబడులను ప్రత్యేకంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్ ఉదాహరణకు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎన్‌ఐఐబీ)ని ఏర్పాటు చేసిగ్లోబల్ ఇన్సిస్టిట్యూట్‌ను ఉదాహరణకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ), న్యూ డెవలెప్‌మెంట్ బ్యాంకు (గతంలోబ్రిక్స్ బ్యాంకు) కూడా మౌలికరంగంలో పెట్టుబడులు చాలా తక్కువగా వస్తున్నాయని పేర్కొంది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)పద్ధతిలో జరిగే విద్యుత్, టెలికం ప్రాజెక్టులు కుప్పకూలడమేనని పేర్కొంది. ఈ రంగంలో ప్రైవేట్‌కంపెనీల బ్యాలెన్స్‌షీట్లు బలహీనపడ్డాయని.. భూములు, అటవీ అనుమతుల మంజూరులో జాప్యం కారణంగా ఈ రంగాలు సంక్షోభంలో చిక్కుకున్నాయని తెలిపింది. మౌలికరంగంలో ప్రధానంగా రోడ్డు రవాణా కీలకపాత్ర పోషిస్తోందని భారత ఆర్థిక వ్యవస్థకు సింహ భాగం ఆదాయం ఈ రంగం నుంచే వస్తోందని సర్వే పేర్కొంది. ప్రభుత్వం ఈ రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో 2011లో 33.73మిలియన్ కిలోమీటర్ల నుంచి ప్రస్తుతం 57.17 మిలియన్ కిలోమీటర్లకు పెంచగలిగింది. అలాగే రోడ్లపై వాహనాల సంఖ్య కూడా నాలుగు రెట్లు పెరిగి 229 మిలయన్‌లకు చేరాయి.ఆర్థికసర్వేలో భారత రోడ్ల సాంద్రత 1.66 కిలోమీటర్లు... జపాన్, అమెరికా, చైనా, బ్రెజిల్, రష్యన్ ఫెడరేషన్ కంటే ఎక్కువని తెలిపింది. ఉపరితల రోడ్డు పొడవు మొత్తం రోడ్డు పొడవులో 61 శాతమని.. బ్రిటన్, కొరియా, రష్యా, చైనా కంటే చాలా తక్కువని వివరించింది. సెప్టెంబర్ 2017లో ప్రస్తుతం కొనసాగుతున్న మొత్తం 1263 ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వాటిలో 482 ప్రాజెక్టులు రోడ్డు రవాణా, జాతీయ రహదారుల ప్రాజెక్టులవి..వీటి విలువ రూ.3,17,379.9 కోట్లుగా తేలింది. వాటిలో 43 ప్రాజెక్టుల వ్యయం వాస్తవ వ్యయం కంటే పెరిగింది. 74 ప్రాజెక్టులు అనుకున్న గడువును దాటిపోయాయి.


రైల్వేరంగం : రైల్వే రంగం వివిధ రకాల రవాణా సంస్థలతో గట్టి పోటీని ఎదుర్కొంటోందని.. రైల్వేలను గాడిలో పెట్టడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకొంటోందని నివేదికలో పేర్కొంది. మెట్రో రైల్ గురించి ప్రస్తావిస్తూ.. దేశంల మొత్తం 425 కిలోమీటర్ల రైల్వే వ్యవస్థ పనిచేస్తోందని ఢిల్లీ, నోయిడా, గురుగ్రాం, కోలకతా, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, జైపూర్, లక్నో, కోచిలలో మెట్రో రైల్వే సర్వీసులు నడుస్తున్నాయి. సుమారు 684 కిలోమీటర్ల రైల్వేలైను పనులు వివిధ నగరాల్లో డిసెంబర్ 2017 వరకు కొనసాగిందని తెలిపింది.

పౌరవిమానయానం: దేశంలో 50 విమానాశ్రయాలను పునరుద్దరించడానికి రూ.4,500 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి బడ్జెట్‌లో పెద్దమొత్తంలో కేటాయింపులు చేస్తుంది.

నౌకాయానం : షిప్పింగ్... లేదా నౌకాయాన రంగంలో ప్రభుత్వం 2017-18లో సుమారు రూ.10వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టింది. అదనంగా 80 ఎంఎంటీపీఏ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ పెట్టుబడులు సమకూర్చింది. వాటిలో 15 ప్రాజెక్టులపై రూ.3,159 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనుంది. అదనంగా 18 ఎంటీపీఏ సామర్థ్యం పెంచుకోడానికి పనులు కూడా అప్పగించింది. ప్రభుత్వం భారతమాలా, సాగరమాలాకు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. జాతీయ రహదారులు, నౌకరంగాలపై పెద్దెత్తున దృష్టి పెడుతుందని సర్వేలో వివరించింది. సాగరమాలా పోర్ట్స్ మాస్టర్ ప్లాన్ కూడా ఖరారైంది. మొత్తం 131 రేవుల సామర్థ్యాన్ని పెంచే ప్రాజెక్టు కోసం రూ.85,346 కోట్లు పెట్టుబడులు ఖరారుచేసింది. రేవులను గుర్తించి వచ్చే 20 సంవత్సరాల్లో వీటిని పూర్తి చేస్తుంది.

విద్యుదుత్పత్తి : గత కొన్ని సంవత్సరాల నుంచి విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరిగిపోతోంది. నవంబర్ 30, 2017 నాటికి దేశంలో విద్యుత్ ఉత్పత్తి 330860.6 మెగావాట్లకు చేరింది.

టెలికంరంగం: టెలికం రంగం గురించి ప్రస్తావిస్తూ.. భారత్ నెట్ రెండవ ఫేజ్ కింద 1.5 లక్షల గ్రామ పంచాయతీలను హైస్పీడ్ బ్రాండ్‌బ్యాండ్‌తో అనుసంధానం చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు మార్చి 2019 నాటికి పూర్తవుతుందని ఆర్థిక సర్వే నివేదికలో వివరించింది.



2020 నాటికి లాజిస్టిక్‌రంగం 215 బి.డాలర్లకు

ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్ (సరకురవాణా) రంగం విలువ 16,000 కోట్ల డాలర్ల వరకు ఉంది. 2020 నాటికి ఇది కాస్తా 21,500కోట్ల డాలర్లకు చేరుతుందని సోమవారం విడుదల చేసిన ఆర్థికసర్వేలో అంచనా వేసింది. రవాణారంగం పుంజుకోవడానికి ప్రధాన కారణం గతేడాది జులై 1 నుంచి అమల్లోకి తెచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టి)అని నివేదికలో పేర్కొంది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత ఈ రంగం ఏడాదికి 10 శాతం చొప్పున వృద్ధిని సాధిస్తుందని తెలిపింది. ఈ రంగం సుమారు 2.2 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోందని, గత ఐదు సంవత్సరాల నుంచి 7.8 శాతం వృద్ధిని సాధించిందని పేర్కొంది. ప్రపంచబ్యాంకు లాజిస్టిక్ పెర్ఫార్మెన్స్ సూచిలో 2014లో 54 ర్యాంకు నుంచి 2016కు 35 ర్యాంకుకు దిగివచ్చింది. మొత్తానికి లాజిస్టిక్ రంగం క్రమంగా మెరుగుపడుతుందని నివేదికలో వివరించింది. ఈ రంగం ప్రాముఖ్యతను గమనించి ప్రభుత్వం దీర్ఘకాలిక రుణాలతో పాటు సరసమైన వడ్డీరేట్లకు రుణాలు అందిస్తోంది. రవాణా రంగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోదాను కల్పించాలని చూస్తోంది. దీంతో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులను నిర్మించుకోవడంతో పాటు స్టోరేజి, ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మించుకోవడానికి వీలవుతుంది. ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. లాజిస్టిక్‌రంగాన్ని అభివృద్ధి చేయడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పెట్టుబడులను ప్రోత్సహించడం, సరికొత్త నైపుణ్యం తీసుకురావడం, ఈ రంగంలో ఉన్న అడ్డంకులను తొలగించడం, అంతర్గత మోడల్ రవాణా వ్యవస్థను మెరుగుపర్చడం, ఆటోమేషిన్, అనుమతులు వేగంగామంజూరు చేయడానికి సింగిల్‌విండో వ్యవస్థను తీసుకురావడం తదితర అంశాలని నివేదికలో వివరించింది. లాజిస్టిక్ రంగంలో మేకిన్ ఇండియాను తీసుకువచ్చి భారత్‌ను గ్లోబల్ సప్లయి చెయిన్‌గా తీసుకువస్తామని ఆర్థికనివేదికలో వివరించింది.

కార్పొరేట్ పన్నులో భారీ తగ్గింపు

- 50శాతం నిపుణుల అంచనా
- డెలాయిట్ నివేదిక



ముంబై : గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నును 500 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని 50 శాతం నిపుణులు అభిప్రాయపడ్డారు. డెలాయిట్ వివిధ రంగాలకు చెందిన 120 మంది నిపుణులను పలకరించింది. వారిలో 50శాతం మంది పన్ను సంస్కరణల్లో భాగంగా 50 శాతం మంది కార్పొరేట్ టాక్స్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తారని అభిప్రాయపడ్డారని సర్వే వెల్లడించింది. ప్రభుత్వం నల్లధనాన్ని అడ్డుకట్ట వేయడానికి కఠిన చర్యలు తీసుకున్నందున ప్రస్తుతం కార్పొరేట్ పన్నును తగ్గించడానికి ఇదే అనువైన సమయమని వారు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే ఆదాయపుపన్ను పరిమితిని పెంచాలని, తిరిగి స్టాండర్డ్ డిడెక్షన్‌ను పద్ధతిని తీసుకురావాలని కోరారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచితే ఉద్యోగుల చేతిలో నగదు ఆడుతుందని.. దీంతో వారు ఖర్చు చేసుకోవడానికి లేదా పొదుపు చేసుకోవడానికి లేదా ప్రభుత్వబాండ్లలో పెట్టుబడి పెట్టుకోవడానికి వీలవుతుందన్నారు. 50శాతం మంది నిపుణులు జీడీపీ వృద్ధిరేటు 7శాతం సాధిస్తుందని అంచనా వేశారు.

అంచనాలను మించిన టెక్ మహీంద్రా

న్యూఢిల్లీ : ఐటి దిగ్గజం టెక్ మహీంద్రా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించిపోయాయి. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 10.2 శాతం వృద్ధితో రూ.943.1 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.856కోట్లు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. రెవెన్యూ విషయానికి వస్తే 2.9 శాతం వృద్ధితో రూ.7,557 కోట్లు ఆర్జించింది. (ఇండియన్ అకౌంట్ స్టాండర్డ్స్) ప్రకారం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,557.5 కోట్లని తెలిపింది. తమ ఫోకస్ ఇప్పటి నుంచి డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌పై ఉంటుందని.. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని తమ ఉద్యోగులకు కొత్తటెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నామని మంచి పురోగతి కనిపిస్తోందని కంపెనీ వైస్ చైర్మన్ వినీత్ నయ్యర్ చెప్పారు. ప్రస్తుతం మార్కెట్ మందగమనంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో మంచి ఫలితాలను సాధించామని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. త్రైమాసికం ప్రాతిపదికన రెవెన్యూ 12.8 శాతం వృద్ధి కనిపించిందని, డాలర్ ప్రాతిపదికన 2.2 శాతమని.. నికర లాభం 16.5 శాతం వృద్ధితో 147 మిలియన్ డాలర్లు ఆర్జించింది. రెవెన్యూ విషయానికొస్తే 8.3 శాతం వృద్ధితో 120కోట్ల డాలర్లు సాధించిందని టెక్ మహీంద్రా ఒక ప్రకటనలో పేర్కొంది. డిసెంబర్ చివరి నాటికి 903 క్లయింట్లున్నారని తెలిపింది. కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 115,241 మంది సీఈవో సీపీ గుర్నానీచెప్పారు. ఇక నుంచి తమ ఫోకస్ 'డేవిడ్' స్ట్రాటజీ (డిజిటైజేషన్, ఆటోమేషిన్, వెర్టికలైజేషన్, ఇన్నోవేషన్, డిస్‌రప్షన్)అని ఆయన వివరించారు.



2017-18లో సరాసరి ద్రవ్యోల్బణం 3.3శాతం

ఈ ఆర్థికసంవత్సరం 2017-18లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరు సంవత్సరాల కనిష్ఠానికి 3.3 శాతానికి దిగిచ్చింది. దీని బట్టి చూస్తే ధరలు స్థిరంగా ఉన్నాయని లెక్క.. ఆర్థిక సర్వే నివేదికలో ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొంది. ఆర్‌బీఐ ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ద్రవ్యపరపతి సమీక్ష ప్రకారం చూస్తే ఈ ఆర్థికసంవత్సరం సరాసరి రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతానికి దిగొస్తుందని.. ఆరు సంవత్సరాల్లో ఇదే అత్యంత కనిష్టమని పేర్కొంది. గృహ, ఇంధనం, విద్యుత్ తప్పించి మిగిలిన కమాడిటిల ధరలుతగ్గాయని నివేదికలో వివరించింది. గత నాలుగు సంవత్సరాల నుంచి ఆర్థిక వ్యవస్థ క్రమంగాగాడిన పడుతోందని, అధిక ద్రవ్యోల్బణం నుంచి క్రమంగా తగ్గుముఖం పడుతోందని పేర్కొంది. ధరలుస్థిరంగా ఉన్నాయని వివరించింది. గత నాలుగు సంవత్సరాల నుంచి రిటైల్ ద్రవ్యల్బణం అదుపులో ఉందని, ఈ ఆర్థికసంవత్సరం ఆహార ద్రవ్యోల్బణం (-) 2.5 నుంచి 1.5 శాతానికి దిగివచ్చిందని.. దీనికి ప్రధాన కారణం వ్యవసాయోత్పత్తుల దిగుబడి పెరగడమే... దీంతో పాటు ధరల నియంత్రణ కూడా జరిగిందని తెలిపింది. ఇటీవల కాలంలో కూరగాయలు, పండ్ల ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం క్రమంగా పుంజుకుంటోందని వివరించింది.



ప్రభుత్వం ద్రవ్యో ల్బణాన్ని అదుపు చేయడానికి గట్టి చర్యలు తీసుకుంటోందని ఆర్థికసర్వేలో వివరించింది.

మార్కెట్లకు సర్వే కిక్కు!

- 233పాయింట్ల వృద్ధి

ముంబై: ఆర్థికసర్వేలో వృద్ధిరేటు పుంజుకుంటుందని అంచనా వేయడంతో స్టాక్ మార్కెట్లు బుల్‌రన్‌లో దూసుకుపోయాయి. బీఎస్‌ఈ 233 పాయింట్ల వృద్ధితో సరికొత్త రికార్డు 36,283.25 పాయింట్లకు.. నిఫ్టీ 11,130.40 పాయింట్లకు ఎగబాకింది. ఆర్థికసర్వేలో వచ్చే ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 నుంచి 7.5 శాతానికి, ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.7 శాతంగా నమోదు కావచ్చునని పార్లమెంటు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్లను నడిపించేంది మాత్రం బడ్జెట్, ఆర్థిక క్రమశిక్షణ, గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతంచేయడంతో పాటు క్యూ3 ఫలితాలు కీలకం కానున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2017-18 ఆర్థిక సర్వేలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్ల వృద్ధిరేటు జోరందుకుంటుందని దాని ప్రభావం వచ్చే ఆర్థికసంవత్సరంలో కనిపిస్తుందని తెలిపింది. కాగా గురువారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.937.30 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ ఇన్వెస్టర్లు రూ.965.67 కోట్ల షేర్లు విక్రయించారు. బీఎస్‌ఈలో అత్యధికంగా మారుతి సుజుకి షేరు 3.85 శాతం లాభపడింది. హెచ్‌డీఎఫ్‌సీ 2.66 శాతం మిగిలిన షేర్లు ఇలా ఉన్నాయి. టీసీఎస్, హీరోమోటోకార్ప్, కొటక్ మహీంద్రాబ్యాంక్, హిందుస్తాన్ యూనీలీవర్, టాటాస్టీల్, బజాజ్‌ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు,సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టి, ఇన్ఫోసిస్, ఎంఅండ్‌ఎం, విప్రో,కోల్ ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఏషియన్ పెయింట్స్ 2.48 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్, భారతి ఎయిర్‌టెల్, ఐటీసీ, ఎస్‌బ్యాంకు, ఒఎన్‌జీసీ, యాక్సిస్‌బ్యాంకు, ఎస్‌బీఐలు 5.92 శాతంవరకు ఉన్నాయి.

నోట్ల రద్దుతో పెరిగిన పన్ను వసూళ్లు

- పెరిగిన గృహపొదుపు



న్యూఢిల్లీ : నవంబర్ 8, 2016న కేంద్రంలోని మోడీ సర్కార్ రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో పన్ను చెల్లింపుదారులు పెరగడంతోపాటు గృహస్తుల పొదుపు కూడా పెరిగిందని 2017-18 ఆర్థికసర్వేలో పేర్కొంది. ప్రభుత్వం బంగారం బాండ్లను విడుదల చేసి దానిపై వడ్డీ ఇస్తామని ప్రకటించడంతో చాలా మంది తమ వద్ద నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని గోల్డ్ బాండ్‌కు బదలీచేశారని దీంతో పొదుపురేటు కూడా పెరిగిందని నివేదిక వివరించింది. పెద్దనోట్ల రద్దుతర్వాత పన్ను చెల్లింపుదారులు బాగా పెరిగాయని సర్వేలో తేలింది. ప్రతి నెల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 0.8 శాతం పెరుగుతూ పోయింది. దీని ప్రకారం లెక్కిస్తే నవంబర్ 2017 నాటికి వార్షిక ప్రాతిపదికన చూస్తే పన్ను చెల్లింపుదారుల సంఖ్య సుమారు పది శాతం పెరిగినట్లు తేలింది. అంచనా కంటే ఇది 31 శాతం అధిమని ఆర్థికసర్వేలో వివరించింది. వివరంగా చెప్పాలంటే పెద్దనోట్ల రద్దు, జీఎస్టి తర్వాత సుమారు 18 లక్షల మంది అదనంగా పన్ను చెల్లింపుదారులు జత అయ్యారని, ప్రస్తుతం చెల్లింపుదారులకు అదనంగా ఇది మూడు శాతం అవుతుందని నివేదికలో వివరించింది.

వస్తు సేవల పన్ను (జీఎస్టి)అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి పరోక్ష పన్నులు చెల్లించే వారి సంఖ్య50 శాతం పెరిగింది. సుమారు 34 లక్షల మంది వ్యాపారులు పన్ను పరిధిలోకి వచ్చారని ఆర్థిక సర్వే పేర్కొంది. స్వచ్ఛందంగా వ్యాపారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని.. చిన్న వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్స్ కొరకు వ్యాపారులు స్వచ్ఛందంగా జీఎస్టి రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని తెలిపింది. పరోక్షపన్నులు చెల్లించేవారి సంఖ్య 50 శాతం పెరిగి 34 లక్షలకు చేరింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అది పెద్ద ఆర్థికసంస్కరణ జీఎస్టి.. ప్రారంభంలో కొంత గందరగోళం నెలకొన్నా ప్రస్తుతం గాడినపడిందని తెలిపింది. డిసెంబర్ 2017 నాటికి 98 లక్షల మంది వ్యాపారులు జీఎస్టికింద స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పాత పరోక్షపన్నుల రిజిస్ట్రేషన్‌తో పోల్చుకుంటే ఈ సంఖ్య రెట్టింపు అని తెలిపింది. జీఎస్టి అమలుకాకముందు కేంద్ర, రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు రూ.9.7లక్షల కోట్లు కాగా, వార్షిక జీఎస్టి రెవెన్యూ వసూళ్లు రూ.10.9 లక్షల కోట్ల వరకు ఉండ వచ్చునని పేర్కొంది. ప్రస్తుతం రెవెన్యూ వసూళ్లను దృష్టిలో ఉంచు కొని ఈ అంచనా వేసింది.



హెచ్‌డీఎఫ్‌సీ లాభం రూ. 5,670కోట్లు

- క్యూ3లో 233శాతం వృద్ధి

న్యూఢిల్లీ : హౌసింగ్ డెవలెప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో ఏకంగా 233.3శాతం వృద్ధితో రూ.5,670.2 కోట్లు ఆర్జించింది. దీనికి ప్రధాన కారణం కంపెనీకి అనుబంధ సంస్థ అయిన బీమా వ్యాపారాన్ని విక్రయించడమే. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.1,701.2 కోట్లు ఆర్జించింది. డిసెంబర్ త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్స్యూరెన్స్‌ను రూ.3,375.3 కోట్లు విక్రయించడంతో దాని ప్రభావం లాభాలపై కనిపించింది. క్యూ3లో రెవెన్యూ 6.55 శాతం పెరిగి రూ.8,667.15 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,133.78 కోట్లు నమోదుచేసింది. నికరవడ్డీ ఆదాయం ..రుణాలపై నికరంగా ఆర్జించిన వడ్డీ.. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ చెల్లించిన వడ్డీ వ్యత్యాసం 11.2 శాతం పెరిగి రూ.2,967.7 కోట్లకు చేరింది. నికరవడ్డీ మార్జిన్ క్యూ3లో కాస్తా క్షీణించి 3.86శాతానికి దిగిరాగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 3.95 శాతంగా నమోదు కాగా... సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 3.90శాతమని హచ్‌డీఎఫ్‌సీ సీఈవోకెకీ మిస్త్రీ చెప్పారు. డిసెంబర్ త్రైమాసికంలో రుణ పుస్తకం రూ.3.4 లక్షల కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2.87 లక్షల కోట్లని ఆయన వివరించారు. మొండిబకాయిల విషయానికి వస్తే 1.15 శాతంగా నమోదు కాగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో 1.14 శాతంగా నమోదైంది. జులై ఏజీఎంలో ఆమోదించిన రూ.35,000 కోట్ల నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లను హెచ్‌డీఎఫ్‌సీ బోర్డు ఆమోదించింది. బీఎస్‌ఈలో దీని షేరు 2.50 శాతం పెరిగి రూ.1,950.05 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

సర్వే భేష్... బడ్జెట్ బాగుండాలి

న్యూఢిల్లీః ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే పట్ల భారతీయ పారిశ్రామిక,వాణిజ్య మండలుల సమాఖ్య (సిఐఐ) హర్షం వ్యక్తం చేసింది. ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు మానవ వనరులనూ, వ్యవసాయోత్పాదనను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని పారిశ్రామికవర్గాలు నిర్ణయించాయి. వచ్చే సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించుకున్న వృద్ధి రేటు 7.5 శాతాన్ని సాధించేందుకు కృషి చేస్తామని పారిశ్రామికవర్గాలు ప్రకటించాయి. ఆర్థిక సర్వేలో కొత్త ఆలోచనలు ఉన్నాయనీ, ఆర్థికాభివృద్ధి సాధనకు అవి ఊతాన్ని ఇవ్వగలవని సిఐఐ డైరక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. నవభారత నిర్మాణానికి ఈ కొత్త ఆలోచనలు ఎంతో దోహదం చేస్తాయని సిఐఐ పేర్కొంది. దీర్ఘకాలికమైన లక్ష్యాలతో ప్రభుత్వం రూపొందించిన విధానాలు సక్రమంగా అమలు జరగాలని కోరుకుంటున్నట్టు బెనర్జీ పేర్కొన్నారు.మహిళల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం,మెరుగైన కార్మిక శక్తిని రూపొందించుకోవడం వంటి లక్ష్యాల సాధన కు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండగలవన్న ఆశాభావాన్ని బెనర్జీ వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బకాయిల గురించి ఆర్థిక సర్వేలో ప్రధానంగా ప్రస్తావించడం జరిగిందనీ,అలాగే,ఉపాధి అవకాశాలను మెరుగు పర్చడంతోపాటు,వ్యవసాయం, విద్యారంగాల్లో ఇతోధిక ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరం గురించి ఆర్థిక సర్వేలో ప్రధానంగా ప్రస్తావించడం సరైనదేనని అసోచెమ్ అధ్యక్షుడు సందీప్ జాజోదియా అన్నారు. ఉపాధి కల్పన, విద్య, వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించడాన్ని స్వాగతిస్తున్నామని పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అనిల్ ఖైతాన్ అన్నారు.

ఆర్థిక పరిస్థితి నిలదొక్కుకోవడానికి ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. వృద్ధి రేటను 7నుంచి 7.5 శాతం సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యం సాకారం అయ్యేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఆయన ప్రకటించారు. సేవారంగంలో మరిన్ని అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డెల్లోయట్ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త అనీస్ చక్రవర్తి అన్నారు. తయారీ రంగంలో వృదత్ధి సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని పిడబ్ల్యుసి ఇండియాకు చెందిన మనీష్ అగర్వాల్ అన్నారు.



ఆటోఎక్స్‌పోలో టాటామోటర్స్... ఈవీ వాహనాల ప్రదర్శన

న్యూఢిల్లీ : దేశీయ ఆటోదిగ్గజం టాటామోటార్స్ వచ్చే నెల ప్రారంభం కానున్న ఆటోఎక్స్‌పోలో ఆరు రకాల ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శనకు ఉంచుతుంది. కంపెనీ ఇప్పటికే మొత్తం 26 స్మార్ట్‌మొబిలిటీ వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామని ప్రకటించింది. న్యూఢిల్లీలో ఫిబ్రవరి 9-14 వరకు ఆటోఎక్స్‌పో జరుగనుంది. ప్రభుత్వం 2030 నాటికి దేశవ్యాప్తంగా మొత్తం ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నందు వల్ల దానికి తగ్గట్టుగానే తాము ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నట్లు టాటామోటార్స్ అధికార ప్రతినిధి చెప్పారు. దీంతో పాటు ప్రభుత్వం స్మార్ట్‌సిటిపై ప్రత్యేక దృష్టి పెట్టినందువల్ల భవిష్యత్తులో అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే ఉంటుందని ఆయన వివరించారు. టాటామోటార్స్ ఇప్పటికే ప్రభుత్వరంగానికి చెందిన ఈఈఎస్‌ఎల్‌నుంచి 350 ఎలక్ట్రిక్ కార్ల ఆర్డర్ తీసుకునివాటిని సరఫరా కూడా చేసింది. టెక్ మహీంద్రా కూడా 150 ఎలక్ట్రిక్ కార్లను సరఫరా చేసింది. ఎలక్ట్రిక్ వాహనాల రోడ్‌మ్యాప్‌గురించి కంపెనీ ఎండీ, సీఈవో గుంటెన్ బట్స్‌చెక్ మాట్లాడుతూ... ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎలక్ట్రిక్ వాహనాలను వీలైనంత త్వరగా భారత్ మార్కెట్లో విడుదల చేస్తామని ఆయన అన్నారు.



మహిళా కళాకారుల ఆటా పాట



విద్యుత్ వెలుగుల మధ్య మేడారం



ఆదివాసీల గుస్సాడీ నృత్య ప్రదర్శన

ప్రారంభానికి..సన్నద్ధం

ఆదివాసి కళాకారుల నృత్య ప్రదర్శనలు అద్భుతం

భూపాలపల్లి, ప్రభన్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో ఆదివాసీల మహాజాతర సందర్భంగా గిరిజన మ్యూజియంలో సోమవారం వివిధ జిల్లాలకు చెందిన ఆదివాసీ కళాకారుల బృందాలు ఇచ్చిన పలు రకాల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా సిహెచ్ తానుభాయి ఆధ్వర్యంలో బృందం ధింసా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అశ్వరావుపేటకు చెందిన కారం మల్లయ్య ఆధ్వర్యంలో కొమ్ముకోయ నృత్య ప్రదర్శన, అదేవిధంగా ఆదిలాబాద్‌కు చెందిన వైకుంఠం బృందం చే గుస్సాడి నృత్యం, ఏటూర్‌నాగారం మండలం చెలుపాలక గ్రామానికి చెందిన కోట నర్సింహుల బృందం లక్ష్మీ దేవరా ప్రదర్శన రక్తికట్టించాయి. భద్రాచలానికి చెందిన కొరస రాజయ్య ఆధ్వర్యంలో కొమ్ముకోయ నృత్యం, వాజేడు మండలం గుమ్మడిదొడ్డికి చెందిన ఇరుప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కళకారులు పలు రకాల ప్రదర్శనలు ఇచ్చారు. జాతరకు వచ్చిన భక్తులు మ్యూజియంను తికించడమే కాకుండా మూడు రోజులుగా మ్యూజియంలో ఆదివాసీ కళకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు నృత్య ప్రదర్శణలు అలరించనున్నాయి. ఈ కార్యక్రమాలు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

తల్లుల చెంతకు పాండిచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి

భూపాలపల్లి, ప్రభన్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, తాడ్వాయి మండలంలోని మేడారంలోని శ్రీ సమ్మక్క -సారలమ్మ మహాజాతరను పాండిచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు సోమవారం సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండోమెంట్ అధికారులు , ట్రస్టు బోర్డు సభ్యులు మంత్రిని సన్మానించారు. తల్లుల చెంతకు మంత్రిని తీసుకువెళ్లి గిరిజన సంప్రదాయాల ప్రకారం పత్యేక పూజలు జరిపించారు.

5 రిక్రూట్‌మెంట్ల ఫలితాలు విడుదల

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పోస్టుల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 5 రిక్రూట్‌మెంట్ల ఫలితాలను సోమవారం విడుదల చేసింది. కాలుష్య నియంత్రణ మండలి, గిరిజన గురుకులాలు, పశుసంవర్ధక శాఖల్లో నిర్వహించిన భర్తీకి సంబంధించిన ఫలితాలను విడుదల చేసింది. కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పోస్టులకు సంబంధించి 25 మంది అభ్యర్ధులను ఎంపిక చేసింది. మొత్తం 26 పోస్టులు ఉండగా ఒక పోస్టుకు సంబంధించి విజువల్‌హ్యాండికాప్ అభ్యర్థి లేకపోవడంతో పోస్టు ఖాళీగా ఉందని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు కోడ్ నంబర్4కు సంబంధించి ముగ్గురు అభ్యర్ధులను ఎంపిక చేసింది. తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీలో ఫిజికల్ డైరక్టర్ పోస్టులకు ముగ్గురు అభ్యర్ధులను ఎంపిక చేసింది. మొత్తం పోస్టులు ఆరు ఉండగా మూడు పోస్టులకు సంబంధించి ఏజెన్సీ అభ్యర్ధులు లేకపోవడంతో ఖాళీగా ఉంచారు. పశుసంవర్ధక శాఖలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జియన్స్‌కు సంబంధించి ఆరుగురు అభ్యర్ధులను ఎంపిక చేశారు. ఏడు పోస్టుల్లో ఆరుగురిని ఎంపిక చేయగా ఒకరు బీసీ- ఏ కేటగిరిలో మహిళా అభ్యర్ధి లేకపోవడంతో ఒక పోస్టు ఖాళీగా ఉంది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ కాలేజీ ప్రిన్సిపాల్స్‌కు సంబంధించి నలుగురు అభ్యర్ధులను ఎంపిక చేశారు. మొత్తం 30 ఖాళీలు ఉండగా కేవలం నలుగురిని మాత్రమే ఎంపిక చేశారు. మిగిలిన 26 పోస్టులకు అభ్యర్ధులు లేకపోవడంతో భర్తీ చేయలేదని అధికారులు తెలిపారు. టిఎస్‌పిఎస్సీకి 75 దరఖాస్తులు వచ్చినట్టు కార్యదర్శి తెలిపారు. అందులో ఐదు దరఖాస్తులు మాత్రమే అర్హత సాధించగా అందులో నలుగురు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారని వారిని ఎంపిక చేసినట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు.

అమ్మవారి సేవలో ఐజీ చారుసిన్హా



వరంగల్ కల్చరల్, ప్రభన్యూస్: వరంగల్ పట్టణం లో చరిత్ర ప్రసిద్దిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని ఐ.జి. చారుసిన్హాకు ఆలయ ఈఓ ఆర్. సునీత ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించినాంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. పూజానంతరం దేవస్థాన మహా మండపంలో చారుసిన్హాకి ముఖ్య అర్చకులు చెప్పెల వెంకటనాగరాజు శర్మ ఆధ్వర్యమున దేవస్థాన వేదపండితులు పాలకుర్తి నర్సింహమూర్తి, ప్రదీప్ కుమార్ శర్మలు, అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలను బహుకరించి ప్రసాదాన్ని అందచేశారు.

కాల్వలో బస్సు బోల్తా 36 మంది దుర్మరణం

బహరమ్‌పూర్, పశ్చిమబెంగాల్: ఆర్టీసీ బస్సు వంతెన రెయిలింగ్‌ను ఢీకొని కాలువలో పడిన ఘటనలో 10 మహిళలు సహా కనీసం 36 మంది దుర్మరణం పాలైన ఘటన పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో సోమవారం చోటు చేసుకుంది. ముర్షీదాబాద్ జిల్లాలోని, దౌలతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బలిర్‌ఘాట్ వద్ద ఉదయం ఆరు గంటలకు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. నదియా జిల్లాలోని శికర్‌పూర్ నుంచి మాల్దాకు వెళుతున్న ఉత్తర బెంగాల్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఎన్‌బిఎస్‌టీసీ) బస్సు రెయిలింగ్‌ను ఢీకొని కాలువలో పడిందని వారు చెప్పారు. దుర్ఘటన ఆందోళనలకు దారి తీసింది. పోలీసులు ఆలస్యంగా వచ్చారంటూ ఆగ్రహించిన స్థానికులు వారిపై దాడి చేశారు. బస్సులో నుంచి 32 మృతదేహాలను వెలికితీసినట్టు రాష్ట్ర రవాణా మంత్రి సువేందు అధికారి తెలిపారు.మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉండవచ్చన్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా మేజిస్ట్రేట్, సీనియర్ పోలీసు అధికారులతో పాటు ఎస్పీ పరిశీలించారు. మృతుల ఒక్కో కుటుంబానికి సీఎం రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.1లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు.

మరో 24 గంటల్లో గద్దెకు సారలమ్మ

భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం సమ్మక్క - సారలమ్మ మహాజాతర ప్రధాన ఘట్టం ప్రారంభానికి మరో రోజు మాత్రమే ఉంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు సారలమ్మ తల్లిని కన్నెపల్లి నుంచి పూజారి గద్దెలకు గిరిజన సంప్రదాయాల ప్రకారం తీసుకురావడానికి ఏర్పాట్లు జరుగుతాన్నాయి. ఆదివారం రాత్రి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు, మేడారాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఒకటి రెండు శాఖలకు చెందిన అధికారుల పై మండిపడ్డారు. జాతర నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు పెండింగ్‌లో ఉన్న పనుల పై శ్రద్ధ చూపాలని 24 గంటల్లో పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అవస్థలు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం తాను జాతర నుంచి వెళ్లిపోయే ముందు కూడా జాతరలో పెండిగ్ పనులను పూర్తి చేయాలని అధికారుల దృష్టికి మరో సారి తీసుకు వచ్చారు. ఆదివారం అర్ధరాత్రి వరకు జాతర ప్రాంగణంలో ఉన్న మంచెపై నుండి జాతరను పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలను అధికారుల దృష్టికి తీసు కువచ్చారు.జాతరకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రజ లు ఎడ్లబండ్లలో కుటుంబాలతో జాతరకు వస్తున్నారు. జంపన్న వాగుకు జలకళ రావడంతో జాతరకు వచ్చిన భక్తులు ఆనందోత్సాహాలతో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. వరాల తల్లి సారలమ్మ రాక కోసం భక్తులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. సోమవారం సుమారు లక్షకు పైచిలుకు భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. ఎత్తు బెల్లాలతో ముందస్తు మొక్కులను చెల్లించుకుంటున్నారు.



మహాజాతరకు అధికారులు సమాయత్తం

భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారం మహాజాతర ఈ నెల 31 నుండి ఫిబ్రవరి 3 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించటానికి అధికారులు, సిబ్బంది సమయత్తం అయ్యారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కర్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న సారలమ్మ గద్దెను అలక రించనుండగా, ఫిబ్రవరి 1న సమ్మక్క గద్దెను చేరుకుంటుందని, 2న భక్తులు మొక్కులు చెల్లిస్తారన్నారు. 3న సమ్మక్క-సారక్కలు తిరిగి వన ప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుందన్నారు. ప్రతి రెండు సంవ త్సరాలకు ఒక సారి జరిగే ఈ గిరిజన మహాజాతరకు సుమారు 1. 25 కోట్ల భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారని అంచనా అన్నారు. ఈ సంవత్సరం జాతర ఏర్పాట్లకు రూ. 80.55 కోట్ల నిధులు కేటాయించటం జరిగిందని, జాతర ఏర్పాట్లు అన్ని పూర్తి చేసి జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధం అయిందన్నారు. జాతర ప్రాంతం మొత్తం 38 సెక్టార్లుగా విభజించి, పూర్వపు వరంగల్ జిల్లా నుండి సీనియర్ అధికారులను సెక్టోరల్ అధికారులుగా నియమించటం జరిగిందన్నారు. మూడు షిఫ్టుల్లో అధికారులు 24 గంటల పాటు సెక్టార్లలో భక్తులకు సేవలందించటం జరుగుతుందన్నారు. జాతరలో 119 మంది జిల్లా ఉన్నతాధికారులు 9321 పోలీసు అధికారులతో పాటు సుమారు 12 వేల మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. 545 పారిశుద్య మరుగుదొడ్లు 9180 జీఐసీల్డ్ 1200 వెదురు తడకలతో పాటు 700 ప్రైవేటు అద్దె మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2 కిలోమీటర్ల మేర స్నాన ఘట్టాల ఏర్పాట్లు 132 దుస్తులు మార్చుకొనుటకు గదులు ఏర్పాటు చేయడం జరిగందన్నారు. ప్రత్యేకంగా కళ్యాణ కట్టలు నిర్మించటం జరిగిందని, 4200 బస్సులు ఏర్పాటు, 32 పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, 30 రెస్టు రూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టీటీడీ కళ్యాణ మండపంలో 50 పడకల ఆసుపత్రి, 56 వైద్య శిబిరాలు, 10 మంది ఎంఎస్, 10 మంది ఎండీ, 150 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు కలిసి 500 మంది వైద్యసిబ్బంది పనిచేస్తున్నారన్నారు. జంపన్నవాగులో 300 మంది గజ ఈత గాళ్లు సిద్ధంగా ఉంటారని, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా టీటీడీ కళ్యాణ మండపంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 38 సెక్టార్లలో సానిటేషన్ శిబిరాలు, 10 పశువైద్య శిబిరాలు, 6 మిస్సింగ్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 941 ప్రాంతాల్లో బీఓటీలు ఒక్కొటి పది చొప్పున 9410 మంచినీటి కొలాయిలు, 480 హ్యాండ్ బోర్‌వెల్స్, 4 ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా మంచినీరు అందించటం జరుగుతుందన్నారు. 700 మంది ఎన్ఎస్ఎస్ /ఎన్‌సీసీ వాలంటీర్లు జాతర ప్రాంతంలో భక్తులకు సేవలు అందించుటకు అందుబాటులో ఉంటారని, 6.2 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన క్యూలైన్లు భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి 150 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 20 బీఎస్ఎన్ఎల్ టవర్స్, 7 ఐడియా, 4 ఏయిర్‌టెల్ టవర్స్ సెల్‌ఫోన్ సర్వీసులు అందించటం జరు గుతుందన్నారు. 25 లక్షల మం చినీటి బాటిల్స్ జాతర సందర్భంగా భక్తులకు అందజేయుటకు సిద్ధంగా వుంచడం జరిగిం దన్నారు. గిరిజన మ్యూజియం కాటేజ్ గుడారాలు భక్తులకు అందు బాటులో ఉంచటం జరిగిం దన్నారు. జాతరలో గట్టి బందో బస్తుతో పాటు 300 సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్, కమాండ్ కంట్రోల్ రూమ్, ఐటీడీఏ క్యాంపు ఆఫీసులో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని కలెక్టర్ కర్ణన్ పేర్కొన్నారు.



సెక్టార్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



మేడారం, ప్రభన్యూస్: మేడారం సమ్మక్క - సారలమ్మల జాతరను పురస్కరించుకొని పారిశుద్ధ్య పనులను వ్యక్తిగతంగా పరిశీలించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కర్నన్ సమావేశం ఏర్పాటుచేశారు. జాతర పనులలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 38 సెక్టార్లను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఎలాంటి సమస్యలు తలెత్తిన వాకిటాకిల ద్వారా సమాచారం తెలుసుకొని సంబంధిత ప్రదేశాలకు సమాచారం అందించి వెంటనే అప్రమత్తమై సమాచారం అందించాలని ఆదేశించారు.

2న ఉపరాష్ట్రపతి రాక

కేసీఆర్ వెంట కేంద్ర గిరిజన శాఖ మంత్రి

భూపాలపల్లి, ప్రభన్యూస్: మేడారం సమ్మక్క -సారలమ్మ జాతరను ఫిబ్రవరి 2న భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ , కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జూయల్ ఓరం రానున్నారు. ఉపరాష్ట్రపతి మేడారం మహా జాతరకు వస్తుండడంతో జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో హెలీప్యాడ్‌లను తాత్కాలికంగా నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నారు. నేటి రాత్రి వరకు హెలీప్యాడ్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మేడారం మహా జాతరకు చత్తీష్‌ఘడ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులతో పాటు పలువురు మంత్రులు హాజరుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా కేంద్రం నుంచి పలువురు గిరిజన మంత్రులు , రాజ్యసభ్యులు వచ్చి తల్లులను దర్శించుకోనున్నట్లు సమాచారం. కలెక్టర్ వెంట జేసీ అమయ్ కుమార్ , జిల్లా ఎస్పీ భాస్కరన్, ఉన్నారు.

సాగు మంటలతో కాలుష్యం పడిపోతున్న ఆదాయం

న్యూఢిల్లీ : వ్యవసాయ వ్యర్థాలను తగులపెట్టే విషయంలో సదరు రైతులకు భారీ జరిమానా విధించినట్టు ఆర్థిక సర్వేలో వెల్లడైంది. దీంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాతావరణ కాలుష్యంగా బాగా పెరిగినట్టు తెలుస్తున్నది. దీనికి రైతులు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరుతున్నారు. ప్రధానంగా వాయు కాలుష్యానికి వాహనాల రద్దీ కూడా కారణం. వాటి నుండే వచ్చే పొగతో వాతావరణం వేడెక్కడంతో పాటు నగర వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సులతో పాటు పాత వాహనాల సంఖ్య రోడ్లపై రోజురోజుకూ పెరుగుతుండటంతో వాతావరణ కాలుష్య సమస్య ముఖ్యంగా శీతాకాలంలో అధికంగా ఉందని సర్వేలో వెల్లడైంది. నార్త్ ఇండియన్ రైతులు అధికంగా వరిని సాగు చేస్తుంటారు. హార్వెస్టర్ల ద్వారా పంటలు కోయగా మిగిలిన గడ్డికి రైతులు నిప్పు అంటిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా పొగమయంగా మారుతోందని సర్వేలో వెల్లడైంది. ఫలితంగా ఊపిరితిత్తులతో సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయి. అదేవిధంగా ఈ పొగ వాతావరణంలోని గాలులపై ప్రభావం చూపి ఢిల్లీని కాలుష్యభరితంగా మారుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న నగరాల్లో ఢిల్లీ కూడా చేరింది. కేవలం పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల రైతులు 35 మిలియన్ టన్నుల వరి వ్యర్థాలు అక్టోబర్‌లో కాల్చారు. అదేవిధంగా దీపావళి రోజు టపాసులు కాల్చడంతో కూడా ఢిల్లీ వాతావరణం కాలుష్యమైంది. లారీలు, బస్సులు, కార్లు, మూడు చక్రాల వాహనాలు, మోటార్ సైకిళ్ల ద్వారా 23 నుండి 28 శాతం వాతావరణం కాలుష్యం అవుతున్నది. డీజిల్‌తో నడిచే వాహనాలతో వాతావరణానికి తీవ్ర ఆటకం ఉంది.

ప్రతికూల పరిస్థితులతో తగ్గుతున్న ఆదాయం

పంట సాగు సమయంలో వాతావరణం మార్పుతో ఆదాయం 20 నుండి 25 శాతం తగ్గుతుంది. సాంకేతిక రంగం, నీటి వసతులు, విద్యుత్, ఎరువులపై సబ్సిడీతో మరింత అభివృద్ధి సాధించే వీలుంటుంది. వ్యవసాయ సంక్షోభం నుండి కాపాడుకోవడానికి... రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. అందుకే వ్యవసాయాన్ని ఓ పాఠ్యాంశంగా బోధించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చేందుకు జీఎస్టీ విధానాన్ని సర్వే సమర్థించింది. నీటి వనరులు ఉన్న ప్రాంతంలో అయితే వాతావరణ మార్పులు 15-18 శాతం ఆదాయాన్ని తగ్గిస్తుంది. అదే నీటి సౌకర్యం లేని ప్రాంతంలో అయితే ఆదాయం 20 నుండి 25శాతానికి తగ్గిపోతుంది.

జమిలి ఎన్నికలపై చర్చించండి



- ఏకాభిప్రాయానికి రండి
- తలాఖ్ చట్టం వస్తుందని ఆశిస్తున్నాం
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏక కాలంలో ఎన్నికల నిర్వహణపై ఒక విస్తృతమైన చర్చకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. ఆ అంశంపై అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి చేరుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తరచుగా ఎన్నికల వలన మానవ వనరులపై పెను భారం పడటమే కాకుండా ఎన్నికల ప్రవర్తనా నియమావళి విధింపుతో అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం కలుగుతున్నదని తెలిపారు. ట్రిపుల్ తలాఖ్ బిల్లుపై మాట్లాడుతూ పార్లమెంట్ త్వరలోనే దానిని ఆమోదించి చట్టం చేస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. దశాబ్దాలుగా ముస్లిము మహిళ గౌరవం రాజకీయ లబ్ధికి బందీగా మారిపోయిందని అన్నారు. వారిని ఈ పరిస్థితి నుంచి విముక్తి కల్పించడానికి ప్రస్తుతం జాతికి ఒక అవకాశం వచ్చిందని రాష్ట్రపతి తెలిపారు. అది ముస్లిము సోదరులు, బిడ్డలు ఆత్మగౌరవం, తెగువతో కూడిన జీవితాన్ని గడిపేలా చేస్తుందని అన్నారు.

రైతుల ఇబ్బందులు తొలగించేందుకే తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. వారి సమస్యలు పరిష్కరించి, జీవన ప్రమాణాలను పెంచడమే ధ్యేయమని చెప్పారు. సోమవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలి ప్రసంగం చేశారు. సామాజిక న్యాయం, ఆర్థిక ప్రజాస్వామ్యానికి తన ప్రసంగంలో ఆయన పెద్దపీట వేశారు. వ్యవసాయరంగం అభివృద్ధి, మహిళల ఆత్మగౌరవం పెరిగేలా మరుగుదొడ్ల నిర్మాణం, వంటగ్యాస్ కనెక్షన్లు, మెటర్నిటీ ప్రయోజనాలు, తదితర అంశాలను తన ప్రసంగంలో ముఖ్యంగా ప్రస్తావించారు. వ్యవసాయరంగంలో రైతులు పడుతున్న కష్టాలు తొలగించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వ్యవసాయరంగంలో ఖర్చును తగ్గించి, వారి ఇబ్బందులను తొలగిస్తున్నామని చెప్పారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్న లక్ష్యానికి తాము కట్టుబడిఉన్నామని తెలిపారు.

ద్రవ్యోల్బణాన్ని, ద్రవ్యలోటును అరికట్టడంలో తమ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తోందన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెరిగాయని, 410 బిలియన్ డాలర్లకు చేరడం ప్రభుత్వం సాధించిన విజయమని గుర్తు చేశారు.

2016-17 తొలి త్రైమాసికంలో ఆర్థిక రంగం నెమ్మదించడం వల్ల జీడీపీ వృద్ధి రేటు మందగించిదని తెలిపారు. అయితే 2017-18 రెండో త్రైమాసికంలో ఈ ధోరణిలో మార్పు వచ్చిందని చెప్పారు. గడిచిన మూడున్నరేళ్లలో ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు, కరెంటు ఖాతాలోటు చాలా కనిష్ఠంగా ఉందని గుర్తుచేశారు.

ప్రభుత్వ అద్భుతమైన విధానాల కారణంగా విదేశీ పెట్టుబడులు 36 బిలియన్ డాలర్ల నుంచి 60 బిలియన్ డాలర్లకు పెరిగిందని తెలిపారు. ఆధార్ అనుసంధానం వల్ల మధ్యదళారుల ప్రమేయం తగ్గిపోయి, ప్రయోజనాలు నేరుగా పేదలకే అందుతున్నాయని చెప్పారు.

దేశ వ్యాప్తంగా 2.70 లక్షల కామన్‌సర్వీస్ సెంటర్ల ద్వారా అతి తక్కువ ఖర్చుతో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం డిజిటల్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఉమంగ్ యాప్ ద్వారా 100 రకాల పబ్లిక్ సర్వీసులన్నీ మొబైల్ ఫోన్ లోకి అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఉపాధి కల్పనలో భాగంగా ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద పదికోట్ల మందికి రుణాలు మంజూరుయ్యాయని ఇందులో నాలుగుకోట్ల మందికి రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. దీని ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు చేయూతనిచ్చామన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో తమ ప్రభుత్వం 93 లక్షల ఇళ్లను పేదలకు నిర్మించిందని అన్నారు.

రాష్ట్రపతి తన ప్రసంగంలో వ్యవసాయరంగం, రైతుల సమస్యలక ు పెద్ద పీట వేయడంతో ఆ దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి వ్యతిరేక ఫలితాలు రావడంతో దానిని అధిగమించేందుకు ఈ బడ్జెట్‌లో చర్యలు ప్రతిపాదిస్తారని ఆశిస్తున్నారు.

జమిలిపై ఏమంటారు?



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరపాలన్న తన ఆలోచనను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి బయటపెట్టారు. ఈసారి తమ కూటమి మిత్రులతోనే ఈ విషయంపై చర్చించారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు, ఉభయ సభలు వాయిదా పడ్డ తర్వాత తొలుత బీజేపీ పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమవగా, దానికి కొనసాగింపుగా ఎన్డీయే మిత్రపక్షాలతో ప్రధాని సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించడంతో పాటు మిత్రపక్షాల అభిప్రాయాన్ని కూడా కోరారు.

కీలక సమయంలో సొంత పార్టీ ఎంపీలెవరూ సభ నుంచి మాయమవుతున్న తీరుపై పార్టీ కొంతకాలంగా ఆగ్రహంగా ఉంది. పార్టీ ఆదేశాల మేరకు హాజరు శాతం కొంత పెరిగినా, పరిస్థితిలో పూర్తిగా మార్పు రాలేదని తెలుస్తోంది. అందుకే ప్రధాని మోడీతో పాటు, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ఎంపీల హాజరుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో దావోస్‌లో ప్రధాని ప్రసంగం, రిపబ్లిక్ డే వేడుకలకు ఏసియాన్ దేశాల ప్రతినిధులను రప్పించడం వంటి అంశాలపై బీజేపీ పార్లమెంటరీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అభినందిస్తూ తీర్మానం ఆమోదించినట్టు సమాచారం.

అనంతరం జరిగిన ఎన్డీయే మిత్రపక్షాల సమావేశంలో భాగస్వామ్య పార్టీల ఫ్లోర్ లీడర్లు కూడా ప్రధాని మోడీని అభినందనలతో ముంచెత్తినట్టు తెలుస్తోంది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోనే జరిగిన ఎన్డీయే.

చంద్రబాబును అడిగి చెబుతాం: సుజనా చౌదరి

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి తెలుగుదేశం పార్టీ తరపున కేంద్ర సహాయ మంత్రి, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత వై.ఎస్. చౌదరి (సుజనా చౌదరి), ఆ పార్టీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ తోట నరసింహం హాజరయ్యారు. సమావేశంలో ఒకేసారి దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించే అంశాన్ని ప్రస్తావిస్తూ తమ అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా మిత్రపక్షాలను ప్రధాని కోరగా, తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతో చర్చించి చెబుతామని తెలుగుదేశం నేతలు తెలిపారు. సమావేశం అనంతరం వైఎస్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ, విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న అంశాల గురించి ప్రధానంగా చర్చించానని అన్నారు.

మిత్రపక్షాలతో మోడీ భేటీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాలక ు విజ్ఞప్తి చేశారు. సోమవారం పార్లమెంటు లైబ్రరీ బిల్డింగ్‌లో ఎన్‌డిఏ భాగస్వామ్యపక్ష నేతలతో ఆయన సమావేశమయ్యారు. జమిలి ఎన్నికలపై తమ తమ నియోజకవర్గాల్లో నాయకులు చర్చించాలని, ఆ మేరకు ప్రజల్లో సానుకూల వాతావరణాన్ని తీసుకువచ్చేలా ప్రయత్నించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకావడం వల్ల తరుచూ అభివృద్ధి పనులకు బ్రేక్‌పడుతోందన్నారు. అలాగే భారీ ఎత్తున ప్రజాధనం, మానవ వనరులు, సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందని చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగంలోనూ ఈ అంశంపై ప్రస్తావిస్తూ, దీనిపై ఏకాభిప్రాయసాధనకు అవసరమైన రాజకీయ చర్చ జరగాలని విజ్ఞప్తి చేశారు. అదే దిశలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సైతం జమిలి ఎన్నికలపై ఎన్‌డిఏ భాగస్వామ్యపక్షాలపై చర్చించారు. ఈ అంశంపై తమ పార్టీల అభిప్రాయాలను కూడా చెప్పాలని కోరారు. తమ పార్టీ అధినేతతో ఈ అంశాలను చర్చిస్తామని పలువురు భాగస్వామ్యపక్షాల నేతలు మోడీకి వివరించినట్లు తెలిసింది. అలాగే పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని ప్రధాని కోరారు. ట్రిపుల్ తలాక్ బిల్లును ఈ సెషన్‌లో పాసయ్యేలా చూడాలని కోరినట్లు సమాచారం.దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సమ్మేళనంలో ప్రధానమంత్రి మోడీ అదుఞ త ప్రసంగం, రిపబ్లిక్ వేడుకలకు పది ఆసియాన్ దేశాధినేతలు హాజరుకావడంపై మోదీ క షిని అభినందిస్తూ ఓ ఎన్‌డిఏ తీర్మానం పాస్ చేసింది.

అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, పదాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ఎంపీలు లేచి నిలబడి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి స్వాగతం పలికారు. దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సమ్మేళనంలో ప్రధానమంత్రి మోడీ అద్భుత ప్రసంగం, పది ఆసియాన్ దేశాధినేతలను రిపబ్లిక్ వేడుకలు ఆహ్వానించడం తదితర అంశాలకు గాను ఎంపీలు ప్రధానమంత్రిని అభినందించారు. అయితే దీంట్లో మహిళా మంత్రులు సుష్మాస్వరాజ్, నిర్మలాసీతారామన్ భాగస్వామ్యం కూడా ఉందని ప్రధానమంత్రి ఈ సమావేశంలో వ్యాఖ్యానించారు. కీలకమైన బడ్జెట్ సమావేశాలకు ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని ప్రధానమంత్రి మోడీ మరోసారి నొక్కి చెప్పారు. ఓబిసి బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లులను ఈ సమావేశాల్లో పాస్ చేయించాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ దిశలో ఎంపీలంతా క్రియాశీలంగా వ్యవహరించి పార్లమెంటుకు హాజరుకావాలని వారికి దిశానిర్దేశం చేశారు. సభకు హాజరుకానీ ఎంపీల తీరుపైనా అసంత ప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు ఎంపీలు హాజరుకావాలని కోరారని సమాచారం.

ఎనిమిది రాష్ట్రాల్లో పారిశుధ్యం భేష్

న్యూఢిల్లీ :బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాల నిషేధాన్ని (ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ) అమలు జరపడంలో ఎనిమిది రాష్ట్రా లు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు నూరు శాతం విజయాన్ని సాధించాయని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలను తీర్చుకునే వారి సంఖ్య 2014లో 55కోట్లు ఉండగా, వారి సంఖ్య 25కోట్లకు తగ్గిందని ఆర్థిక సర్వే పేర్కొంది.దేశ వ్యాప్తంగా 296 జిల్లాలలోని 3,07,349 గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతంగా అమలు జరుగుతోంది. హిమాచల్ ప్రదేశ్, సిక్కిం,కేరళ, హర్యానా, ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్, అరుణా చల్ ప్రదేశ్, గుజరాత్, డయ్యు,డామన్, చండీగఢ్‌లలో ఈ కార్యక్రమం సంతృప్తికరంగా అమలు జరుగుతోందని ఆర్థిక సర్వే వివరించింది.సరైన పారిశుధ్య సౌకర్యాలు లేకపోవడం వల్ల భారత్‌లో ఏటా లక్ష మంది పిల్లలు మృత్యువాత పడుతు న్నారని యునిసెఫ్ నివేదిక పేర్కొంది.



పర్యాటక రాబడి 27.7 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: పర్యాటక రంగం ద్వారా విదేశీ మారక ద్రవ్యంలో పెరుగుదల 2017లో 20.8 శాతం పెరిగి 27.7 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్థిక సర్వే వెల్లడించింది. పర్యాటక రంగం అభివృ ద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను సర్వే ప్రశంసించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వెలువరించిన తత్కాలిక డేటా ప్రకారం 2017నాటికి భారత్‌ను సందర్శించిన విదేశీ పర్యాటకుల సంఖ్య 10.2 మిలియన్లు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో వృద్ధి 15.6 శాతం ఉందని తెలిపింది. 2017లో ఈ రంగం ద్వారా 27.7 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందని.. 2016తో పోలిస్తే ఆదాయంలో పెరుగుదల 20.8 శాతమని సర్వే పేర్కొంది. ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్, వ్యాపార, పర్యాటక పథకాలు 163 దేశాల ప్రజలను భారత్‌వైపు ఆకర్షించాయని తెలిపింది. ది హెరిటేజ్ ట్రయల్, పర్యటన్ పర్వ్‌లు ఇందుకు బాగా తోడ్పడ్డాయిని సర్వే పేర్కొంది. భారతీయులు విదేశాల్లో పర్యటించడం కూడా పెరిగిందని సర్వే ఈ సందర్భంగా తన నివేదికలో వెల్లడించింది. 2016లో ఈ సంఖ్యలో వృద్ధి 6.3 శాతం పెరిగి 21.9 మిలియన్‌లకు చేరుకుందని తెలిపింది. 2015లో ఈ సంఖ్య 20.4 మిలియన్లుగా నమోదయిందని తెలిపింది.

పౌర విమానయాన వృద్ధిపై సర్వే సంతృప్తి



న్యూఢిల్లీ: పౌర విమానయాన రంగంలో చెప్పుకోదగ్గ పురోగతి నమోదైందని సర్వే తెలిపింది. ఈ వృద్ధితో భారత్ పౌర విమానయాన రంగం టికెట్ల అమ్మకాల దృష్ట్యా ప్రపంచదేశాలతో పోలిస్తే మూడో స్థానంలో ఉందని తెలిపింది. దేశంలో పూర్తి స్థాయిలో సేవలను ప్రారంభించని విమానాశ్రయాలను అనుసంధానించే ఉడాన్ ఇందుకు తోడ్పడిందని సర్వే పేర్కొంది. 2016-17లో దేశీయ ప్రయాణికుల్లో వృద్ధి 23.5శాతం నమోదైందని.. అమెరికాలో ఇది 3.3 శాతంకాగా, చైనాలో ఈ వృద్ధి 10.7శాతంగా ఉందని తెలిపింది. 2007-08 నుంచి 2016-17 కాలంలో దేశీయ ప్రయాణికుల్లో ఏటా చక్రీయ వృద్ధి 9.89 శాతంగా ఉందని సర్వే వెల్లడించింది. అదేవిధంగా రైల్వే, రోడ్లు, మెట్రో రైల్, షిప్పింగ్, పౌరవిమానయానం, విద్యుత్, లాజిస్టిక్స్, తదితర మౌలికసదుపాయ రంగాల్లో కూడా మంచి వృద్ధి నమోదైందని తెలిపింది. స్వల్పకాలంలో మౌలికరంగం మరింత ముందుకెళుతుందని అంచనా వేసింది. పలు రాష్ట్రాల్లో సేవలందించని ఎయిర్‌పోర్టులు, అండర్ సర్వ్‌డ్ ఎయిర్‌పోర్టులు/ఎయిర్ స్ట్రిప్‌లు సంస్కరించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.4,500 కోట్ల నిధుల మద్దతు 2018 డిసెంబర్ నాటికి పూర్తయిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది సెప్టెంబర్ వరకు దేశీయ ఎయిర్ లైన్స్ 57.5 మిలియన్ల ప్రయాణికులను చేరవేశాయని.. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే వృద్ధి 16శాతం అధికంగా ఉందని తెలిపింది. ఇదేకాలంలో భారత్‌నుంచి బయటకు, విదేశాలనుంచి భారత్‌కు.. దేశీయ, విదేశీ విమానయాన సంస్థలు 29.2 మిలియన్ల ప్రయాణికులను చేరవేశాయని తెలిపింది. ఈ ప్రయాణికుల్లో వృద్ధి గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 9 శాతం అధికమని సర్వే వెల్లడించింది. కార్గో విషయానికి వస్తే దేశీయ ఎయిర్ కార్గో ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 0.61 మిలియన్ ఎంటీ కాగా గతేడాది ఇదేకాలంతో పోలిస్తే వృద్ధి 10.27శాతం. అంతర్జాతీయ ఎయిర్ కార్గో రవాణాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 1.07 మిలియన్ ఎంటీ కాగా ఇది గతేడాది ఇదేకాలంతో పోలిస్తే 19.02 శాతం వృద్ధి అని సర్వే పేర్కొంది.

సిరియాలో వైమానికి దాడి

- 33 మంది పౌరులు మృతి

బైరట్: సిరియాలో ప్రభుత్వ దళాలు జిహాదీలకు మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జరుగుతున్న దాడుల్లో గత 24 గంటల్లో 33 మంది పౌరులు మృతి చెందారు. వీరంతా వైమానిక దాడుల కారణంగానే చనిపోయినట్లు బ్రిటన్ కేంద్రంగా నడుస్తున్న సిరియా మానవహక్కుల పరిశీలనా సంస్థ చీఫ్ రమీ అబ్దుల్ రహమాన్ తెలిపారు. సిరియాలోని ఉత్తర, దక్షిణ ప్రాంతానికి చెందిన ఇడ్లిబ్ ప్రాంతంలో ప్రభుత్వ దళాలు దాడులు చేస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన వైమానిక దాడుల్లో 16 మంది పౌరులు చనిపోయారు.

వీరిలో సరక్వెబ్ పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో 11 మంది మృతి చెందారు. ఆదివారం చనిపోయిన 17 మందిని కలిపితే గత 24 గంటల్లో చనిపోయిన పౌరుల సంఖ్య 33కు చేరింది. సిరియాక ు చెందిన ఆల్‌ఖైదా మాజీ నాయకుడు హయత్ తహ్రిర్ అల్-షమ్ సేనల స్వాధీనంలో ఉన్న ప్రాంతాల్లో ఆదివారం నాడు ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడులు జరిపింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వైమానిక దాడులకు విరామం ఇచ్చారు. 2015లో ఇడ్లిబ్ ప్రాంతాన్ని జిహాదీలు, తిరుగుబాటు దారులు ఆక్రమించారు. దీంతో గత నెల చివరి నుంచి రష్యా సహకారంతో సిరియా వారిపై పెద్ద ఎత్తున దాడులు మొదలు పెట్టింది.

ఎగుమతుల్లో కలిసివున్న పన్నులను సమీక్షించాలి



న్యూఢిల్లీ: కొత్త పరోక్ష పన్ను విధానం పరిధిలో ఉన్న ఉత్పత్తుల ఎగుమతులపై లేదా ఈ పన్ను పరిధిలో లేని పెట్రోలియం, విద్యుత్ ఉత్పత్తి విలువల్లో కలిసివున్న(ఎంబడెడ్ టాక్స్)పన్నులపై జీఎస్టీ మండలి సమీక్షించాలని ఆర్థిక సర్వే-(2017-18) ప్రభుత్వానికి సూచించింది. వీటిని ఆయా పన్ను పరిధుల్లోంచి తప్పిస్తే... తయారీ రంగ ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయని సోమవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే వెల్లడించింది. అయితే విధానంలో ఎదురయ్యే సమస్యలు ఎగుమతుల ప్రోత్సాహకాల ఫలితాల విశ్లేషణపై ఆధారపడుతుంది. రెడీమేడ్ దుస్తుల(ఆర్ఎంజీ) రంగాన్ని పరిశీలిస్తే.. జూన్ 2016లో అప్పారెల్ రంగానికి రూ.6వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించారు. మ్యాన్ మేడ్ ఫై బర్స్(ఎంఎంఎఫ్) ఎగుమతులు పెరిగాయి. ఈ ప్యాకేజీలో అతిపెద్ద వాటా రిబేట్స్ ఆన్ స్టేట్ లెవీస్‌దే(ఆర్ఓఎస్ఎల్). ఇందులో రాష్ట్రాలు విధించే పరోక్ష పన్నులు కలిసి ఉన్నాయి. ఈ ప్యాకేజీ ఈ రంగంలోని ఇతర ఉత్పత్తులైన పట్టు, కాటన్ ఉత్పత్తులకు ఉపకరించలేదు. ఇటీవల చైనా ప్రపంచ మార్కెట్లకు చేస్తున్న అపారల్ ఎగుమతులు పడిపోయినప్పటికీ భారత్ ఈ అవకాశాన్ని తనకనుకూలంగా మలచుకోలేకపోయిందని సర్వే తెలిపింది. దీనికి కారణం బంగ్లాదేశ్, వియాత్నాం, ఇథియోపియా ఈయూ, అమెరికా మార్కెట్లలో డ్యూటీ ఫ్రీ వెసులుబాటు లభిస్తున్నదని పేర్కొంది. అంతేకాక, దేశీయంగా మ్యాన్‌మేడ్ ఫ్యాబిక్స్‌పై అధిక పన్నులు, లాజిస్టిక్ వ్యయాలు, కఠిన చట్టాలు మనదేశ ఎగుమతులకు ప్రతికూలంగా ఉన్నాయని తెలిపింది. జీఎస్టీ పరిధిలో ఉన్న ఉత్పత్తులతోపాటు, జీఎస్టీ పరిధికి బయట ఉన్న ఉత్పత్తులు(పెట్రోలియం, విద్యుత్) ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు సమగ్ర సమీక్షను జీఎస్టీ మండలి చేపట్టాలని సర్వే సూచించింది. ఈ సమీక్ష ఎగుమతుల్లో కలిసిఉన్న ఇతర పన్నులను తొలగించడానికి ఉపకరిస్తుందని వెల్లడించింది. తద్వారా భారత ఎగుమతులకు మరింత ఊతం దొరుకుతుందని తెలిపింది. మొత్తంగా చూస్తే ఎంఎంఎఫ్-ఆర్ఎంజీ ఉత్పత్తులు ఈ రంగంలోని ఇతర గ్రూపులతో పోలిస్తే సెప్టెంబర్ 2017 నుంచి 16 శాతం పెరిగాయని సర్వే వెల్లడించింది.

దళితుల అభివృద్ధిలో తెలంగాణ టాప్

- ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ విశ్లేషణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 20 లక్షల మంది దళితులు వివిధ పథకాల కింద ప్రయోజనం పొందారు. దళితుల ప్రయోజనాలకోసం దాదాపు రూ. 6 వేల కోట్లకుపైగా ప్రత్యేక నిధులను ఖర్చు చేశారు. దళితుల అభ్యున్నతిలో దేశంలోనే అనేక రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. పలు రాష్ట్రాలు ఇప్పటికే తెలంగాణలో అమలవుతున్న పథకాలను అధ్యయనం చేశాయి. మరిన్ని రాష్ట్రాలు అధ్యయనం చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. భూమి లేని నిరుపేదలకు మూడెకరాల భూమి ఇవ్వడం, ఇచ్చిన భూమిని సాగుకు అనువుగా తీర్చిదిద్దడంతో పేద దళితుల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు ఆచరణీయం అని ఇప్పటికే అధ్యయనం చేసిన రాష్ట్రాలు హర్షం వ్యక్తం చేశాయి. ఎస్సీ విద్యార్థులకు రెసిడెన్సియల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయడం. వసతి గృహాల్లో సన్నబియ్యంతో పౌష్టికాహారం అందించడం, విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం లాంటి కార్యక్రమాలు కూడా అనేక రాష్ట్రాలను ఆకట్టుకుంటున్నాయి. స్వయం ఉపాధి రంగంలో ఇప్పటికే 77,053 మందికి రూ.774.38 కోట్ల రుణాలు అందచేయడం, నైపుణ్య శిక్షణ కోసం 1764 మందిని ఎంపిక చేసి రూ. 10.73 కోట్లు ఖర్చు చేయడం, కల్యాణ లక్ష్మి పథకం కింద 77,976 మందికి రూ. 261.86 కోట్లు అందచేయడం లాంటి కార్యక్రమాలు దళితులకు నేరుగా తోడ్పాటును అందిస్తున్నాయని ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ అధికారులు పేర్కొన్నారు. దళిత వాడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు 48 శాఖల పరిధిలో దళితుల అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుంది. 2017 - 18 ఆర్థిక సంవత్సరంలో దళితు సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 14,375 కోట్లలో సగానికి పైగా ఖర్చు చేశారు. దళితులను ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా బలోపేతం చయాలనే సంకల్పంతో నిర్దిష్ట కార్యాచరణ అమలవుతుంది. దళితుల పి ల్లల చదువులపైన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. పిల్లలు ఒకటవ తరగతిలో చేరింది మొదలు ఇష్టమైన మేరకు ఉన్నత చదువులు అభ్యసించి, మెరుగైన ఉద్యోగం పొందేంత వరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. విద్యావంతులైన యువతీ యువకులు స్వయం ఉపాధిలో స్థిరపడేందుకు అవసరమైన వృత్తినైప ుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటుగా ఉత్పాదక రంగంలో స్థిరపడేందుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. దళితులకు కల్యాణ లక్ష్మి పథకాన్ని వర్తింపచేసి పెళ్లి సందర్భంగా రూ. 75 వేల నగదు సహాయం అందిస్తుంది. విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేస్తుంది. బ్యాక్ లాక్ పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని దళితుల స్థితిగతులను అధ్యయనం చేసి కుటుంబాల వారిగా అవసరమైన తోడ్పాటు అందిస్తుంది. వ్యవసాయ రంగంలో స్థిరపడిని దళిత కుటుంబాలకు మూడు ఎకరాల వరకు భూమి ివ్వడంతో పాటు వ్యవసాయ పనిముట్లను వంద శాతం సబ్సిడీతో అందచేస్తుంది. వ్యవసాయానికి అవసరమైన సాగునీరు. విద్యుత్ విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. మౌలిక సదుపాయాలు కల్పించడంలో దళిత వాడకు ప్రాధాన్యత ఇస్తుంది. మిషన్ భగీరథలో క ూడా దళిత వాడలకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. దళితులు ఆర్థికంగా ఎదగాలని, సామాజికంగా ప్రగతి దాయకమైన జీవనం గడపాలనే ఆశయంతో అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దళితుల కోసం కేటాయించిన నిధులను సక్రమంగా, సకాలంలో వ్యయం చేయడానికి వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

సబ్సిడీలపై మళ్లీ దృష్టి సారించాలి



న్యూఢిల్లీ: పునరుత్పాదన వనరుల ద్వారా చేస్తున్న ఉత్పత్తులకు ఇస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వం పునపరిశీలన చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. ఈ రంగంలో ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌పై విధించే టారిఫ్ గ్రిడ్ వ్యయానికి సమానమవుతోందని పేర్కొంది. ఇప్పటికే పీపీఏ ఒప్పందాలు కుదుర్చుకున్న కొన్ని డిస్కంలు టారిఫ్‌పై తిరిగి భేరసారాలు సాగించాలని కోరుతున్నాయని సర్వే వెల్లడించింది. పునరుత్పాదక వనరుల డెవలపర్స్‌కు ఎదురవుతున్న సమస్యలను తొలగించడానికి పేమెంట్ గ్యారంటీ ఫండ్ లేదా ఫారెన్ ఎక్సేంజీ ఫండ్‌ను ఏర్పాటుచేసి తగిన ఆర్థిక సహాయం చేయాలని పేర్కొంది.


అంతేకాక ఇప్పటికే ఈ రంగానికిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై ప్రభుత్వం మరోసారి తన దృష్టిసారించాలని పేర్కొంది. గత ఏడాది స్వేచ్ఛ టారిఫ్‌ల అమలువల్ల పునరుత్పాదక వనరుల ద్వారా చేసిన విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంట్లనుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ కంటే చౌకగా మారడంతో... థర్మల్ ప్లాంట్లపై ప్రతికూల ప్రభావం ఏర్పడిందని నిపుణులు పేర్కొన్నారు. థర్మల్ ప్లాంట్లు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేని స్థితిలోకి నెట్టివేయబడ్డాయన్నారు.

ప్రభుత్వం 2022 వరకు దేశీయ గ్రిడ్‌కు 175గిగా వాట్ల సాంప్రదేయాతర విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోవడంలో డెవలపర్స్‌తో పీపీఏలు కీలకమని సర్వే వ్యాఖ్యానించింది. భవిష్యత్తులో పీపీఏలు తక్కువ కాలానికి కుదుర్చు కుంటే.. అవి మూలధన వ్యయాల ను పెంచుతాయే తప్ప అనుకున్నంత లాభా లను తెచ్చిపెట్టవని పేర్కొంది. ఈ రంగానికి ఇప్పటివరకు ఇస్తున్న ప్రోత్సాహంను సర్వే ప్రశంసించింది. ఆర్థిక సహాయం అందించడంలో ఈరంగాన్ని ప్రియార్టీ సెక్టర్‌గా ప్రభుత్వం గుర్తించడాన్ని, గృహాలు, కంపెనీలు, రూఫ్ టాప్ సౌర విద్యుత్ వ్యవస్థలు నెలకొల్పుకునేందుకు ఇస్తున్న సబ్సిడీలు, హోం లోన్లు మంచి ఫలితాలనిస్తున్నాయని పేర్కొంది.

భారత్ ఆర్థికం భేష్



✦ వచ్చే ఏడాది 7.5 శాతం వృద్ధి రేటు ✦ ఈ ఏడాది 6.7 శాతం నమోదు ✦ సమసిపోయిన నోట్ల రద్దు, జీఎస్టీ ప్రతికూల ప్రభావం ✦ చమురు, షేర్ల ధరలతో సవాళ్ళు ✦ ప్రయివేటు పెట్టుబడులు, ఎగుమతులు వృద్ధికి చోదకాలు ✦ అందరికీ ఉపాధి, సాగుబడికి చేదోడు, చదువుకున్న కార్మిక శక్తి కావాలి ✦ ముంచుకొస్తున్న ఎన్నికలు ✦ వచ్చే ఏడాదికి ఆర్థిక, రాజకీయ నేపథ్యమే సవాల్



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్టీ), నోట్ల రద్దు ప్రభావాన్ని తోసిరాజనట్టుగా భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఊపందుకుంటోంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి 7 శాతం నుంచి 7.5 శాతానికి వృద్ధి రేటును నమోదు చేసుకుంటుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మరోసారి అవతరిస్తుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. అయితే చమురుధరల పెరుగుదల, ఎగువనున్న స్టాక్ ధరల్లో తీవ్రమైన దిద్దుబాటు నుంచి సవాళ్ళు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. దేశ ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబించే వార్షిక ఆర్థిక సర్వేను సర్వస్వతంత్రంగా వ్యవహరించే ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) రూపొందించారు. 2017-18 సంవత్సరానికి ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సోమవారం పార్లమెంట్‌కు సమర్పించారు. బీజేపీ ప్రభుత్వం తన ఐదవ, చివరి పూర్తి స్థాయి సాధారణ బడ్జెట్‌ను సమర్పించడానికి కేవలం రెండు రోజుల ముందు ఆర్థిక సర్వే విడుదలైంది. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆర్థిక స్థిరీకరణ కాస్త విరామం తీసుకుంటుందనే అంశాన్ని సర్వే తోసిపుచ్చలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటును 6.7 శాతంగా చూపింది. రానున్న సంవత్సరంలో ఎగుమతులకు తోడు ప్రయివేటు పెట్టుబడులు ఊపందుకుంటాయని తెలిపింది. సీఎస్ఓ అంచనా వేసిన 6.5 శాతం కన్నా వృద్ధిరేటు అధికంగా ఉంది. 2014-15 ఆర్థిక సంవత్సరానికి 7.5 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధి రేటు 2015-16 సంవత్సరానికి 8 శాతం, 2016-17 ఆర్థిక సంవత్సరానికి 7.1 శాతంగా నమోదైంది. 2016, నవంబర్‌లో నోట్ల రద్దు, 2017, జులై నుంచి దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిని దెబ్బ తీసింది. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు, 2019, మే మాసానికి వుందు సాధారణ ఎన్నికలకు దేశం సమాయత్తమవుతున్న తరుణంలో ఆర్థిక వ్యవస్థకు ఆర్థిక సర్వే శుభ వార్తలను అందించింది. మరీ ముఖ్యంగా నోట్ల రద్దు తదనంతర ప్రతికూల ప్రభావాలు సమసిపోతుండటం, భయాందోళనల మధ్య అమలైన జీఎస్టీ ఎట్టకేలకు స్థిరీకరణకు నోచుకోవడాన్ని సర్వే వేలెత్తి చూపింది. గత ఏడాది సాధించిన ఘనతలు, వచ్చే ఏడాది ఎదుర్కోవాల్సిన సవాళ్ల సమగ్రమైన ఆకృతిని సర్వే సమకూర్చిందని డెలాయిట్ ఇండియాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త అనిస్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం ఊర్ధ్వముఖంగా కనిపిస్తూ వచ్చే కొద్ది మాసాల్లో బలోపేతమై, ఎగుమతుల ద్వారా మద్దతు పొందే సంకేతాలను అది ప్రదర్శించిందని చెప్పారు. నోట్లరద్దు, జీఎస్టీల తాలూకు తాత్కాలిక ప్రభావం సద్దుమణగడంతో ఆర్థిక పరిస్థితి దూకుడుగా పుంజుకుంటున్నదని సీఈఏ అరవింద్ సుబ్రమణియన్ విలేకరులతో అన్నారు. ఎగుమతులు పెరిగిన పక్షంలో వృద్ధి రేటు 7.5 శాతం కన్నా ఎక్కువ ఉంటుందని ఆయన తెలిపారు. అదే సమయంలో చమురు ధరల పెరుగుదల, ఎగువన ఉన్న షేర్ ధరల్లో తీవ్రమైన దిద్దుబాటును పెను సవాళ్ళుగా సీఈఏ చూపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు దిగుమతి అయిన ముడి చమురు సగటు ధర దాదాపు 14 శాతం పెరిగింది. వచ్చే 2018-19 ఆర్థిక సంవత్సరానికి అది 10 నుంచి 15 శాతం మధ్య మరింత పెరిగే అవకాశం ఉందని సర్వే సూచించింది. 0.2 నుంచి 0.3 శాతం మధ్య జీడీపీపై ప్రభావం పడవచ్చు. ద్రవ్యోల్బణం 0.2 నుంచి 0.3 శాతం దాకా పెరగవచ్చు. ఒక బ్యారెల్‌కు చమురు ధరలు 10 డాలర్లకు మేర పెరిగిన పక్షంలో కరెంటు ఖాతా లోటు పెరిగే అవకాశం ఉందని సుబ్రమణియన్ తెలిపారు. స్థూల ఆర్థిక ఆందోళనలు ఉద్భవిస్తున్న నేపథ్యంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో విధానపరమైన నిఘా అనివార్యం. మరీ ముఖ్యంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిన పక్షంలో లేదా ఎగువనున్న షేర్ల ధరలు చురుకుగా దిద్దుబాటుకు నోచుకున్న పక్షంలో అది మూలధన ప్రవాహాలను అకస్మాత్తుగా నిలిపివేయవచ్చు అని సర్వే హెచ్చరించింది. అయితే 2018లో ప్రపంచ వృద్ధి ఒక మోస్తరు మెరుగుదల చవిచూసే అవకాశం, జీఎస్టీ గొప్పగా నిలకడ సాధిస్తుందన్న అంచనా, పెట్టుబడి స్థాయిలు కోలుకునే అవకాశం, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాత్మక సంస్కరణలు అత్యధిక వృద్ధికి అండగా నిలుస్తాయని ఆర్థిక సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. మొత్తం మీద 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక పనితీరు మెరుగుదలకు సాక్షిగా నిలుస్తుందని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీఎస్టీ స్థిరీకరణ, జంట బాలెన్స్ షీట్ చర్యలు, ఎయిర్ ఇండియా ప్రయివేటీకరణ, స్థూల ఆర్థిక స్థిరీకరణలను సర్వరోగ నివారణిగా ఆర్థిక సర్వే సూచించింది. మధ్యకాలిక వ్యవధిలో మూడు రంగాలపై విధానపరమైన దృష్టి కేంద్రీకరించాలని ఉద్బోధించింది. వాటిలో మొదటిదిగా ఉపాధికి సంబంధించి యువతకు, త్వరితగతిన వృద్ధి చెందుతున్న నిరుద్యోగులకు మరీ ముఖ్యంగా మహిళలకు మంచి ఉద్యోగాలు చూపించాలి. రెండవదిగా విద్యారంగానికి సంబంధించి విద్యావంతమైన ఆరోగ్యకరమైన కార్మిక శక్తిని సృష్టించాలి. మూడవదిగా వ్యవసాయ రంగానికి సంబంధించి సాగుబడిని బలోపేతం చేస్తూనే దిగుబడిని పెంచాలి. భారతదేశం ప్రయివేటు పెట్టుబడులు, ఎగుమతులు అనే నిజమైన భారాన్ని మోసే రెండు చోదకాల సామర్థ్యంపై మాత్రమే త్వరితగతిన ఆర్థిక వృద్ధికి అవసరమైన వాతావరణం మెరుగుపర చడాన్ని కొనసాగించాలి. సమగ్రమైన ఆర్థిక, రాజకీయ నేపథ్యం కారణంగా వచ్చే ఏడాది ఆర్థిక నిర్వహణ సవాళ్లను ఎదుర్కొంటుందని హెచ్చరించింది. ఏడాదిలో ఎన్నికలు వస్తాయనగా ఆశావహమైన భవిష్యవాణులు ప్రాతిపదికగా స్థిరీకరణ కోసం ఏర్పరుచుకుంటున్న ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాలు సాకారం కాకుండా పోయే ముప్పును తీసుకువస్తాయి.

భారతీయ మహిళలు సాగుబడిలో ప్రథమం.. రాజకీయంలో అధమం..

✦ ఆర్థిక సర్వేక్షణం

న్యూఢిల్లీ : రాజకీయ రంగంలో మహిళలు తక్కువ సంఖ్యలో ఉన్నారని, ఈ సంఖ్య పెరగాలని సర్వే వివరించింది. దేశ జనాభాలో 49 శాతం ఉన్న మహిళలకు రాజకీయంగా ఎదుగుదల లేదని తేలింది. మహిళలకు బాధ్యతలు ఇవ్వకపోవడం, కొన్ని సంస్కృతీ సంప్రదాయాలు, కుటుంబ సభ్యుల మద్దతు లేకపోవడమే మహిళలు రాజకీయాల్లో ప్రవేశించకపోవడానికి ప్రధాన కారణమని 2017-18లో జరిపిన సర్వేలో వెల్లడైంది. దేశంలో ఉన్న మహిళ జనాభాను బట్టి చూస్తే రాజకీయ రంగంలో వీరి సంఖ్య చాలా తక్కువగా ఉంది. రువాండ దేశంలో 2017లో పార్లమెంట్‌లో 60 శాతం మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈజిప్ట్, ఇండియా, బ్రెజిల్, మలేషియా, జపాన్, శ్రీలంక, థాయిలాండ్‌లో చూస్తే 15శాతం కంటే తక్కువ మంది పార్లమెంట్‌లో నిల్చుంటున్నారు. ఇంటర్ పార్లమెంటరా యూనియన్, యూఎన్ ఉమెన్ రిపోర్టు ప్రకారం... 2017లో లోక్‌సభలో 542 మంది ఎంపీల్లో 64 మంది (11.8 శాతం) మాత్రమే ఉన్నారు. రాజ్యసభలో 245 మంది ఎంపీల్లో కేవలం 27 మంది మాత్రమే (11 శాతం) ఉన్నారు. అక్టోబర్, 2016లో దేశ వ్యాప్తంగా ఉన్న 4,118 మంది ఎమ్మెల్యేల్లో కేవలం 9శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. 2010 నుండి 2017 మధ్య లోక్‌సభలో మహిళల సంఖ్య 1 శాతం మాత్రమే పెరిగింది. డిసెంబర్ 2017 నాటికి పంచాయతీరాజ్ వ్యవస్థలో 44.2 శాతం మంది మహిళలు ఉన్నారు.

మహిళా వ్యవ'సాయం'

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం చేసే వారిలో స్త్రీల సంఖ్య అధికంగా ఉంది. దేశ వ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మహిళల పాత్ర కీలకంగా ఉంది. ఈ సంఖ్య రూరల్ ఏరియాల్లో పెరుగుతూ ఉంది. సాగు రంగంలో మహిళలు పారిశ్రామిక వేత్తలుగా, రైతులుగా, కూలీలుగా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది అనుకుంటే అది కేవలం మహిళలు వ్యవసాయం చేయడమే. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయంలో మహిళలకు అరుదైన స్థానం ఉంది. ఆహార భద్రతకు, సాగును కొనసాగించడంలో స్త్రీలు ఒక మైలురాయిగా నిలిచారు. రోజువారీ గృహ అవసరాలు తీర్చడంతో పాటు సాగుపై దృష్టిసారిస్తున్నారు. మహిళలకు భూమి, సాగునీరు, ధన సాయం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ అందిస్తే మరింత అభివృద్ధి చెందే ఆస్కారం ఉంది. ఇప్పటికే మహిళా రైతులను ప్రోత్సహించడానికి పలు పథకాలు ప్రవేశపెట్టింది. ఇందుకు మహిళా రైతుల కోసం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించనుంది.

లింగ వివక్షకు చెల్లు



న్యూఢిల్లీ: దేశంలో కొనసాగుతున్న లింగ బేధం తొలిగింపునకు ఆర్థిక సర్వే సరికొత్త పంథాను ఎంచుకుంది. లింగసమానత్వాన్ని పెంపొందించి అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి సూచికగా గులాబీ రంగును ఎంచుకుంది. భారతీయులు పుత్రులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే అభిప్రాయాన్ని మార్చుకోవాలని సలహా ఇచ్చింది. లింగ నిష్పత్తి విషయంలోనూ గణనీయమైన తేడా ఉన్నట్లు గుర్తుచేసిన ఆర్థిక సర్వే... ప్రస్తుతం పురుషాధిత్యం 63 మిలియన్లుగా ఉన్నట్లు పేర్కొంది. దేశంలో మహిళలపై అకృత్యాలకు చరమగీతం పాడేందుకు సూచికగా గులాబీ రంగును ఎంచుకున్నట్లు తెలిపింది. ఉద్యోగాలు, ఇతర వ్యవహారాల్లో పురుషులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో దాని ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడిందని.. అందుకే అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని సర్వే స్పష్టం చేసింది. భారత్ ఈజ్ ఆఫ్ బిజినెస్ డూయింగ్ లో దూసుకుపోతున్నప్పటికీ లింగ భేదం కారణంగా .. పనిచేసే మహిళల శాతం గణనీయంగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తంచేసింది. 2005-06 లో 36 శాతంగా ఉన్న మహిళా ఉద్యోగుల సంఖ్య 2015-16 నాటికి 24 శాతానికి పడిపోయినట్లు పేర్కొంది. ప్రభుత్వం బాలికల కోసం చేపట్టిన బేటీ బచావో.. బేటీ పడావో.. సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు, తప్పనిసరి ప్రసూతి సెలవులు వంటి కార్యక్రమాలు మహిళలను పనిచేసేలా ప్రోత్సహిస్తున్నా యని తెలిపింది. మహిళలకు విద్యావకాశాలు మరింతగా పెంచి.. ఉపాధి అవకాశాలుకల్పించారని స్పష్టం చేసింది.

ఐసీటీ ఎగుమతుల్లో భారత్‌కు పోటీగా చైనా, రష్యా

న్యూఢిల్లీ: భారత సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) ఎగుమతులు గతంలో కంటే స్వల్పంగా తగ్గినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. 2006-2016 సంవత్సరాల మధ్య ఐసీటీ ఎగుమతుల్లో భారత్‌కు చైనా, బ్రెజిల్,రష్యా, పిలిప్పీన్స్ దేశాల నుంచి పోటీ పెరిగినట్లు పేర్కొంది. జనవరి 19,2018 నాటికి ప్రపంచ బ్యాంక్ అందించిన సమాచారం ప్రకారం భారత్ ఐసీటీ ఎగుమతుల వాటా 2016 లో 67 శాతంగా ఉండగా.. ఇదే వాటా 2006లో68గా ఉన్నట్లు పేర్కొంది. అంటే దశాబ్ద కాలంలో ఐసీటీ వాటా ఒక శాతం తగ్గింది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఎగుమతుల వాటా దశాబ్ద కాలంలో స్వల్పంగా తగ్గినట్లు గణాంకాల ద్వారా వెల్లడైంది. దీంతో ఐసీటీ ఎగుమతుల విషయంలో ప్రపంచ దేశాల నుంచి భారత్‌కు పోటీ పెరిగినట్లు అర్థమౌతోంది. 2006-2016 మధ్య కాలంలో చైనా ఐసీటీ ఎగుమతుల వాటా 22 శాతం నుంచి 40 శాతానికి పెరిగ్గా..ఇదే కాలంలో బ్రెజిల్ ఐసీటీ ఎగుమతుల వాటా 43 శాతం నుంచి55 శాతానికి పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆర్బీఐ సమాచారం ప్రకారం సాఫ్ట్ వేర్ ఎగుమతుల వృద్ధి నమోదు 2016-17 సంవత్సరంలో -0.7గా ఉన్నట్లు పేర్కొంది. అయినప్పటికీ 2017-18 ఆర్థిక సంవత్సరం మధ్యస్థం నాటికి సాఫ్ట్ వేర్ ఎగుమతులు గణనీయమైన పెరుగుదల కనిపించిందని.. ఈ సంవత్సరంలో ఎగుమతులు 2.3 శాతం పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీంతో సాఫ్ట్ వేర్ రంగంలో సానుకూల పవనాలు వీచినట్లైందని తెలిపింది. 90 శాతం భారత ఐటీ, ఐటీ సర్వీసులు అమెరికా, బ్రిటన్,యురోపియన్ యూనియన్ దేశాలకే ఎగుమతౌతున్నట్లు వెల్లడించింది. అయితే సంప్రదాయ బౌగోళికాంశాలు, ఆసియా పసిఫిక్, లాటిన్ అమెరికా, మధ్య తూర్పు ఆసియా దేశాలు కొత్త అవకాశాలకువేదికవుతుండటం.. వంటివి భారత ఐటీ ఎగుమతులకు కొన్ని సవాళ్లు విసురుతున్నట్లు ఆర్థిక సర్వే తెలిపింది. అయితే దేశ ఐటీ, బీపీఎం సెక్టర్ లో అవకాశాలు ఒక్కసారి వెలిగినట్లు కనిపించడంతో 2016-17 సంవత్సరంలో 3.9 మిలియన్లమందికి ఉపాధి అవకాశాలు పెరిగినట్లు పేర్కొంది. అంతకు ముందు సంవత్సరం (2015-16) కంటే ఉపాధి పెరుగుదల లక్షా 76వేలు ఎక్కువ. ఐటీ పరిశ్రమ 16వేల సంస్థలను కలిగి ఉండటం ద్వారా సేవలు కూడా పెరగడం.. 4750 స్టార్టప్‌లు కూడా వాటికి సహకారంగా మారాయని ఆర్థిక సర్వే వెల్లడించింది.

మ్యూచువల్ ఫండ్లలో గృహరంగందే ప్రధాన వాటా

న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లను ఆకర్షించడంలో మ్యూచువల్ ఫండ్లు ముందున్నాయని, ఇందులో అధిక వాటా గృహరంగం చేసే పొదుపులేనని ఆర్థిక సర్వే పేర్కొంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఈ తరహా పెట్టుబడులు 400 శాతం పెరిగాయని తెలిపింది. గృహరంగం చేసే పొదుపులు ప్రధానంగా బ్యాంకు డిపాజిట్లు, జీవితా బీమా రంగం, షేర్లు-డిబెంచర్లలో సాగుతున్నాయని వీటి పెరుగుదల వరుసగా 82 శాతం, 66 శాతం, 345 శాతంగా నమోదైందని పేర్కొంది. షేర్లు-డిబెంచర్లు విభాగంలో మ్యూచువల్ ఫండ్లలో చేసిన పొదుపుల్లో పెరుగుదల 400 శాతంగా ఉందని సర్వే వెల్లడించింది. ఇది 2015-16లో 126శాతం వృద్ధి నమోదైందని తెలిపింది. రెండేళ్లలోనే మ్యూచువల్ ఫండ్లలో చేసిన పొదుపులు దాదాపుగా 11 రెట్లు పెరిగాయి. మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీలో సభ్యత్వమున్న 42 దేశాల్లో అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయుఎం) వృద్ధిలో భారత్ స్థిరమైన వృద్ధి రేటును నమోదు చేసుకుందని తెలిపింది. మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ ఏ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- అక్టోబర్ కాలంలో రూ.2.53లక్షల కోట్లు పెట్టుబడి జరిగిందని మొత్తం ఆర్థిక ఏడాది పూర్తనాటికి ఇవి రూ.77లక్షల కోట్లకు చేరవచ్చని సర్వే అంచనా వేసింది.

ఆర్థికంగా పైపైకి.. చదువు, ఆరోగ్యంలో వెనక్కి!

✦ పెరుగుతున్న విద్యాపరమైన నిర్మాణాలు ✦ విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు కరువు ✦ పిల్లలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం అధికం ✦ ఆర్థిక సర్వేతో వెలుగులోకి..

న్యూఢిల్లీ : విద్య, ఆరోగ్యానికి సమానమైన ప్రాధాన్యత ఇవ్వాలని ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని, ఉన్న పరిమితమైన వనరులతో ముందుకు వెళ్తున్నదని సర్వేలో వెల్లడైంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నా.. భారత్‌దేశంలో విద్య, ఆరోగ్యం వంటి సామాజిక మౌలిక సదుపాయాలపై ఖర్చులను పెంచేందుకు తగినంత ఆర్థిక సాయం అందడం లేదు. పరిమితమైన వనరులతో ఈ రెండు రంగాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. 2014-15లో ఉన్న సామాజిక కార్యక్రమాలపై జీఎస్‌డీపీ 6శాతం ఖర్చు చేయగా, 2016-17కి వచ్చే సరికి ఇది 6.9శాతంగా నమోదైంది. 2030 కల్లా అందరికీ మెరుగైన విద్య అందించేదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. దీంతో



నిర్మాణ రంగంపై దృష్టి సారించింది. ఇందులోభాగంగా పాఠశాల బిల్డింగ్‌లు, క్లాసు రూంలు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి అంశాల్లో వృద్ధి సాధించింది. బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువ పాఠాశాలలు ఉన్నా.. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంది. ప్రభుత్వం తీసుకొచ్చిన బేటీ బచావో.. బేటీ పఢావో మార్పు తీసుకొచ్చిందని, దేశంలోని 640 జిల్లాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతున్నది.

విద్యతో పాటు ఆరోగ్యమూ ముఖ్యమే...

విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం సమాన దృష్టి సారిస్తున్నది. రానున్న ఆర్థిక సంవత్సరం నుండి జాతీయ పోషకాహార మిషన్‌ను స్థాపించడానికి గాను గ్రీన్ సిగ్నల్ లభించింది. దీని నిర్వహణ కోసం సూపర్‌వైజర్, వారికి లక్ష్యాలను, వారికి సూచనలు, సలహాలు అందించడానికి, పెట్టుబడికి సంబంధించిన ప్రణాళికలను సంబంధితశాఖరూపొందించింది. పౌష్టికాహార లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మంచి ఆహారం అందించేలా చూడాలి. ఎనీమియా, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలపై దృష్టి సారించేలా చూస్తున్నారు. మహిళలు పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటూ.. వంటలు చేయకుండా, ఎలాంటి రాజీ లేకుండా ఉండేందుకు ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. దీంతో పిల్లలతో పాటు ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉండటానికి వీలుంటుంది. 2018, జనవరి 18 వరకు దేశ వ్యాప్తంగా సుమారు 3.3 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు జారీ చేసింది. 2020 నాటికి రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యం నిమిత్తం బడ్జెట్‌లో 8 శాతానికిపైగా నిధులు కేటాయించాలని నేషనల్ హెల్త్ పాలసీ - 2017 పేర్కొంది.

విద్యార్థులు, ఉపాధ్యాయుల కేటాయింపులో పురోగతి

విద్యార్థులు-తరగతి గదులు, విద్యార్థులు- ఉపాధ్యాయుల నిష్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించిందని సర్వేలో వెల్లడైంది. లింగ బేధంలో దేశంలో అభివృద్ధి చెందింది. ఎలాగంటే.. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినుల సంఖ్య పెరిగినా.. సమాజంలో మాత్రం లింగ బేధ సమస్య వెంటాడుతూనే ఉంది. ఒక తరగతి గదిలో 30 మంది విద్యార్థులు ఉండాలనే నిబంధన ఉంది. ఇలా తరగతి గదులు-విద్యార్థుల సంఖ్య నిబంధనలు పాటించే పాఠశాలల సంఖ్య 2009-10లో 43 శాతంగా ఉండగా, 2015-16కి వచ్చే సరికి ఈ స్కూళ్ల సంఖ్య 25.7 శాతానికి పడిపోయింది. 2015-16లో ప్రాథమిక పాఠశాలలో 23 విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు-ఉపాధ్యాయుల సంఖ్య అనేది 30:1, 35:1 నమోదైంది. ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు-టీచర్ల సగటు తీస్తే.. 2015లో 23.4 : 1గా ఉంది. చైనాలో 16.3 : 1గా, బ్రెజిల్‌లో 20.9 : 1గా, రష్యాలో 19.8 : 1గా, దక్షిణాఫ్రికాలో 33.6:1గా నమోదైంది. పొరుగు దేశాల్లో ఈ లెక్క చూస్తే... శ్రీలంకలో 23.2 : 1, నేపాల్‌లో 23.2 : 1, భూటాన్‌లో 26.7 : 1గా, పాకిస్థాన్‌లో 46.3:1గా నమోదైంది. బీహార్, ఉత్తర్ ప్రదేశ్‌లో చూస్తే.. 60 మంది విద్యార్థులకు 1 ఉపాధ్యాయుడు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 4 రాష్ట్రాల్లో అత్యధికంగా ఈ నిష్పత్తి 30కి పైగా ఉంది.

పౌష్టికాహారలోపం ప్రధాన సమస్య

భారత్‌లో పిల్లలకు, గర్భిణులకు పోషకాహార లోపం అనేది ప్రధాన సమస్య. దీంతో పలు రకాల వ్యాధులు వారిని చుట్టుముడుతున్నాయి. వీటిలో గాలి కాలుష్యం, ఆహారపు అలవాట్లు, హై బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ వంటి రోగాలతో చాలా మంది భారతీయులు సతమతమవుతున్నారు. ఆరోగ్య సమస్యలు అనేవి సుమారు 10 పదేళ్లు అనగా 1990-2015 మధ్య అత్యధికంగా పెరిగినట్టు తెలుస్తున్నది.

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఊతం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులకు బిగ్ బూస్ట్ ఇవ్వనున్నట్లు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఆర్థిక సర్వే గుర్తు చేసింది. మొండి బకాయిల కారణంగా నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు చేయూతనిచ్చేలా ఈ ఆర్థిక సంవత్సరం 88వేల139 కోట్ల అదనపు మూలధనాన్ని అందించనున్నట్లు ప్రకటిచడం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరగవచ్చని దేశంలో ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిపుష్టతకు దేశ జీడీపీలో 1.2 వాటా డబ్బును మూలధనంగా వెచ్చించడం ద్వారా బ్యాంకుల బ్యాలెన్స్ షీట్‌ను పటిష్టం చేయవచ్చని కేంద్ర ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసింది.ఈ ఏడాది మార్చి 31 లోపు 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు 88వేల139 కోట్ల అదనపు మూలధనాన్ని అందించాలన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అని కొనియా డింది. బ్యాంకులకు మూలధనం అందించడం ద్వారా అవి చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రుణాలు మంజూరు చేయడం ద్వారా ఉద్యోగాల కల్పన పెరుగుతుందని .. ఈ పరిణామం ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేలా తోడ్పడుతుందని ఆర్థిక సర్వే తెలిపింది. తద్వారా దేశంలో పరిశ్రమల స్థాపనకు ప్రైవేటు పెట్టుబడులు కూడా పెరిగి ఆర్థిక వ్యవస్థ పటిష్టమౌతుందని, ఎగవేత దారులకు కళ్లెం వేయడం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులు పెరగొచ్చని పేర్కొంది.

సరకు రవాణాలో రైల్వేలు వెనకంజ

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేల సరకు రవాణా వాటా తగ్గిపోయిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. పోటీ తత్వం లేని వ్యవస్థ కారణంగా రైల్వేల్లో ఈ పరిస్థితి ఉందని తెలిపింది. ప్రయాణికుల టికెట్ల విషయంలో మాత్రం పెంపు, తగ్గుదల,యథాతథంగా కొనసాగిన సరకు రవాణా ఛార్జీలు మాత్రం గత కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. రైల్వేలో కొనసాగుతున్న ఈ పంథాను మార్చాల్సిన అవసరముందని.. ఇందుకోసం ఆకర్షణీయ సరకు రవాణా విధానాలను అమలు చేయాలని గుర్తు చేసింది.2017 ఆర్థిక సంవత్సరంలో చాలా రకాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి నూతన విధాన మర్గదర్శకాలు కూడా జారీ చేసినట్లు పేర్కొంది.



ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు ధరల్లో మార్పు, ఉక్కు, బొగ్గు రవాణాలకు ఉన్న రెండు విధానాలను ఉపసంహరించుకోవడం జరిగిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (గతేడాది సెప్టెంబర్ వరకు) భారతీయ రైల్వేలు 558.10 మిలియన్ టన్నుల సరకు రవాణా చేశాయని.. అంతకు ముందు ఏడాది ఈ విలువ 531.23 మిలియన్ టన్నులుగా ఉన్నట్లు వెల్లడించింది. విధాన పరమైన మార్గదర్శకాల ద్వారా ఏడాది కాలంలో 5.06 శాతం సరుకు రవాణా పెరిగిందని స్పష్టం చేసింది.ఇతర ట్రాన్స్ పోర్టు రంగాలతో పోలిస్తే రైల్వే రంగం తీవ్ర పోటీని ఎదుర్కొంటోందని ఆర్థిక సర్వే తెలిపింది. దీంతోరైల్వే ట్రాన్స్ పోర్టును ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని పేర్కొంది. కీలక ప్రాంతాల్లో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం, సరకు కారిడార్ల ఏర్పాటు, హైస్పీడ్ రైళ్లు, ఎక్కువ సామర్థ్యం కలిగిన రోలింగ్ స్టాక్,చివరి వరకు రైలు లింకేజి,పోర్టులకు రైల్వే లైన్ల అనుసంధానం, ప్రైవేట్, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సర్వే వెల్లడించింది. రైల్వేస్టేషన్ల పురోభివృద్ధి లాభాపేక్ష లేని ప్రాజెక్టు అయినప్పటికే రైల్వేసంస్థ ఆయా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంది. అయితే స్టేషన్ల అభివృద్ధి సమయంలో చుట్టుపక్కల పరిసరాల అభివృద్ధి ద్వారా ఆర్థిక వనరులను రాబట్టే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలకు రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చే అంశాన్ని కూడా రైల్వేశాఖ పరిశీలిస్తుందనితెలిపింది. పట్టణాల్లో పెరుగుదుతున్న జనాభివృద్ధికి అనుగుణంగా మెట్రో రైల్వేలను అందుబాటులోకి తీసుకురావడం ఇందులో భాగమే.

పింక్ కలర్ లేడీస్ స్పెషల్

✦ గులాబీ రంగులో ఆర్థిక సర్వే నివేదిక కవర్

✦ మహిళా సాధికారతకు నిదర్శనం

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌కు సమర్పించిన ఆర్థిక సర్వే నివేదిక అట్ట గులాబీ(పింక్) రంగును సంతరించుకుంది. అందరి దృష్టిని ఆకర్షించింది. మునుపెన్నడూ లేని విధంగా ఆర్థిక సర్వే నివేదికకు గులాబీ రంగును ఆపాదించడంపై ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) అరవింద్ సుబ్రమణియం సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళా ఉద్యమానికి ప్రభుత్వం సంఘీభావం తెలుపుతుందని చెప్పడానికే ఆ రంగును ఎంచుకున్నట్లు తెలిపారు. ఆర్థిక సర్వే నివేదిక అట్టపై గులాబీ రంగు మహిళలకు అంకితం అని, గులాబీ రంగు ఇంతవరకే పరిమితం కాదని, ఆర్థిక సర్వే వెబ్‌సైట్ బ్యానర్ నుంచి ఐకాన్ల దాకా, వెబ్‌సైట్‌పై హైపర్ లింకులు సర్వం గులాబీ వర్ణమయమని సుబ్రమణియం వెల్లడించారు. చూడబోతే వచ్చే సాధారణ బడ్జెట్ మహిళా సాధికారత, లింగ సమానత్వంపై దృష్టిపెట్టే అవకాశం ఉంది.

కార్మిక చట్టాలకు సాంకేతికత అనివార్యం



న్యూఢిల్లీ : కార్మిక చట్టాల్లో పారదర్శకత తీసుకొచ్చేందుకు టెక్నాలజీ ఎంతో అవసరం. అదేవిధంగా అవి పక్కాగా అమలు చేయడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. వివిధ కార్మిక చట్టాల అమలులో దీన్ని తీసుకురానున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం, అనధికారిక ఆర్థిక వ్యవస్థలో ఎక్కువగా నిమగ్నమయ్యే ప్రజలకు జీవనోపాధిని అందించడానికి కార్మిక రంగంలో అనుసరించే సంస్కరణలపై సర్వే నిర్వహించింది. శర్మ సువిధ పోర్టల్‌లాగే ప్రభుత్వం కొత్త రకం ఆవిష్కరించనుంది. మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ కింద 2017-18 నాటికి అత్యధిక బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. 2016-18 నాటికి, 2018 జనవరిలో 4.6 కోట్ల కుటుంబాలు 177.8 కోట్ల వ్యక్తిగతంగా ఉపాధి అవకాశాలు కల్పించాయి. 54 శాతం మంది స్త్రీలు, షెడ్యూల్ కులాల ప్రకారం 22 శాతం, షెడ్యూల్ తెగల వారు 17శాతం ఉన్నారు.

ఏటా పెరుగుతున్న సాంకేతి విద్య

భారత్ దేశం శాస్త్ర సాంకేతిక రంగానికి కార్ఖానాగా మారింది. యువత సాంకేతిక విద్యపై అత్యధికంగా దృష్టి సారిస్తున్నదని, దీన్ని మరింత వృద్ధి చెందేలా చేయాలని సర్వే కోరింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో భారత్ ఆర్థిక వ్యవస్థ బలంగా మారుతుంది. యువత కూడా కొత్త రకం సాంకేతిక విద్య ఉత్పాదనపై దృష్టిసారించాలి. ఏ దేశం నుండి వచ్చిన ఛాలెంజ్‌ను కూడా ఎదుర్కొనే విధంగా దేశం తయారు కావాలి. 2016-17 నాటికి ఐటీ, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ 8.1 శాతం వృద్ధి చెంది 139.9 బిలియన్ బిలియన్ డాలర్లకు చేరుకుందని సాఫ్ట్‌వేర్ అసోసియేషన్ నాస్కాం వివరించింది. ఎగుమతులు 7.6 శాతం పెరిగి, 116.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2016-17లో ఈ కామర్స్ 19.1 శాతం పెరిగింది.

2022 నాటికి స్థిరాస్తి, నిర్మాణ రంగాల్లో 1.5 కోట్ల మందికి ఉపాధి


న్యూఢిల్లీ: దేశంలో స్థిరాస్తి, నిర్మాణరంగాలు వచ్చే ఐదేళ్లలో 1.5 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తాయని ఆర్థిక సర్వే వెల్లడించింది. స్థిరాస్తి, నిర్మాణ రంగాలు దేశంలో ఉద్యోగాల కల్పనలో రెండో స్థానంలో ఉందని పేర్కొంది. 2013లో ఈ రంగం 40 మిలియన్ల మందికి ఉపాధి కల్పించిందని తెలిపింది. 2017 చివరినాటికి ఈ సంఖ్య 52 మిలియన్లుగా ఉంటుందని పేర్కొంది. 2022 నాటికి ఈ సంఖ్య 67 మిలియన్లకు చేరుకుంటుందని సర్వే అంచనా వేసింది. ఈ వివరణతో వచ్చే ఐదేళ్లలో ఈ రంగాలు 15 మిలియన్ల ఉద్యోగాలు కల్పిస్తాయని స్పష్టమవుతోందని సర్వే నివేదిక వెల్లడించింది. స్థిరాస్తి, నిర్మాణ రంగాల్లో ఉన్న మొత్తం ఉద్యోగుల్లో 90 శాతం భవనాలు నిర్మాణ పనుల్లో ఉన్నారని, మిగతా 10శాతం నిర్మాణ పూర్తి కావడానికి అవసరమైన పనులు.. ఫినిషింగ్, విద్యుత్ సౌకర్యాలు, ప్లంబింగ్, డిమాలిషన్, సైట్ ప్రిపరేషన్ తదితర సేవల్లో ఉన్నారంది. ఈ రంగాల్లో ఉద్యోగుల్లో 80 శాతం మంది కనీస నైపుణ్యం ఉన్నవారు కాగా నైపుణ్యమున్న ఉద్యోగులు 9 శాతంకు పైగా ఉందని, మిగతా వారిలో గుమాస్తా, సాంకేతిక సిబ్బంది. ఇంజినీర్లు ఉన్నారన్ని తెలిపింది.

క్రీడాప్రభ

ఒక్క అడుగు!

- నంబర్ వన్ ర్యాంకుకు చేరువలో ఫెదరర్
- దుబాయ్ ఓపెన్‌లో అగ్రపీఠం దక్కే ఛాన్స్
- అగస్సీ రికార్డును బద్దలుకొట్టే అవకాశం

లేటు వయసులోనూ సరికొత్త రికార్డులు.. 36 ఏళ్ల ప్రాయంలో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకుకు పోటీ.. సుదీర్ఘ కెరీర్‌లో పడిలేచిన కెరటం ఈస్విస్‌టెన్నిస్‌స్టార్ రోజర్‌ఫెదరర్. 20 ఏళ్ల కెరీర్‌లో 20 గ్రాండ్ స్లామ్‌లు.. పరుష లు విభాగంలో అత్యధిక స్లామ్‌లు సాధించిన స్టార్‌గా శిఖరస్థాయికి.. తాజాగా ఆస్ట్రేలియా ఓపెన్‌ను సొంతం చేసుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. వయోభారం తన సత్తాకు అడ్డం కి కాదని మరోసారి చాటిచె ప్పాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాదల్ కంటే వెనుకంజలో నిలిచి, రెండవ స్థానానికి పరిమితం అయ్యాడు. అయితే, గాయాలతో సతమతం అవుతున్న స్పానిష్ స్టార్ నాదల్‌ను అధిగమించి, అగ్రస్థానం దక్కించుకునే మహత్తర అవకాశం ఇప్పుడు ఫెదరర్‌కు కూసింత దూరంలో ఉంది. ఇదే క్రమంలో ఒకప్పటి అమెరికన్ టెన్నిస్ స్టార్ ఆండ్రీ అగస్సి రికార్డును తిరగరాయను న్నాడు. అగస్సి 33 ఏళ్ల వయసులో (2003) ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను సాధించాడు. ఇప్పుడు నంబర్ వన్ ర్యాంకు సాధిస్తే, లేటు వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాడిగా ఫెదరర్ నిలుస్తాడు. ఈ యేడాది మియామి, ఇండియన్ వెల్స్, వింబుల్డన్ సిరీస్‌లు ఆడాల్సి ఉంది. వీటన్నిటిలోనూ ఫెదరరే హాట్ ఫేవరెట్. క్లే కోర్టులకు దూరంగా ఉండటం ద్వారా, వింబుల్డన్ ప్రిపరేషన్‌పై దృష్టిసారిం చాలని ఫెదరర్ భావిస్తున్నాడు. ప్రస్తుతం ఫెదదర్ నాదల్ (840) కంటే 155 ర్యాంకింగ్ పాయింట్లు వెనుకబడి ఉన్నాడు. మార్చిలో జరిగే ఇండియన్ వెల్స్, మియామి టోర్నీల్లో వీలైనన్ని ఎక్కువ పాయింట్లు సాధించాలని పట్టుదలతో ఉన్నాడు.



గ్రాండ్‌స్లామ్ మెలురాళ్లు..

ఆరు సార్లు	ఆస్ట్రేలియా ఓపెన్ విజేత (2004-06-07-10-17-18)
ఒకసారి	ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ (2009)
ఎనిమిది	వింబుల్డన్ టైటిళ్లు (2003-04-05-06-07-09-12-17)
ఐదు	యూఎస్ ఓపెన్ టైటిళ్లు (2004-05-06-07-08)

టాప్-50లో పేస్

న్యూఢిల్లీ: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ తిరిగి టాప్ - 50 ర్యాంకుల్లోకి చేరుకున్నాడు. తాజాగా ముగిసిన న్యూపోర్టు బీచ్ ఈవెంట్‌లో టైటిల్ నెగ్గడం ద్వారా 14 పాయింట్లుసాధించిన పేస్, తాజా ర్యాకింగుల్లో 47వ ర్యాంకులో నిలిచాడు. అమెరికా భాగస్వామి జేమ్స్ సెర్రెటనితో కలిసి న్యూబీచ్ టైటిల్ నెగ్గాడు. దీంతో 125 పాయింట్లు లభించాయి. కాగా, ఈ వారం డల్లాస్ ఈవెంట్‌లో బ్రిటన్ భాగస్వామి జో సలిస్‌బరీతో కలిసి బరిలోకి దిగుతున్నాడు. ఇక, ఇండియా టాప్ ర్యాంక్ డబుల్ ప్లేయర్ రోహన్ బొపన్న ఒక స్థానం దిగజారి, 20వ ర్యాంకుకు పడిపోయాడు. మరొకవైపు ఎడమచేతి టెన్నిస్ స్టార్ దివిజ్ శరణ్ మూడు ర్యాంకులు మెరుగయ్యాడు. తద్వారా కెరీర్‌బెస్ట్ 45వ ర్యాంకుకు చేరాడు. సింగిల్స్ విభాగంలో యుకిభాంబ్రి 118, రాంకుమార్ రామనాథన్ 140, సుమిత్ నాగల్ 218, ప్రజ్ఞేష్ గున్నేశ్వరణ్ 244, శ్రీరాం బాలాజీ 391 ర్యాంకుల్లో ఉన్నారు.



- అండర్ - 19 ప్రపంచకప్ క్రికెట్
- నేడు దాయాదుల మధ్య సెమీస్ పోరు
- ఫైనల్ బెర్త్ కోసం సమరానికి కుర్రాళ్లు సిద్ధం

పాక్‌తో అమీతుమీ

క్రైస్ట్‌చర్చ్: అండర్ - 19 ప్రపంచకప్ క్రికెట్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తున్న యువ భారత్‌కు నేడు అసలుసిసలు పరీక్ష ఎదురు కాబోతున్నది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో సెమీఫైనల్‌లో పృథ్విషా సేన తలపడనున్నది. మూడుసార్లు చాంపియన్ అయిన భారత్, ఈ టోర్నీలో నిజమైన చాంపియన్స్‌లాగే ఆడింది. ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ విజయం సాధించింది. మరోవైపు రెండుసార్లు చాంపియన్ అయిన పాకిస్థాన్, ఆడిన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘన్‌తో ఓడింది. తర్వాత పుంజుకొని వరుస విజయాలతో సెమీస్ చేరింది. అయితే శ్రీలంక, సౌతాఫ్రికాలపై అతి కష్టమ్మీద మూడు వికెట్ల తేడాతో గెలిచింది. బౌలింగ్‌లో షహీన్ అఫ్రిది చెలరేగుతున్నా, బ్యాటింగ్‌లో మాత్రం ఇప్పటివరకు ఆ టీమ్ పెద్దగా రాణించిందిలేదు. మిడిలార్డర్‌లో అలీ జర్యాబ్ ఆసిఫ్ మాత్రమే శ్రీలంకపై 59, సౌతాఫ్రికాపై 74 పరుగులు చేశాడు. కమలేష్ నగర్‌కోటి, శివమ్ మావిలతో కూడిన టీమిండియా పేస్ బౌలింగ్‌కు ఇది సానుకూల పరిణామమే.

అటు ఐపీఎల్లో కోట్లు పలికిన ఆత్మవిశ్వాసంతో ఉన్న భారత యువకులు, పాక్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ ఇద్దరు పేసర్లతోపాటు స్పిన్నర్లు అనుకూల్ రాయ్, అభిషేక్ శర్మ కూడా మంచి ఫామ్‌లో ఉన్నారు. అటు బ్యాటింగ్‌లో కెప్టెన్ పృథ్వీ షాతోపాటు శుభ్‌మాన్ గిల్, మన్‌జోత్ కల్రా అద్భుతంగా రాణించారు. అయితే ఈ బ్యాట్స్‌మెన్‌కు అఫ్రిది రూపంలో ముప్పు పొంచి ఉంది. ఈ టోర్నీలో అఫ్రిది 11 వికెట్లు తీశాడు. ఇక ఇక్కడే క్వార్టర్‌ఫైనల్ ఆడిన పాకిస్థాన్‌కు పిచ్‌పై అవగాహన



ఉండటం కలిసొచ్చేదే. మరోవైపు తొలి సెమీస్‌లో ఆఫ్ఘన్‌పై గెలిచి ఆస్ట్రేలియా ఫైనల్ చేరింది. ఇండోపాక్ మ్యాచ్ విజేతతో ఆసీస్ ఫైనల్లో తలపడుతుంది. ఇండియా, పాకిస్థాన్ సెమీఫైనల్ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారు ఝామున 3 గంటలకే మొదలవుతుంది.

ఐపీఎల్ కోటీశ్వరుల సమరోత్సాహం..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో భాగంగా బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐపీఎల్ వేలంలో భారత యువ క్రికెటర్లు మంచి ధరే పలికారు. సరాసరి 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే ఎడమచేతి వాటం పేసర్ నాగర్‌కోటిని రూ.3.2 కోట్లు, మరో బౌలర్ శివమ్ మావిని రూ.3 కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. ఇక బ్యాటింగ్ సంచలనం, అండర్19 సారథి పృథ్వీషాను ఢిల్లీ డేర్‌డెవిల్స్ 1.2 కోట్లు, శుభ్‌మన్‌గిల్‌ను కోల్‌కతా 1.8 కోట్లు పెట్టి సొంతం చేసుకున్నాయి. ఇక ఎడమచేతి వాటం స్పిన్నర్ అంకుల్‌రాయ్‌ను రూ.20 లక్షలకు ఢిల్లీ, అభిషేక్ శర్మను రూ.55 లక్షలకు ముంబయి కొనుగోలు చేశాయి. షాతో ఓపెనింగ్‌కు దిగే మన్‌జ్యోత్‌ను కనీస ధర రూ.20 లక్షలకు ఢిల్లీనే కొన్నది. వీళ్లంతా కూడా కీలక మ్యాచ్‌లో తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

గెలుపు సులువు కాదు...

దాయాది దేశాలు కావడంతో పోరుపై అమితాసక్తి ఏర్పడింది. పాక్‌ను ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ అతి విశ్వాసానికి పోతే పరాభవం తప్పదు! ప్రారంభ మ్యాచ్‌లో అఫ్గాన్ చేతిలో ఓడి పాక్ ఆ తర్వాత వరుస విజయాలతో సెమీస్ చేరింది. అయితే అవన్నీ కొద్దిపాటి తేడాతోనే. ఆ జట్టులో బౌలర్ షాహీన్ అఫ్రిది, మిడిలార్డర్‌లో అలీ జర్యబ్ బాగా ఆడుతున్నారు. నాలుగు మ్యాచుల్లోనే 11 వికెట్లు తీసిన అఫ్రిదితో భారత బ్యాట్స్‌మెన్ జాగ్రత్తగా ఉండాలి. అతడు ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లు తీశాడు. సెమీస్ జరిగే హెగ్లే ఓవల్ మైదానంలో పరిస్థితులు పాక్‌కు బాగా తెలుసు. క్వార్టర్స్‌లో ఆ జట్టు ఆడింది ఇక్కడే. ఈ సందరఖ ంగా పాక్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోవాలని కోరుకుంటున్నట్టు శుభ్‌మన్ గిల్ అన్నాడు.

జట్లు:

భారత్: పృథ్వీషా (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జ్యోత్ కార్ల, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్‌పోరెల్, హిమాన్షు రాణా, అంకుల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్

పాక్: హసన్ ఖాన్ (కెప్టెన్), రొహైల్ నజీర్, మహ్మద్ అలీ ఖాన్, అలీ జర్యబ్, అమ్మద్ ఆలమ్, అర్షద్ ఇక్బాల్, ఇమ్రాన్ షా, మహ్మద్ తహా, మోషిన్ ఖాన్, మహ్మద్ ముసా, మహ్మద్ జైద్, మునీర్ రియాజ్, షాహీన్ అఫ్రిది, సులేమాన్

ఎదిగిన కొద్దీ ఒదగాలి...



- వివ్-కోహ్లీకి మధ్య సారూప్యతలపై మైఖేల్ హోల్డింగ్స్ వ్యాఖ్య

జొహాన్స్‌బర్గ్: ప్రపంచ మేటి బ్యాట్స్‌మన్‌గా, టీమిండియా సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా దూసుకెళ్తున్న విరాట్ కోహ్లీ కాస్తంత అణకువగా ఉండటం నేర్చుకోవాలని వెస్టిండీస్ దిగ్గజ మాజీ పేసర్ మైఖేల్ హోల్డింగ్ వ్యాఖ్యానించారు. కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతున్న క్రమంలో, భయపెట్టే ధోరణిని విడనాడాలని సూచించారు. ఇండియా కెప్టెన్, సర్ వివియన్ రిచర్డ్స్ మధ్య అరుదైన పోలికలను ప్రస్తావిస్తూ ఆయన ఈ విధంగా అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుతం అతను యువ కెప్టెన్. సారథ్య బాధ్యతలు, లక్షణాల గురించి నేర్చుకునే దశలోనే ఉన్నాడు. కాస్త అత్యుత్సాహం.. తీవ్ర భావోద్వేగం.. కొన్నిసార్లు అతని భావోద్వేగం భీతిగొల్పేలా ఉంటుంది. అది ప్రత్యర్థులకే పరిమితం కావడం లేదు. విరాట్‌ను నేను రిచర్డ్స్‌తో పోల్చినప్పుడు కేవలం బ్యాటింగే కాదు.. సారథ్య సామర్థ్యాన్ని అంచనా వేస్తాను. కెప్టెన్సీ పగ్గాలు స్వీకరించిన సమయంలో వివ్‌ను తలపించాడు. కాలం గడిచేకొద్దీ అతని కాస్తంత మౌనంగా, సంయమనం పాటించాలి' అని హోల్డింగ్ సూచించారు.

బుమ్రా కంటే భువీ బెటర్

టీమిండియా పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా శక్తిసామర్థ్యాలపై మైఖేల్ హోల్డింగ్ సందేహాలు వ్యక్తంచేశారు. 'కొన్ని ప్రత్యేక నైపుణ్యాలతో అతను ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాలేదు. కొత్త బంతిని పంచుకునే ప్రతిభాశాలిగా బుమ్రాను పరిగణించలేను. ఈ విషయంలో నా తొలి ప్రాధాన్యత భువనేశ్వర్‌కే. ఆతర్వాత ఇషాంత్ శర్మ, మహ్మద్ షమి పేస్ దళంలో కీలక సభ్యులు. ఇంగ్లండ్ పిచ్‌లు ద.ఆఫ్రికా పిచ్‌లకు ఎంతో వైవిధ్యం ఉంది' అని హోల్డింగ్ తెలిపారు. తొలి టెస్టు సిరీస్ ఆడుతున్న బుమ్రా మూడో టెస్టులో ఆశ్చర్యకరంగా ఐదు వికెట్లు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, భారత పేసర్లు పాత బంతితో వైవిధ్యాన్ని సాధించగలరని అన్నారు. పరాయి గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో మొత్తం వికెట్లను పేసర్లే పడగొట్టడం హర్షణీయం. ఇందుకు ఇండియా ఫాస్ట్‌బౌలర్లను అభినందిస్తున్నా అని పేర్కొన్నారు. కాగా ప్రపంచ నంబర్ వన్ టెస్టు జట్టుకు ఈ పర్యటన సానుకూలాంశం కాదని అభిప్రాయపడ్డారు.

Published & Printed by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.

ఆంధ్రప్రభ
లైఫ్
lifepage2012@gmail.com
మంగళవారం
30 జనవరి 2018

టెక్ టైమ్

మన అభిమాన హీరో..మనకు నచ్చిన క్రికెటర్...మనం మెచ్చిన నాయకుడు...మన గుండెల్లో గుడి కట్టి ఆరాధించే తార....ఎవరైతేనేం.. వారిని ఫాలో అవ్వాలి....ఎప్పటికప్పుడు వారి జీవిత విశేషాలు తెలుసుకోవాలంటే ఏకైక మార్గం ట్విట్టర్! స్టార్లు, సెలబ్రిటీలు, ఆటగాళ్లు, నాయకులు నిత్యం చురుగ్గా పాల్గొనే అడ్డా ట్విట్టర్!



పిట్ట కొంచెం... కూత ఘనం!

సెలబ్రిటీల అడ్డాగామారిన ట్విట్టర్!

మన అభిమాన హీరో..మనకు నచ్చిన క్రికెటర్...మనం మెచ్చిన నాయకుడు...మన గుండెల్లో గుడి కట్టి ఆరాధించే తార....ఎవరైతేనేం.. వారిని ఫాలో అవ్వాలి... ఎప్పటికప్పుడు వారి జీవిత విశేషాలు తెలుసుకోవాలంటే ఏకైక మార్గం ట్విట్టర్! స్టార్లు, సెలబ్రిటీలు, ఆటగాళ్లు, నాయకులు నిత్యం చురుగ్గా పాల్గొనే అడ్డా ట్విట్టర్!

నేను నా "twttr" ఖాతా తెరిచాను అన్న ట్వీటుతో ట్విట్టర్ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీ ..సోషల్ మీడియా, ఇంటర్నెట్ చరిత్రను ఐదు అక్షరాలతో మార్చేశారు. మొదట్లో ట్విట్ (twttr) గా స్థాపించినా తర్వాత ట్విట్టర్ గా మార్చేశారు. 2006లో జాక్ డోర్సీ మొదలైన వారు దీనిని స్థాపించారు. ట్విట్టర్ ఒక మైక్రో బ్లాగింగ్ సోషల్ నెట్ వర్క్. ఇది ట్వీట్లు అని పిలువబడే 140 అక్షరాల సందేశాన్నిపోస్టు చేయడానికి యూసర్లకు అనుమతి ఇస్తుంది. ఇటీవల సందేశ పరిమితిని 280 అక్షరాలకు పెంచారు. ట్విట్టర్లో ఖాతా కలిగి, ట్వీట్లలో పాల్గొనే వారినిట్విట్టెరాటి అని పిలుస్తారు.

ఫేస్ బుక్ మాదిరిగా ట్విట్టర్‌లో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపడం, మనకు వచ్చిన రిక్వెస్టుల ను ఓకే చేయడం లాంటివి ఉండవు. మనం ఎవరినైతే అనుసరించాలి అనుకుంటా మో వారి ట్విట్టర్‌లోకి వెళ్లి ఫాలో బటన్ నొక్కితే చాలు. వాళ్లు పంచుకునే ప్రతి ట్వీట్‌ను మనం చూడవచ్చు. తిరిగి వారి ట్వీట్ని..రీట్వీట్ అన్న బటన్ నొక్కి మన నెట్వర్క్ తో పంచుకోవచ్చు. అలాగే మనల్ని ఎవరు అనుసరిస్తున్నారో..మనకు వచ్చే నోటిఫికేషన్ ద్వారా ఎప్పటికి అప్పుడు తెలుసుకోవచ్చు. సూటిగా సుత్తిలేకుం డా..చెప్పే అవకాశం ఉన్నందున, తమ వ్యాపకాలతో నిత్యం బిజీగా ఉంటే సెలబ్రిటీలు,నాయకులు, వ్యాపారవేత్తలు, దేశాధిపతులు .... ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లకన్నా..ట్విట్టర్ వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ట్విట్టర్ ద్వారా మీ సొంత వ్యక్తిగత బ్రాండ్ , మీ వ్యాపారం లేదా మీ కంపెనీ ప్రచారం చేసుకుంటూ....మీ భావాలను,అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి శక్తివంతమైన సాధనం ట్విట్టర్ అని చెప్పడం అతిశయోక్తి కాదు. మిగతా సామాజిక మాధ్యమాల మాదిరిగానే ట్విట్టర్ ద్వారా కూడా కొత్త పరిచయాలు పెంచుకోవచ్చు.

ట్విట్టర్‌ను ఎలా..దేని కోసం వాడుతారు?

ట్విట్టర్‌లో ట్రంప్ నుంచి తమన్నా వరకు.. ఒబామా నుంచి సచిన్ టెండూల్కర్ వరకు అభిమాన హీరోలు పవర్ స్టార్ పవన్, మహేష్‌బాబు నుంచి నానీ వరకు.. ఎవరు ఎవరినైనా అనుసరిం చవచ్చు. మిగతా సోషల్ మీడియాలోలాగా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపితే ..మీకు తెలుసా? అంటూ యక్ష ప్రశ్నలు వేసి, తెలిసిన వాళ్లకే పంపండి అంటూ హితబోధలు ట్విట్టర్‌లో ఉండవు. ఇందులో మీరు ఎవరిని ఫాలో కావాలన్నా వారికి మీరు తెలుసుండాలన్న నిబంధన లేదు. మీరు ట్విట్టర్ ఖాతా తెరిచిన వెంటనే మీ అభిమాన హీరోనో.. నాయకున్నో..ఆటగాళ్లనో..మీ అభిరుచులకు తగిన వ్యక్తినో మీరు అనుసరించవచ్చు. లోకజ్ఞానం, తెలియని విషయాలు తెలుసుకునేందుకు, ప్రపంచం నలుమూలల, సప్తసముద్రాలకు ఆవల ఉన్న వ్యక్తులతో పరిచయం పెంచుకునేందుకు ట్విట్టర్ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇక మీ వృత్తి లేదా వ్యాపార రంగానికి సంబంధించిన వ్యక్తులను అనుసరించడం ద్వారా మీ మేథస్సుకు పదును పెట్టుకోవచ్చు. మీ మెయిల్ కాంటాక్టులో ఉన్న వాళ్లను అనుసరించాలంటే ట్విట్టర్‌లోని ఫైండ్ వ్యూపుల్ ఆప్షన్‌లో అకౌంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.ట్విట్టర్ ద్వారా ప్రస్తుతం ప్రపంచంలో ఏమూలన ఏం జరుగుతుంది? ప్రజలు దేనిగురించి మాట్లాడుతున్నారు?..తెలుసుకోవచ్చు. అంతేకాకుండా సినిమాలు, వ్యాపారం, క్రీడలు, రాజకీయాలకు సంబంధించి ఆసక్తికరమైన వార్తలను, వినోదాల గురించి తెలుసుకోవచ్చు...పంచుకోవచ్చు.

ఫోటోలు. వీడియోలు కూడా..!

గడిచిన కొన్ని సంవత్సరాలలో ట్విట్టర్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త ఫీచర్లు వచ్చిచేరాయి. ప్రస్తుతం ట్విట్టర్‌లో సంక్షిప్త సందేశాలతో పాటు... ఫోటోలు,వీడియో,వెబ్‌సైట్ లింకులు పోస్టు చేసుకోవచ్చు. తెలుగుతో పాటు 45 భాషల్లో ట్విట్టర్ అందుబాటులో ఉంది. మీ సభ్యత్వం జపాన్, కొరియా, చైనీస్ భాషల్లో నమోదై ఉంటే ...ఆ భాషల్లో పోస్టులు పెట్టాలంటే మాత్రం మీ సందేశానికి 140 అక్షరాల పరిమితి వర్తిస్తుంది. ఎందుకంటే ఈ మూడు భాషల్లో తక్కువ అక్షరాలతో ఎక్కువ భావం ప్రకటించే అవకాశం ఉంది. మెయిన్ లాండ్ చైనాలో మాత్రంట్విట్టర్‌పై నిషేధం అమలులో ఉంది. ట్విట్టర్‌లో క్రియాశీలంగా ఉండే ఖాతాదారుల సంఖ్య 35 కోట్లు. ప్రస్తుతం ఈ వేదికపై నకిలీ ఖాతాలు(బాట్స్), దుర్వినియోగం, దూషిస్తూ పెట్టే పోస్టులు తదితర దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దాని యాజమాన్యం దృష్టి సారించింది. మిమ్ములను ఎవరైనా దూషించినా, అసభ్యకరమైన పోస్టు పెట్టినా ఆ పోస్టుపై క్లిక్ చేసి ట్విట్టర్‌కు ఫిర్యాదు చేస్తే..ఆ వ్యక్తి బ్లాక్ చేయబడతాడు.



80శాతం మంది దేశాధ్యక్షులు, ప్రపంచ నేతలు..!

ప్రస్తుతం 80శాతం మంది దేశాధ్యక్షులు, ప్రపంచ నాయకులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ట్విట్టర్‌లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఫేస్ బుక్‌లో అయితే 5000 మంది కంటే ఎక్కువ ఫ్రెండ్స్ ఉండేందుకు వీలులేదు. కాని ట్విట్టర్‌లో ఆ బాధ లేదు. మనం ఎంతమందినైనా అనుసరించవచ్చు. దీనికి పరిమితి లేదు. ట్విట్టర్‌లో అత్యంత ఎక్కువ ఫాలోయింగ్ ఉన్న నాయకుడు, అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా. కెటి షెరి అనే తారని 11కోట్లు, ఒబామాను 10 కోట్లు, ట్రంప్, నరేంద్ర మోడీని 4 కోట్లు, అమితాబ్‌ను 3కోట్ల మంది ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నారు. ఇక ట్విట్టర్‌లో ఆహ్లాదకరమైన, ఆశ్చర్యకరమైన పోస్టులు చాలా ఉంటాయి. హాస్యభరితమైన పోస్టులు కోకొల్లలు. వీరేంద్ర సెహ్వాగ్ పోస్టులు ఈ కోవకు చెందినవే. సెహ్వాగ్ పొట్టచెక్కలయ్యేలా పోస్టులు పెట్టి సాలీనా కోటి రూపాయల వరకు ట్విట్టర్ ద్వారా ఆర్జిస్తున్నారు. మరో రాజకీయ నాయకుడు శశిథరూర్ పోస్టులు మనోరంజకంగా ఉంటాయి. ఇక దర్శకుడు రాంగోపాల్ వర్మ, రిషికపూర్, చేతన్ భగత్ ట్వీట్లు హాట్ హాట్‌గా ఉంటూ..ఒక్కోసారి ట్వీట్ల యుద్ధానికి దారితీస్తాయి. ట్విట్టర్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. మీకు స్మార్ట్ ఫోన్ లేకపోతే ఎస్.ఎం.ఎస్ ద్వారా కూడా ఖాతా ఓపెన్ చేసుకోవచ్చు. ట్వీట్లు పెట్టొచ్చు. దీనికోసం దాని యాజమాన్యందేశానికో ఫోన్ నెంబర్ కేటాయించింది. భారత దేశంలో 9248948837 నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపడం ద్వారా ట్విట్టర్‌లో పేరు నమోదు చేసుకోవచ్చు. అలాగే ఇదే నెంబర్‌కు మనం సందేశాలు పంపితే... ట్విట్టర్ మనకు బదులు మన సందేశాలను ట్వీట్ చేస్తుంది.

హోమ్ ఫీడ్...!

హోమ్ ఫీడ్ అంటే మీరు ట్విట్టర్ సైట్ తెరిచిన తర్వాత మీకు కనిపించే..మీరు అనుసరిం చే..అన్ని ట్వీట్లు! ఇది మీ పర్సనల్ లేదా వ్యక్తిగత ట్విట్టర్ ఫీడ్..అంటే మీ ట్విట్టర్ ప్రొఫైల్ అన్నమాట. దీనిలో మీరు రాసిన ట్వీట్ల వివరాలు, మీరు అనుసరించేవాళ్ల, మిమ్ములను అనుసరించేవాళ్ల సంఖ్య, వివరాలు ఉంటాయి. ట్విట్టర్‌లో మిమ్ములను ఎవరు అనుసరించాలి అనే నియంత్రణ ఉండదు. మీ ప్రమేయం లేకుండా ఎవరైనా మిమ్ములను అనుసరించవచ్చు. అయితే మీ ట్విట్టర్ ఖాతాలో సెక్యూరిటీ ఆప్షన్‌లో ప్రైవేట్ అని సెలక్ట్ చేసుకుంటే మాత్రం అప్పుడు మిమ్ములను నేరుగా అనుసరించలేరు. అప్పుడు ఒక్కొక్కరిని మీరు పరిశీలంచాక నచ్చితేనే ఆమోదిస్తారు..ఫేస్ బుక్‌లో మాదిరిగా!

తీసుకోవాల్సి జాగ్రత్తలు

★ మనం ఏదైనా ముఖ్యం విషయం, కార్యక్రమం మీదో పెట్టే ట్వీట్లు, అదే అంశం మీద ఆసక్తి ఉన్న ఇతర సభ్యులు (మనని ఫాలో అవ్వని వాళ్ళు కూడా) కి చేరాలంటే లేదా మన ట్వీట్లను చూడగలిగే విధంగా ఉండాలనుకొంటే ట్వీట్లో 'హ్యాష్ట్యాగ్లు' ఉపయోగించాలి. హ్యాష్ట్యాగ్లో పదానికి పదానికి మధ్య ఖాళీలు లేదా స్పేసు కలిగి ఉండకూడదు. మొత్తం ఇంటర్నెట్లో ఏ విషయంలోనైనా ఏ మాధ్యమాలలోనైనా "#" ఇది హ్యాష్ట్యాగ్ గుర్తు. ఉదాహరణకు # నేను ప్రపంచ తెలుగు మహా సభలలో నాకవిత వినిపిస్తున్నాను. లేదా # ఆంధ్రప్రభ దినపత్రికలో ట్విట్ల మీద నావ్యాసం వచ్చింది. ఇలాగ హ్యాష్ట్యాగ్ ఉపయోగించి చేసిన ట్వీట్లు ప్రపంచంలో అనేక మందిని ఏకం చేయడానికి, ఒక త్రాటి మీదకు తేవడానికి ఉపయోగపడుతుంది. అత్యధికంగా ట్విట్టర్ సభ్యులు హష్ ట్యాగ్లను ఉపయోగించి హైప్ సృష్టిస్తారు. హ్యాష్ట్యాగ్‌ని మొట్టమొదట ప్రవేశపెట్టినది ట్విట్టరే. ఆ తరువాత మిగిలిన మాధ్యమాలు కూడా హ్యాష్ట్యాగ్ ని అనుకరించాయి.

★ మీరు అనుసరిస్తున్న సభ్యుల ట్వీట్ మిమ్మల్ని ఆకట్టుకొన్నట్లైతే ఆ ట్వీట్ని మళ్లా మీరు మీ ఫాలోవర్స్‌తో పంచుకోవడమే రీట్వీటింగ్ . జగన్ రెడ్డి పాదయాత్ర పై పెట్టిన ట్వీట్ని మీరు రీట్వీట్ బటన్ నొక్కడం ద్వారా రీట్వీట్ చెయ్యొచ్చు. అలాగే ఫేసుబుక్‌లో మాదిరి ట్విట్టర్లో కూడా ట్వీట్ని 👍 లైక్ ♥ లవ్ అని పెట్టొచ్చు. ఉదాహరణకు చంద్రబాబునాయుడు అమరావతి మీద పెట్టిన ట్వీట్ను మీరు లైక్ కొట్టొచ్చు. రీట్వీట్‌కి కోట్ ట్వీట్‌కి స్వల్ప వ్యత్యాసముంది. మరొకరి అసలు ట్విట్ లింక్తో పాటు మనం వ్యాఖ్యానించి మరలా ట్వీట్ చేయడమే కోట్ ట్వీట్. కెటిఆర్ హైద్రాబాద్ మెట్రో ఆరంభమైనది అని పెట్టిన ట్వీట్ను మీరు రీట్వీటు చేస్తూ "హమ్మయ్య ఇంక హైద్రాబాద్ ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది" అని మీ భావన కూడా జోడించి పంపేదే కోట్ ట్వీట్.

★ మనం వ్రాసిన ఏదైనా ట్వీట్లు నూరు శాతం గోప్యం కాదు. ఒకవేళ గోప్యంగా ఎవరితోనైనా సంభాషించాలంటే 'డైరెక్ట్ మెసేజ్' (డిఎం) మాత్రమే మార్గం. కాకపోతే డిఎం మనని అనుసరించిన వాళ్ళకే పంపగలం. జూ ఎన్టీఆర్ మిమ్మల్ని అనుసరిస్తే మీరు అతనికి డైరెక్టుగా మెసేజ్ పంపగలరు. సమంతని మీరు అనుసరిస్తున్నారు. కానీ ఆమె మిమ్మల్ని అనుసరించడంలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె మీకు డిఎం పంపగలదు కానీ మీరు పంపలేరు.

మిగతా సామాజిక మధ్యమాలలో యూజర్ ప్రొఫైల్ అంటారు కానీ ట్విట్టర్లో మీ ప్రొఫైల్ని 'ట్విట్టర్ హ్యాండిల్' అంటారు. ఏదైనా ఇమెయిలల్లో యూజర్ పేరుకి మెయిల్ యొక్క పేరుకి మధ్య @ ఈ చిహ్నం ఉంటుంది. ట్విట్టర్లో యూజర్ హ్యాండిల్‌కి ముందు @ ఉంటుంది. ఉదాహరణకు మోడీ, అమితాబ్, షారూఖ్ మరియు సచిన్ల ట్విట్టర్ హ్యాండిల్ లేదా ట్విట్టర్ అకౌంట్ అడ్రస్@naren-dramodi @Sr Bachchan @iamsrk @sachin-rt

★ అన్ని సామాజిక మాధ్యమాలలో మీ యూజర్ అక్కౌంట్ పేరు ఒకే విధంగా ఉంటే ఇంటర్నెట్లో వెతకడం సులభతరం. ఎవరైనా ట్వీట్ చేస్తూ మీ ట్విట్టర్ హ్యాండిల్ని జోడిస్తే దాన్ని 'మెన్షన్'గా అభివర్ణిస్తారు. ప్రభాస్, బాహుబలి విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకి కృతజ్ఞతలు చెబుతూ రాసిన ట్వీట్లొ అ రాజమౌళి అని రాస్తే అది రా జమౌళికి మెన్షన్ చేసినట్లు. మిమ్మల్ని ఇంకొకరు చేసిన మెన్షన్లు మీ హోమ్ ఫీడ్‌లో కనబడతాయి.

★ ట్విట్టర్లో కూడా మీరు ప్రత్యేకమైన లిస్ట్, వివిధ అంశాలపై అభికేంద్రమైన సమూహం యొక్క జాబితా తయారు చేసుకోవచ్చు. ట్విట్టర్లో మొట్టమొదట అవతలి వ్యక్తి మీ ప్రొఫైల్లో చేసేది మీ ఫోటో మరియు క్లుప్తంగా మీ గురించి పరిచయం. ఇవి సరిగా లేని పక్షంలో ఎవర్నీ మీ ట్విట్టర్ హ్యాండిల్ ఆకట్టుకోలేదు. తరచుగా ట్వీట్లు చేసిన యెడల మీ ఉనికిని చాటుకోవడమే కాకుండా గౌరవమిచ్చినట్లుంటుంది.

★ మీకు అమితంగా నచ్చిన మీ ట్వీట్ లేదా ఎక్కువ జనాదరణ పొందిన ట్వీట్ని మీరు 'పిన్' చేసిన యెడల మీ ట్విట్టర్ హోమ్ ఫీడ్ లో అన్నింటికన్నా పైన ఎప్పుడూ నిలుస్తుంది, బయటి వాళ్లు మీ పేజీ చూసినప్పుడు మొదట అదే కనిపించి ఆకట్టుకొంటుంది.

★ మీకు నచ్చని పదాలను, కీ వర్డ్స్ మీకు వచ్చే ట్వీట్లు, జనాదరణ నుంచి తొలగింపబడాలంటే ఆ పదాలు 'మ్యూట్ ఆప్షన్'లో పెట్టినట్లయితే.. అవి మీకు కనబడవు. మీకు నచ్చని మీరు మెచ్చని మరియు మీకు అభ్యంతరకరమైన వ్యక్తులను మీరు 'బ్లాక్' చేయవచ్చును. తద్వారా ఆ వ్యక్తులు మిమ్మల్ని అనుసరించలేరు, మీ ట్వీట్లు మీ హోమ్ పేజీ చూడజాలరు.

★ మీ సెట్టింగ్స్‌లో 'ట్విట్టర్ హైలైట్స్'ని ఆన్ చేయడం ద్వారా మీకు ప్రతి రోజు జరిగిన కీలక సంభాషణలు, ఆ రోజు ట్రెండ్, ధోరణి, ముఖ్య వార్తలు, విషయాలు మరియు ప్రముఖమైన ట్వీట్లు మాత్రమే సారాంశంగా వస్తాయి. సమయాభావం వలన అన్ని చూసి చదవడం కుదరని వాళ్లకు ట్విట్టర్ హైలైట్స్ మంచి ఉపయోగం.

★ నకిలీ ట్విట్టర్ అకౌంట్లను అరికట్టడానికి తీసుకొన్న చర్యల్లో భాగంగా 'వెరిఫై యువర్ అక్కౌంట్' అని ట్విట్టర్ ఒక నిర్దేశం ప్రవేశపెట్టింది. మీ ఫోన్, ఇమెయిల్, ప్రొఫైల్ ఫోటో, వెబ్సైట్ లాంటి విషయాలు ధ్రువీకరణ చేయడం ద్వారా మీ ట్విట్టర్ హ్యాండిల్ పక్కన ఒక నీలం రంగులోనున్న 'వేరిఫైడ్ బ్యాడ్జ్' పొందవచ్చు. ఈ బ్యాడ్జ్ మీ ట్విట్టర్ హ్యాండిల్ కి విశ్వసనీయత పెంచి ఎక్కువ మంది మిమ్మల్ని అనుకరించి మీ ట్వీట్లు చదవడానికి దోహదపడుతుంది.



-సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

త్వరలో భారత్ మార్కెట్లోకి మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ బుక్-2 ల్యాప్‌టాప్

మైక్రోసాఫ్ట్ సర్ఫేస్ బుక్-2 ల్యాప్‌టాప్ త్వరలో భారతీయ మార్కెట్లోకి అడుగు పెట్టనుంది. వాస్తవానికి గత సంవత్సరమే సాఫ్ట్‌వేర్ దిగ్గజం రెడ్మండ్ సర్ఫేస్ బుక్-2 ల్యాప్‌టాప్ యొక్క రెండు వేరియంట్లను (13 మరియు 15 అంగుళాలు) విడుదల చేసింది. అయితే 13 అంగుళాల బుక్-2 ల్యాప్‌టాప్ మాత్రమే ఎంపికి చేసిన మార్కెట్లలో లభిస్తుంది. 15 ఇంచ్‌ల మోడల్ మాత్రం ముందుగా ఆర్డర్ చేసిన వినియోగదారులకు మాత్రమే భారత్ మినహా 17మార్కెట్లలో అందుబాటులోకి తెచ్చింది. ఈ ఏడాది చివర్లో సర్ఫేస్ బుక్-2కు సంబంధించిన 13 మరియు 15 అంగుళాల సర్ఫేస్ బుక్-2 ల్యాప్‌టాప్‌లు భారత్‌తో సహా ఇతర 17 దేశాలలో అందుబాటులోకి రానున్నాయి. అయితే కంపెనీ యాజమాన్యం ఎప్పటి నుంచి ఇవి మార్కెట్లోకి వస్తాయనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. కాకపోతే 13 అంగుళాల ల్యాప్‌టాప్ ధర 1,499 డాలర్లు (రూ.95,800), 15 అంగుళాల మోడల్ ల్యాప్ టాప్ ధర 2,499 డాలర్లు(రూ.1,60,000) గా నిర్ణయించింది.



మనీ ట్రాన్స్‌ఫర్ ఫీచర్ రాబోతోంది!



ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ నుంచి త్వరలో మరో సరికొత్త ఫీచర్ అందుబాటులోకి రానుంది. వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని మనీ ట్రాన్స్‌ఫర్ సేవలను వాట్సప్ సంస్థ అందివ్వనుంది. యూపీఐ ఆధారంగా పనిచేసే డిజిటల్ పేమెంట్ సేవలను వాట్సప్ త్వరలో ప్రారంభించనుంది. దీనికి సంబంధించి సంస్థ ఇప్పటికే అంతర్గతంగా పరీక్షలు నిర్వహిస్తోంది. త్వరలో పూర్తిస్థాయిలో వినియోగదారులకు అందుబాటులోకి తేనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే వాట్సప్ సంస్థ యాక్సిస్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఎస్‌బీఐ తదితర బ్యాంకులతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం వాట్సప్ మనీ ట్రాన్స్‌ఫర్ సేవలను డెవలపర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

అందుబాటులోకి వాట్సప్ బిజినెస్ యాప్

సోషల్ మీడియా దిగ్గజం వాట్సప్ సంస్థ కొత్త యాప్ వాట్సప్ బిజినెస్‌ను మన దేశంలో అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు యూఎస్,యూకే, ఇటలీ, ఇండోనేషియా, మెక్సికోలలో మాత్రమే అందుబాటులోఉండేది. చిన్న, మధ్యతరహా వ్యాపారులను దృష్టిలో ఉంచుకొని..వాట్సప్ సంస్థ ఈ యాండ్రాయిడ్ యాప్ ను తీసుకువచ్చింది. ఈ యాప్ అచ్చం వాట్సప్ లాగే ఉంటుంది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే వేరే నెంబర్‌తో కూడా వాట్సప్ బిజినెస్ యాప్ వాడుకోవచ్చు. త్వరలో ఐఓఎస్‌ప్లాట్ ఫామ్ పైన కూడా ఈ బిజినెస్ యాప్‌ను అందుబాటులోకి తెస్తామని వాట్సప్ యాజమాన్యం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలు తమ ఖాతాదారులతో అనుసంధానం కావడానికి ఈ యాప్ ఎంతో ఉపకరిస్తుంది. ఖాతాదారులు కూడా ఈ యాప్ ద్వారా వ్యాపారలావాదేవీలు, వ్యాపార సంస్థల చిరునామాలు, వెబ్ సైట్ల గురించి తెలుసుకోవచ్చు. ఇందులో ప్రొఫైల్ ఫోటో సెక్యూరిటీతో పాటు లైవ్ లొకేషన్ షేరింగ్ సౌకర్యం కూడా ఉంది.

ఫిబ్రవరి 9న మార్కెట్లోకి యాపిల్ హోమ్‌పాడ్

త్వరలో యాపిల్ సంస్థ హోమ్‌పాడ్ స్పీకర్‌ను మార్కెట్లోకి విడుదల చేసేందుకు రంగం సిద్ధంచేసింది. యాపిల్ హోమ్ పాడ్ స్పీకర్ ధర 349 డాలర్లు.(రూ.22,175) . హోమ్‌పాడ్ సిరీ వాయిస్ అసిస్టెంట్ ఆధారంగా పనిచేస్తుంది. 2017 డిసెంబర్ చివరికల్లా ఆపిల్ సంస్థ వైర్‌లెస్ హోమ్‌పాడ్ స్పీకర్‌ను అందు బాటులోకి తేవాలని భావించినా అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. అమెజాన్ ఎకో తరహాలో హోమ్‌పాడ్‌ను మార్కెట్లోకి తేవాలని ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్న యాపిల్ ఎట్టకేలకు ఈఏడాది ఫిబ్రవరి 9న హోమ్‌పాడ్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.



మోహం మరుగున వివేకం



ఎంతటి వారైనా ఏదో ఒక సందర్భంలో మోహం వంటివాటికి గురవుతుంటారు. ఆ సమయంలో విచక్షణ నశిస్తుంది. అటువంటి సమయాల్లోనే వివేకం మేలుకోవాలి. తద్వారా రానున్న ప్రమాదాన్ని నివారించుకోవచ్చు. అంతేకాక ఎవరు ఎలాంటివాళ్లు, వారికున్న నిజమైన శక్తి ఏమిటో తెలుసుకోవాలి. శత్రువులైనా, మన వారైనా వారి శక్తి సామర్థ్యాలను తెలుసుకుంటే భ్రమలకు తావుండదు. అలాకాక భ్రమలకు లోనైతే నష్టం కలుగుతుంది. అయితే ఒక్కోసారి లాభమూ కలగవచ్చు.

విరాటుని కొలువులో పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు వారక్కడ ఉన్నారని కౌరవులకు అనుమానం కలిగింది. విరాటునిపై దండెత్తితే అతని ఆస్థానంలో ఉన్న పాండవులు బయటకు వస్తారని భావించారు. అందుకోసం ఒక వ్యూహం పన్నారు. ముందుగా సుశర్మను విరాటుని రాజ్యంలో ఉన్న గోసంపదను కొల్లగొట్టడానికి పంపించారు. విరాటుడు సుశర్మను ఎదిరించడానికి వెళ్లినపుడు మరో పక్క నుంచి భీష్మ, ద్రోణాదుల వంటి ఉద్దండులతో ఉన్న అపారసేనా వాహినితో ఆ రాజ్యంలో ఉత్తరం వైపునున్న గోవులను అపహరించడానికి వెళ్ళారు. విరాటుడు, ఆయన సైన్యం, భీముడు మొదలైన వారు అప్పటికే విరాటుని వెంట వెళ్లారు. ఆ సమయంలో ఉత్తరం వైపు నుంచి వచ్చిన కౌరవ సేనతో పోరాడడానికి అంతఃపురంలో యోధులు ఎవరూ లేరు. ఒక్క ఉత్తరుడే ఉన్నాడు. అందరూ ఉత్సాహ పరచడంతో ఉత్తరుడు యుద్ధానికి బయలు దేరాడు. సుశర్మను ఓడించి తిరిగివచ్చిన విరాటునికి తన కొడుకు యోధానుయోధులు ఉన్న అపార సేనావాహినితో పోరాడేందుకు బృహన్నల (అర్జునుని నపుంసక రూపం) సారథ్యంలో వెళ్లాడని తెలిసింది. తన కొడుకు కౌరవ సేనా వాహినిని ఓడించలేడని, అతను మరణించడం ఖాయమని భయపడ్డాడు. అయితే ఉత్తరుని ప్రగల్భాలు విని అతను విజయుడై తిరిగి

మహాభారతంలో చిన్న కథలు

వస్తాడని అంతఃపురంలోని కొంత మంది చెప్పిన మాటలతో ఏ మూలో మిణుకు మిణుకుమనే ఆశ ఉంది. తన వెంట వచ్చిన సైన్యంలోని వారినే కొంతమందిని ఉత్తర కుమారుని సహాయార్థం పంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కంకు భట్టు (ధర్మరాజు) 'బృహన్నలతో వెళ్ళిన ఉత్తర కుమారుడు విజయుడై తిరిగి వస్తాడ'ని అన్నాడు. అయితే విరాటుడు భయపడినప్పుడల్లా బృహన్నలతో వెళ్లిన ఉత్తరుడు విజయుడై వస్తాడని కంకుభట్టు పలుసార్లు అనడంతో అసలే తన కొడుకు ఏమవుతాడో అని భయపడుతున్న విరాటునికి చిర్రెత్తుకొచ్చింది. దానితో విచక్షణ కోల్పోయి ఆ సమయంలో తన చేతిలో ఉన్న జూదం పాచికలను కుంకు భట్టు పైకి విసిరాడు. అవి ఆయన నుదుటికి తగిలి రక్తం కారసాగింది. వెంటనే సైరంధ్రి (ద్రౌపది) పరుగెత్తుకు వచ్చి ఆయన గాయం నుంచి రక్తం కిందపడకుండా తన చీర చెంగును అడ్డుపెట్టింది. ఇది ఏమని అడిగిన విరాటునితో ఈయన సన్యాసి కనుక ఈయన రక్తం ఇక్కడ ఎన్ని చుక్కలు పడుతుందో అన్ని సంవత్సరాలు అక్కడ క్షామం దాపురిస్తుందని, మీరు మంచివారు కనుక మీ రాజ్యంలో అలా జరగకుండా చెంగు అడ్డుపెట్టానంది. ఇది కంకు భట్టుకు విచిత్రంగా తోచింది. తర్వాత ఉత్తరుడు రావడం ధర్మరాజు, ఇతర పాండవుల గురించి వెల్లడించడం జరిగింది.

ఇక్కడ మనం తెలుసు కోవలసింది ఉత్తర కుమారుని గురించి, అతని తండ్రి అంచనా. తన కుమారుని శక్తి సామర్థ్యాల గురించి ఆయనకు తెలియదని అనుకోగలమా. పుత్ర ప్రేమ కారణంగా తన కుమారుని అవమానించాడని భావించి కంకు భట్టు రూపంలో రోజూ ధర్మాధర్మ విచక్షణ గురించి తనకు బోధిస్తున్న ఒక గౌరవనీయుడైన వ్యక్తిని గాయపరిచాడు. పుత్ర వ్యామోహంతో అతను ఒక్క క్షణం తన కుమారుని శక్తిసామర్థ్యాలను మరి చాడు. పుత్ర ప్రేమ వాస్తవాన్ని మరుగుపరచి అనుచితంగా ప్రవర్తించేలా చేసింది. ఆ పుత్ర ప్రేమే మహాభారత యుద్ధానికి కారణమయింది. ధృతరాష్ట్రుడు ఆ పుత్ర వ్యామోహంతోనే దుర్యోధనుని తప్పుడు పనులను సమర్థంగా కట్టడి చేయలేదు. భీష్మాదులను చేయనీయలేదు. అలవి మీరిన పుత్ర ప్రేమ ఎటువంటి అనర్థాలకు దారితీసిందో గ్రహించాలి. పుత్ర ప్రేమే కాదు. ఏ వ్యామోహమైనా అనర్థ హేతువే. మోహం అరిషడ్వర్గాల్లో ఒకటి.

\- అశ్విని

తారాదేవిని ఆరాధించే చతుర్దశి తిథి



ప్రతి మాసంలోని రెండు పక్షాల్లోనూ చతుర్దశి తిథి వస్తుంది. ఈ చతుర్థి తిథికి ఒక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా బెంగాలీలు ఈ తిథినాడు తారాదేవిని పూజిస్తారు. తారాదేవి దశ మహావిద్యల్లో రెండోది. తారాదేవికి మళ్లీ ఎనిమిది రూపాలున్నట్టు చెబుతారు. వాటిలో ఉగ్ర తార ఒకటి. ఈ ఉగ్రతార ఆలయం అసోంలోని ప్రసిద్ధ కామాఖ్యా ఆలయం దగ్గరలో ఉంది. కామాఖ్యా క్షేత్రం అమ్మవారి పద్దెనిమిది శక్తి పీఠాల్లో ఒకటి. తారాదేవి ఒక సమయంలో వామాచార తాంత్రికపద్ధతే ముక్తికి మార్గమని పేర్కొన్నట్టు చెబుతారు. అంతేకాక ఆ పద్ధతులు సరికాదని అంతకు ముందు వాదించిన వసిష్ఠ మహర్షిని ఆ విద్య నేర్చుకునేందుకు టిబెట్‌కు తన వెంట తీసికెళ్ళిందనే కథ కొన్ని ప్రాంతాల్లో ప్రచారంలో ఉంది. ఆ తర్వాతే ఆయన పశ్చిమ బెంగాల్‌లోని బీర్ భూమ్‌లో తారాపీఠ ఆలయం నెలకొల్పారని చెబుతారు. కొంతమంది తారాదేవిని కాళి రూపంగా భావిస్తారని, కాని వీరిరువురూ వేరని కొంతమంది చెబుతారు. ఏది ఏమైనా ఈ రూపాలన్నీ ఒకే శక్తి వేర్వేరు రూపాలే. కామాఖ్యా ఆలయం వద్ద ఉన్న తారాదేవి ముదురు నీల వర్ణం లేదా నల్లగా బాన పొట్ట కలిగి ఉంటుందని ఆమె చేతిలో కత్తెర, కత్తి, మనిషి తల, కపాల పాత్ర, తామరపువ్వు ఉంటాయని చెబుతారు. తారాదేవి సుందర రూపంతో, కారుణ్యంఉట్టిపడే ముఖంతో ఉంటుందని చెబుతారు. బౌద్ధ తాంత్రిక పూజల్లో ఏకజ పేరుతో ఉండే భయంకర ఉగ్ర రూపంతో ఆమెదేనని పేర్కొంటారు.

ఒక్కొక్క రూపంలో దేవి ఆరాధన ఒక్కొక్క విధానంలో ముక్తి నిస్తుందని భావిస్తారు. ఒక్క కామాఖ్య ఆలయం సమీప ఆలయంలోనే తారాదేవి రజతమూర్తిగా దర్శనమిస్తారని చెబుతారు. గతంలో ఈ ప్రాంతంలో ఏర్పడిన భయంకర భూకంపం సందర్భంగా ఆలయం ముఖ్యభాగం ధ్వంసం కావడంతో దానిని పునర్నిర్మించారని ఆ సందర్భంగా వెండితో చేసిన ఈ మూర్తిని ప్రతిష్ఠ చేశారని చెబుతారు. తారాదేవిని రక్షణ శక్తిగా, రక్షకురాలిగా భావిస్తారు. కాళికా దేవి అంటే స్త్రీ శక్తి. ఆమె మరో రూపం తారా దేవి. ఆమెకు ఇష్టమైన ఈ తిథే శివునికి కూడా ఇష్టం. ఆయనే మహాకాలుడు కదా. ఇక కొన్ని రకాలైన పనులకు చతుర్దశి తిథి మంచిదని చెబుతారు. వాటిలో వేట, యుద్ధం, ఆయుధాల తయారీ వంటివి ఉన్నా యి. అయితే ప్రయాణాలు, క్షుర కర్మ వంటి వాటికి ఇది మంచిది కాదని చెబుతారు.


కల్పాదులు-భగవద్విభూతులు



సకల కల్పాలలో శ్రీమన్నారాయణ భగవానుడు అన్ని విభూతుల ఆకారములను తన యోగ మాయతో సృష్టించి వాటిని రక్షించును. అనంత జీవకోటికి వారి కర్మానుగుణంగా ఫలాలను అందిస్తూ కర్మ వ్యయమైనపుడు ఉపసంహరిస్తూ ప్రతి విభూతిలోని ప్రతి ప్రాణికి కలగవలసిన, తొలగవలసిన సుఖదుఃఖాలను ఆయా విభూతుల ద్వారా అందిస్తూ రక్షిస్తుం

ధర్మం-మర్మం

టాడు. అదేవిధంగా వారి యోగ్యతను బట్టి వారు అనుభవించవలసిన పరములను అందించడానికి ఆయా ద్వీపాలు, వర్షాలు, నదులు, పర్వతాలు, అరణ్యాలు, వృక్షా లను సృష్టించాడు. ఇంతటి నియమబద్ధమైన సువ్యవస్థను పరమాత్మ తన సంకల్పంతో యోగమాయ ప్రభావంతో ఏర్పరిచాడు.



\- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

అంతిమంగా వరదాతను నేనే!



అధ్యాయం 7

శ్లోకం 22:

స తయా శ్రద్ధయా యుక్తః
తస్యారాధనమీహతే।
లభతే చ తతః కామాన్
మయైవ విహితాన్ హితాన్॥

తాత్పర్యం

అట్టి శ్రద్ధను పొందినవాడై మనుజుడు ఏదైనా ఒక దేవతారాధనను చేపట్టి తద్వారా తన కోరికలను నెరవేర్చుకుంటాడు. కాని వాస్తవానికి ఆ వరములన్నియును నా చేతనే ఒసగబడుచున్నవి.

భాష్యం


భగవంతుని ఆజ్ఞలేనిదే దేవతలు సైతమూ తమ భక్తులకు వరాలను ప్రసాదించలేరు. ఈ విషయము అల్పజీవులకు తెలియక పోయినా దేవతలకు బాగా తెలుసును. తన కోరికను ఎట్టిపరిస్థితిలోనైనా తీర్చుకోవాలనుకునే వాడే ఈ విధంగా దేవతలను ఆశ్రయిస్తాడు. భగవద్ధామానికి తిరిగి వెళ్లామనుకునే భక్తునికి భౌతిక కోరికలు అవరోధాలవంటివి. కాబట్టి అట్టి భక్తుడు భౌతిక కోరికలతో వస్తే, అటువంటి కోరికలను పోగొట్టి భగవద్ధామానికి మార్గం సుగమం చేస్తాడు. కాబట్టి కోరికలు బలంగా ఉండేవారు, భగవంతుణ్ణి ఆశ్రయించక దేవతలను ఆశ్రయిస్తారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అనన్య శరణాగతి



(గత సంచిక తరువాయి భాగం)

శ్రీ రమణాశ్రమం

10-4-47

కృష్ణభగవాన్ అర్జునునితో-

"అనన్యా శ్చింతయన్తోమాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం" అ.9, శ్లో. 22

అన్నారు అర్జునునకు యుద్ధం చేయవలసిన పని ఉన్నది. అందువల్ల భారం నామీద వేసి, పనిచేయవోయ్, నీవు నిమిత్తమాత్రమే సుమా. అంతా నేనే చూచుకుంటాను. నిన్నేదీ బాధించ"దన్నారు కృష్ణభగవాన్. అయితే, ఈ అనన్య శరణాగతి చేయటానికి ముందు చేసేదెవరో తెలుసుకోవాలి. ఏ చింతనా లేకుంటే గాని, శరణాగతి కాదు. ఏ చింతనా లేనప్పుడు ఉండేది తానే గదా? తనకు తానే శరణాగతి చెందగలడన్నమాట. భక్తిపరమైతే, భగవానునందే భారంవేసి, తన కర్మ సాగిస్తుంటే, క్రమంగా తానెవరో తనకు బోధపడుతుంది. ఏదైనా ఫలితం ఒకటే. శరణాగతి అంటే తన్ను విచారించి తెలుసుకొని, తాను తానుగ నిలుచుటే; తన్ను విడిచి అన్యం ఏమున్నది?" అన్నారు భగవాన్.

"అది తెలుసుకునే మార్గమో?" అన్నాడా యువకుడు. "గీతలో ఎన్నో మార్గాలు చెప్పారు. ధ్యానం చెయ్యమన్నారు. దానికి శక్తిలేదూ, భక్తి, కాకుంటే యోగం, నిష్కామకర్మ, ఇంకా ఎన్నో చెప్పారు. ఏదో ఒక మార్గాన్ననుసరించి పోవాలి. తానెప్పుడూ ఉండేవాడే కదా? సంస్కారాన్ననుసరించి పనులు వాటంతటవే జరుగుతుంటాయి. చేసేది నేననే భావనే బంధం. విచారణ వల్ల దాన్ని పోగొట్టుకుంటే ఈ ప్రశ్నలే రావు. కళ్లు మూసుకొని కూర్చున్నంతనే శరణాగతి కాదు. అంతా అదేవిధంగా కూర్చుంటే లోకయాత్ర సాగేదెట్లా?"అని భగవాన్ అంటూండగా భోజనశాలలో గంట మ్రోగింది. "అదుగోనయ్యా గంట, లేచి పోవద్దూ?"అని నవ్వుతూ లేచారు భగవాన్.

\------

స్వప్న దర్శనాలు

17-4-47

మొన్న ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటల వేళ సాధారణ కుటుంబంలోని ఒక వృద్ధుడు, కొంచెంగా ఆయుర్వేదం తెలిసినవాడు, భగవాన్ సన్నిధికి వచ్చి నమస్కరించి, "స్వామీ! ఇది కఫానికి మంచిది. సేవించండి" అంటూ ఏదో ఔషధం ఇవ్వబోయినాడు. సేవకులు "వద్దు వద్ద"ని వారించబోతే భగవాన్ వారినాపి, ఆ ఔషధం తీసుకొని తిని, సేవకులతో "ఉండండయ్యా, వారు నేను కొండ మీద ఉన్నప్పటి నుండీ అప్పుడప్పుడు ఔషధం తెచ్చి యిస్తూ ఉండేవారు. ఇవ్వనీయండి. వారికేదైనా స్వప్నం వచ్చిందేమో?" అన్నారు నవ్వుతూ. ఆ వృద్ధుడు ఆనందంతో "ఇప్పుడేమీ స్వప్నం రాలేదు స్వామీ! తమకు ఈరోజుల్లో కఫం కొంచెం జాస్తి గా ఉండేది గదా. అందువల్ల ఊరికేనే తెచ్చాను" అని చెప్పి నమస్కరించి వెళ్లాడు. అతడటు పోగానే సమీపస్థులగు భక్తులొకరు "స్వప్నం యేమిటి" అన్నారు. "అదా, కొండమీద ఉండగా ఒక సాయంత్రం నేనెందుకో పళని స్వామితో నిమ్మపండు వున్నదా?"అన్నాను. "లేదు" అన్నాడు. 'లేకుంటే పోనీలే" అన్నాను. సరిగా ఆ రాత్రికే నేను నిమ్మపండు కావాలని అడిగినట్లు వీరికి స్వప్నం వచ్చిందట. మర్నాడు ఈ నిమ్మపండు తీసుకోం'డన్నారు. నీకెట్లా తెలిసిందయ్యా అంటే రాత్రి స్వప్నంలో తాము కనుపించి నిమ్మపండు కావాలంటిరే. అందుకని తెచ్చానని పండు చేతులో పెట్టారు. అదొక సంభవం" అన్నారు భగవాన్.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

\- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. దూరప్రయాణాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి.. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఖులాసా



ఫిబ్రవరి 4న క్యాన్సర్ దినోత్సవం

క్యాన్సర్ యమడేంజర్ కాదు!


మనిషి శరీరంలోని ఏ అవయవంలోనైనా ఒక నిర్దిష్టక్రమంలో కాకుండా హానికరమైన అపరిమితంగా పెరగడమే క్యాన్సర్. అపరిమితంగా పెరగడమే క్యాన్సర్. ఇది శరీరంలోని ఏ భాగానికైనా రావచ్చు. శరీరంలో ఏ భాగంలో క్యాన్సర్ సోకుతుందో దానికి ఆ అవయవ క్యాన్సర్‌గా చెబుతుంటాం. ఊపిరితిత్తులకు క్యాన్సర్ వస్తే దానిని లంగ్ క్యాన్సర్ అంటారు. ఏ భాగానికి ముందుగా క్యాన్సర్ వచ్చిందో దానిని ప్రైమరీ క్యాన్సర్ అంటారు. ఇక క్యాన్సర్ అన్నది ఆ భాగానికి పరిమితం కాకుండా అలా ఎటుపడితే అటు విస్తరిస్తుందది అందరికీ తెలిసిందే. ఇలా క్యాన్సర్ పెరగడాన్నే మెటా స్టాసిస్ అంటారు. క్యాన్సర్ అన్నది తొలుత ఎముకల్లో మొదలైతే దానిని ప్రైమరీ బోన్ క్యాన్సర్ అంటారు. ఒకవేళ అది మెటాస్టిటైజ్ వల్ల సోకితే దానిని సెకండరీ బోన్ క్యాన్సర్ అంటారు. సాధారణంగా నేరుగా ఎముకలకు క్యాన్సర్ రావడం అరుదే అయినా రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ వంటివి వచ్చి ఆ కణతులు పెరుగుతూ ఎముకలను సోకి నిర్దిష్టమైన ఆకృతిలో సాఫీగా ఉండే ఎముకలపై కూడా కణతులు ఏర్పడతాయి. శరీరంలో మృదు కణజాలమైన చర్మం, కండరాలు, నరాలు వంటివాటికి వచ్చే క్యాన్సర్లు మరో రకం.

క్యాన్సర్ అనేది దగ్గరి సంబంధం ఉన్న అనేక వ్యాధుల సముదాయం. ఇది శరీర నిర్మాణానికి కనీస అవసరమైన కణాల్లో మొదలవుతుంది. శరీరం అనేక రకాల కణాల సముదాయం. ఈ కణాలు పెరిగి విభజన చెందుతాయి. ఈ విభజన కణాల వృద్ధి శరీరానికి ఆరోగ్యంగా ఉంచడానికి చాలా అవసరం. కొన్నిసార్లు ఈ క్రమబద్ధీకరణ అదుపు తప్పుతుంది. శరీరానికి అవసరం లేకపోయినా, కొత్త కణాలు ఏర్పడతాయి. పాతకణాలు క్షీణించాల్సిన సమయంలో క్షీణించవు. ఈ విధంగా ఏర్పడిన కణాల సముదాయం కంతి మాదిరిగా ఏర్పడతాయి. దీనిని క్యాన్సర్ గడ్డ అని వ్యవహరిస్తారు. వాస్తవానికి ఈ కంతులు అన్నీ అపాయమైనవి కావు. కొన్ని నిరపాయకరమైన ఉంటాయి. నిరపాయకరమైన కంతులను శస్త్రచికిత్స ద్వారా తొలగించవచ్చు. అపాయకరమైన కంతులు శరీరంలో నియంత్రణ లేకుండా విభజన జరిగి పెరిగిపోతూ మనిషి ప్రాణానికే ముప్పుగా తయారవుతాయి. ఇవి తమ చుట్టూ ఉన్న కణాల్లోకి చొచ్చుకుపోయి వాటిని విచ్ఛిన్నం చేస్తాయి. ఈ క్యాన్సర్ కణాలు కంతుల నుండి విడిపోయి దూరంగా రక్త ప్రసరణ వ్యవస్థలోకి, లేదా శోషరస వ్యవస్థలోకి చేరుతాయి. రక్తనాళాల చివర నిర్మాణంలో రక్తనాళికలు సిరలు, ధమనులు అన్నీ కలిపి ఉంటాయి. వీటి ద్వారానే రక్తం శరీరంలోని అన్ని భాగాలకు వెళ్తుంది.

అపాయకరమైన కంతులు ఏర్పడటానికి అనేక కారణాలున్నాయి. కణాలలోని జన్యువులలో కలిగే మార్పుల వల్ల సాధారణంగా విభజన జరగడం, లేదా క్షీణించడం వంటి అంశాలపై నియంత్రణ కోల్పోతాయి. ఈ క్రమంలోనే సాధారణంగా ఉండాల్సిన జన్యువులు క్యాన్సర్ పెరగడానికి అనుమతించేవిగా మారుతాయి. ఈ విధమైన జన్యుమార్పులకు కారణాలు అనేకం ఉన్నాయి. అందులో ప్రధానమైనవి ధూమపానం, ఆహారపుటలవాట్లు. అదే విధంగా సూర్యరశ్మిలోని అయినీకరణ వికిరణాలు కూడా కారణమవుతాయి. కొన్ని రకాల క్యాన్సర్లు అనువంశికంగా రావచ్చు. చాలా వ్యాధులు మాదిరి క్యాన్సర్ అంటువ్యాధి మాత్రం కాదు. అపాయకరమైనది అని చెప్పవచ్చు. క్యాన్సర్ ఒకరి నుండి మరొకరికి వ్యాపించదు. గాయాలు, దెబ్బల నుండి క్యాన్సర్ పుట్టదు. అయితే ఇటీవలికాలంలో క్యాన్సర్ అనువంశికమని కొత్త సిద్ధాంతాలు వస్తున్నాయి. అయితే ఈ విషయాలు ఇంకా రూఢీ కాలేదు.

నిర్ధారణ

క్యాన్సర్‌ను గుర్తించే ఎన్నో ఆధునిక పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నా, కచ్చితంగా నివారించే ఒకే ఒక పద్ధతి అంటూ లేదు. అయితే వ్యాధి వల్ల వచ్చే అపాయాన్ని కొంతమేరకు నిరూపించుకోవచ్చు. జ్వరం, వణుకు, , రాత్రుళ్లు చెమట పోయడం, ఇతర ఇన్‌ఫ్లూయింజాలు, బలహీనత, అలసట, ఆకలిలేమి, రక్తం కారడం, చిన్న కంతులు శరీరంలో రావడం, పుట్టుమచ్చల్లో మార్పులు రావడం, చికిత్సకు మానని పుండ్లు, గొంతులో గరగర, విడవకుండా కొనసాగే అజీర్తి, బరువులో అర్థం లేని మార్పులు, అసాధరణ రక్తస్రావం గుర్తించినప్పుడు దానిని క్యాన్సర్‌గానూ, క్యాన్సర్ సంబంధిత రోగంగా గుర్తించాలి. క్యాన్సర్ నివారణకు శస్త్రచికిత్స పద్దతులు అందుబాటులో ఉన్నాయి. కొన్నింటిని అయినీకరణ చికిత్స ద్వారా మరికొన్నింటిని మందులతోనూ, ఇంకొన్నింటిని మందులు, హార్మోన్ల ద్వారా నివారించవచ్చు. అలాగే క్యాన్సర్ నిరోధానికి ప్రకృతి చికిత్స ఉంది. ఇందుకోసం వైద్యులు క్యాన్సర్ సోకిన శరీర భాగాన్ని గుర్తించాల్సి ఉంటుంది. అది శరీర భాగాలకు సోకింది లేదా అన్నది కూడా పరిశీలిస్తారు. రోగి వయస్సు, శారీరక, మానసిక స్థితి తదితర అంశాలను గుర్తించి చికిత్సను ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ చికిత్సలో భాగంగా ఆరోగ్యకరమైన కణాలు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కొంతమందికి చికిత్స కన్నా మందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా ఎక్కువగా ఉండొచ్చు. అందువల్ల రోగి, వైద్యుడు పరస్పరం ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ చికిత్స మొదలుపెట్టాలి. శరీరం మార్పులు, ఆరోగ్యస్థితిని ఎప్పటికప్పుడు సమగ్రంగా విశ్లేషంచుకోవాలి. శస్త్రచికిత్స అనంతరం రోగి శారీరకంగా అనేక మార్పులను గమనించవచ్చు. వాటన్నింటినీ వైద్యుడే ముందుగానే వారికి కౌన్సిలింగ్ చేయాలి. దానివల్ల అనవసరపు ఆందోళన లేకుండా ముందుగానే రోగి అన్ని విషయాల్లపై మానసికంగా సన్నద్ధంగా ఉంటాడు. చికిత్స అనంతరం రోగికి నొప్పి పెరగవచ్చు. మరికొంతమందికి క్యాన్సర్ శరీరం అంతా పాకవచ్చు. లేదా శరీరంలో క్యాన్సర్ చాలాకాలం పాటు ఉండొచ్చు. జుత్తు రాలిపోవచ్చు. శరీరంలో ఏ శరీర భాగానికి క్యాన్సర్ సోకిందో దానికి విభిన్నమైన శస్త్రచికిత్సా పద్ధతి అమలులో ఉంది. లుకేమియానే మనం రక్తక్యాన్సర్ అంటున్నాం. రక్తోత్పత్తి అయ్యే అవయవాలు ముఖ్యంగా మజ్జ, శోషగ్రంథులు, ప్లీహానికి ఇది సోకుతుంది.



బ్లడ్ క్యాన్సర్‌లో అపరిపక్వమైన తెల్ల రక్తకణాలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అవుతాయి. సాధారణ, ఆరోగ్యమైన తెల్ల రక్తకణాలను స్థానభ్రంశం చేసి ఎముకల్లోని మజ్జకు హాని కలిగిస్తాయి. దీనివల్ల రక్తం గడ్డకట్టడం లేదా ప్లేట్స్ తగ్గిపోవడం జరుగుతుంది. లేదా గాయాలు తగిలినప్పుడు రక్తస్రావం, శరీరం కమిలినట్టుగా కనిపించడం, చర్మం మీద ఎర్రని దద్దుర్లు వంటి లక్షణాల వల్ల మనం ఈ సమస్యలను గుర్తించవచ్చు. నిజానికి మన రక్తంలోని తెల్ల రక్తకణాలు వ్యాధికారకమైన సూక్ష్మ జీవులతో నిరంతరం పోరాడుతూనే ఉంటాయి. క్యాన్సర్ వ్యాధి సోకితే తెల్ల రక్తకణాలు అణచివేయబడతాయి. లేదా వాటి పనిని సక్రమంగా నిర్వర్తించలేకుండా పోతాయి. పర్యవసానంగా రోగి నిరోధక వ్యవస్థపైనా, ఇతర శరీర భాగాలపైనా వ్యాధి కారకమైన సూక్ష్మ జీవుల దాడి ప్రారంభం అవుతుంది. గాళ గ్రంథులు వాపును మనం లుకేమియా అని చెప్పవచ్చు. తెల్ల రక్తకణాలు చాలామందిలో కనిపించేంతగా వాస్తవానికి ఉండకపోవచ్చు. దీనిని ఎలుకీమియా అంటారు. రక్త క్యాన్సర్ రెండు రకాలుగా వైద్యులు చూస్తారు. ఒకటి ఆకస్మికంగా వచ్చేది. రెండోది దీర్ఘకాలం పాటు ఉండేది. అపరిపక్వమైన రక్తకణాలు వేగంగా వృద్ధి చెందుతూ పోతాయి. ఈ కణాలు గుంపులు గుంపులుగా ఎముక మజ్జలో ఏర్పడి ఎర్ర రక్తకణాల ఉత్పత్తి చేసే వీలు లేకుండా చేస్తాయి. ఈ రకమైన రక్తక్యాన్సర్ పిల్లల్లో, యవ్వనంలో ఉండేవారిలో వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. దీనికి తక్షణ చికిత్స చాలా అవసరం.. ఎందుకంటే ఈ రకం రక్త క్యాన్సర్‌లలో కణాలు వేగంగా పెరిగిపోయి గుంపులు గుంపులుగా చేరి, రక్తప్రసరణలోకి వచ్చి ఇతర అవయవాలకు వ్యాపిస్తాయి. దీంతో కేంద్ర నాడీ వ్యవస్థ ప్రభావితం అవుతుంది. కేంద్ర నాడులకు దానివల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయి. రక్తక్యాన్సర్‌లో వేరే క్యాన్సర్ల మాదిరి జన్యు పదార్థ శరీర నిర్మాణంలో అనేక మార్పులు వస్తాయి. ఈ మార్పులు మామూలు కణాలను, క్యాన్సర్ కణాలుగా అణచివేసే జన్యువులను స్తేజపరుస్తాయి. ఇంకా నియమబద్ధంగా జరగాల్సిన కణవిభజన, ఏర్పాటు, కణ క్షీణత వంటి ప్రక్రియలు అన్నీ తారుమారైపోతాయి. ఈ జన్యువు ఉత్పత్తివర్తనాలు అకస్మాత్తుగా జరగవచ్చు.

రక్తక్యాన్సర్ మాదిరి రొమ్ము క్యాన్సర్, స్తనంలోని కంతులు, రొమ్ములోని గడ్డలు కూడా క్యాన్సర్ రూపాలే. స్త్రీలలో వచ్చే క్యాన్సర్‌లలో సాధారణమైనవి రొమ్ము క్యాన్సర్. క్యాన్సర్ వల్ల స్త్రీలలో కలిగే మరణాలలో రెండోస్థానం రొమ్ము క్యాన్సర్‌దే. ఈ రకమైన వ్యాధికి కుటుంబ చరిత్ర చాలా ముఖ్యమైంది. ముందుగా జన్యుమార్పులు రావడం, బహిష్టు రావడం, బహిష్టు ఆగిపోవడం, పిల్లలు కలుగకపోవడం తదితర ప్రమాదాలు ఉంటాయి. అయితే రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి అనేక అపోహలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి. రొమ్ములో కనిపించే గడ్డలన్నీ క్యాన్సర్ గడ్డలు కాదు. కొంతమంది పురుషులకూ ఈ క్యాన్సర్ రావడానికి అవకాశాలు లేకపోలేదు.

స్త్రీలలో వచ్చే మరో క్యాన్సర్ సెర్వికల్ క్యాన్సర్. ఇది హెచ్‌పివీ వైరస్ వల్ల వస్తుంది. పురుషుల్లో ఈ వైరస్ ఉన్నావారికి ఇబ్బంది ఏమీ లేకున్నా స్త్రీలకు మాత్రం ముప్పుగా పరిణమిస్తుంది. గర్భాశయ ముఖద్వారానికి వచ్చే ఈ క్యాన్సర్ వేగంగా విస్తరించడానికి కారణం అవగాహన లేకపోవడమే. ఈ వైరస్ సోకినప్పుడు కొన్ని ప్రాథమిక లక్షణాలు కనిపిస్తాయి. నొప్పిగా ఉండటం, రక్తస్రావం, పీరియడ్స్ ఎక్కువ రోజులు ఉండటం, సంభోగం తర్వాత రక్తస్రావం, మధ్యలో అదనంగా పీరియడ్స్ రావడం, మూత్రపిండాల వాపు, లివర్‌కు ఇబ్బందులు కలగడం అయినా వాటిని నిర్లక్ష్యం చేయడం వల్ల పరిస్థితి చేయి దాటిపోతుంది. ఈ వైరస్ వల్ల యోనికి, గర్భాశయానికి మధ్య ఉన్న ప్రాంతంలో క్యాన్సర్ సోకుతుంది. జననాంగాల ప్రాంతంలో శుభ్రత పాటించనివారికి, ఎక్కువమందితో లైంగిక సంబంధాలు పెట్టుకున్న వారికి ఈ క్యాన్సర్ సోకుతుంది. జననాంగాల ప్రాంతంలో శుభ్రత పాటించనివారికి, ఎక్కువమందితో లైంగిక సంబంధాలు పెట్టుకున్నవారికి ఈ క్యాన్సర్ ఎక్కువగా వస్తుంది. ప్రెగ్నెన్సీ సమయంలో వాడే కొన్ని రకాల మాత్రల వల్ల కూడా ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. సెర్వికల్ క్యాన్సర్‌లో ఎక్కువగా స్కమస్ సెల్ కార్సినోనో ఎక్కువగా వస్తుంది.

సెర్వికల్ క్యాన్సర్ సోకినప్పుడు మొదటి రెండు దశల్లో ఆపరేషన్ ద్వారా నయం చేయవచ్చు. రాడికల్ హిస్టరెక్టమీ అనే ఆపరేషన్ ద్వారా గర్భాశయం, యోనిపైభాగం, అండాశయాలు, పెల్వికోనోడ్స్‌ను తొలగిస్తారు. మూడు నాలుగుదశలో గుర్తించినప్పుడు రేడియేషన్, కీమో థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది.

సెర్వికల్ క్యాన్సర్‌కు నాలుగు దశలు ఉంటాయి. వాటిని మనం గుర్తించగలిగితే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ నుండి బయటపడవచ్చు. చాలా సందర్భాల్లో కణితిముదిరే వరకు ఎటువంటి లక్షణాలు కనిపించవు. తొలిదశలో ఉన్న క్యాన్సర్ కణితిని వెతికి పెట్టుకోవడానికి వచ్చిన కొత్త పరికరమే హైడెఫినేషన్ పెట్ స్కేన్ మార్కెట్‌లోకి వచ్చింది. పెట్ స్కాన్ చేయడం వల్ల కొన్ని సందర్భాల్లో ఏది అవసరమో అదే చికిత్స చేయవచ్చు.

క్యాన్సర్‌లో మరో రకం ఎముక క్యాన్సర్. బయటకు కనిపించే శరీరాకృతి అలా నిలబెట్టి ఉంచడానికి తోడ్పడేది ఎముకలే. దానికే క్యాన్సర్ సోకితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. శరీరంలో ఏ భాగానికి క్యాన్సర్ సోకినా చికిత్స వ్యయంతోను, శారీరక,మానసిక శ్రమతోనూ కూడుకున్నదిగా ఉంటుంది. సన్నిహితుల ధైర్యం నూరిపోసి, వెన్నంటి ఉంటే చికిత్స సులువవుతుంది. క్యాన్సర్ ఉందనగానే బెంబేలుపడిపోవడం సహజమే అయినా అది పరిష్కారం కాదు. వ్యాధి లక్షణాలు, తీవ్రత చికిత్సపై సరైన అవగాహన చేసుకుని ధైర్యంగా ముందుకు వెళితే జీవనకాలం పెంచుకోవచ్చు. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే మేలైన జీవనశైలి ముఖ్యం. ఆ విషయాన్నే చాటడానికి ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుంటే మన ఆరోగ్యంతోపాటు ఇతరులను రక్షించినవాళ్లం అవుతాం.



డాక్టర్ శ్రీదేవి గుట్టా
కన్సల్టెంట్ గైనిక్ ఆంకాలజీ
హైదరాబాద్

ఆయుర్వేదంలో పంచకర్మ చికిత్స

క్యాన్సర్ వ్యాధికి ఆయుర్వేదంలో చికిత్స ఉంది. శరీరంలోని కణజాలాన్ని ఆరోగ్యం ఉంచడానికి దోహదపడేవిధంగా చికిత్స అందించాల్సి ఉంటుంది. క్యాన్సర్ సోకినభాగానికి మాత్రమే కాకుండా శరీరవ్యవస్థను సరిదిద్దడం వల్ల మంచి ఫలితాలు ఉన్నాయి. మనసును ప్రశాంతంగా ఉంచడంవల్ల భావోద్వే గాలను అదుపు చేయవచ్చు. మెడిటేషన్, కౌన్సిలింగ్, యోగా, ప్రాణాయామ వల్ల క్యాన్సర్ రాకుండా నిరోధించవచ్చు.



వాత, పిత్త, కఫ దోషాల వల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుంది. పంచకర్మ వల్ల శరీరంలోని విషపదార్థాలను విసర్జితమౌతాయి. జఠరాగ్ని(జీర్ణశక్తి) కార్యకలాపాలు పునరుద్ధరించడం వల్ల మేలు జరుగుతుంది. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పు తక్కువగా తీసుకోవాలి. సిగరెట్, ఆల్కాహాల్‌కి దూరంగా ఉండాలి.



డాక్టర్ బి సంగమేశ్వర్
ఆయుర్వేద వైద్య నిపుణులు
9440065764

ఆక్యుపంక్చర్‌లో చికిత్స

శరీరం మీద ఉన్న ఆక్యుపంక్చర్ పాయింట్స్‌ను గుర్తించినప్పుడు క్యాన్సర్ చికిత్స చేయడానికి సులభతరమౌతుంది. చైనాతో బాటు ఆసియా దేశాల్లో క్యాన్సర్‌కు ప్రత్యేకంగా చికిత్సనందిస్తున్నారు. క్యాన్సర్ వచ్చినవారికి వాంతులు, అలసట, ఆందోళన, కుంగుబాటు, నిద్రలేమి వంటి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి ఈ వ్యాధులకు సంబంధించిన చికిత్సనందిస్తూనే క్యాన్సర్ మీద పోరాటం చేయాలి. చక్కెర, మైదా, ఉప్పుకు బదులుగా బెల్లం, గోధుమపిండి, సైంధవలవణాన్ని వాడాలి. రక్తపోటు ప్రభావం వల్ల శరీరంలోని అవయవాలు దెబ్బతింటాయి. ఇదే సమయంలో క్యాన్సర్ సోకడానికి అవకాశాలు ఎక్కువగా ఉంది.



హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808

హెర్నియా : నిర్లక్ష్యం తగదు

కడుపు గోడలు బలహీనంగా ఉన్నప్పుడు హెర్నియా గుత్తి బయటపడుతుంది. చాలా హెర్నియా కేసుల్లో శస్త్రచికిత్స పరి ష్కార మార్గంగా నిలుస్తుంది. హెర్నియా అనేది వ్యాధి కాదు వాపు మాత్రమే. గజ్జలో కానీ, ఉదరంలో కానీ కండరాలు బలహీనమైనప్పుడు కడుపులోని కొవ్వు, పేగులు వాటిగుండా బయటికి రావడానికి ప్రయత్నిస్తాయి. అప్పుడు బయటికి కనబడే గుత్తిని హెర్నియా అంటారు. తొలిదశలోనే గుర్తించి తొలగిస్తే దీన్నుంచి శాశ్వతంగా విముక్తి పొందొచ్చు. అయితే దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు తప్పదు. హెర్నియా అంటే ఏమిటి? ఎలా వస్తుంది? ఇప్పుడు తెలుసుకుందాం.

నోటి ద్వారా తీసుకున్న ఆహారం అన్నవాహిక నుంచి జీర్ణాశయానికి చేరుకుని జీర్ణమౌతుంది. అక్కడి నుంచి వ్యర్థాలన్నీ పేగుల ద్వారా విసర్జన వ్యవస్థకు చేరతాయి. జీర్ణవ్యవస్థ, విసర్జన వ్యవస్థకు పేగులు అనుసంధానమై ఉంటాయి. వీటిపై పెరిటోనియం అనే పదార్థం ఉంటుంది. దీని పైభాగంలో కండరాలు, వాటిపైన డీప్‌ఫెషియా ఉంటుంది. దీనిపై కొవ్వు, చర్మం ఉంటాయి. ఈ కండరాలు బలహీనంగా ఉండటం వల్ల పేగులు, పెరిటోనియం ఉబ్బి ముందుకు వస్తాయి. ఇలా ఉబ్బిన ప్రాంతంలో చర్మం ఒక సంచిలా కనిపిస్తుంది. దీనినే హెర్నియా అంటారు.నిద్రపోతున్న సమయంలో ఇది లోపలకు వెళ్లిపోతుంది. కొన్నిసార్లు మాత్రం అలాగే ఉండిపోతుంది. పిల్లలు, స్త్రీ, పురుషుల్లో ఏ వయస్సులో ఉన్నవారికైనా ఎప్పుడైనా హెర్నియా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

రకాలు

హెర్నియా సుమారు 20 రకాలు. ఇది ఏ విధంగానైనా రావచ్చు. ప్రధానంగా మూడు రకాల హెర్నియా ఎక్కువగా వస్తుంది. ఇంతకుముందు శస్త్రచికిత్స జరిగిన ప్రదేశంలో వచ్చే వాపును ఇన్‌సిషనల్ హెర్నియా అంటారు. బొడ్డు దగ్గర వచ్చే వాపు అంబెలికల్ హెర్నియా. పిల్లలకు పుట్టుకతో వస్తే దాన్ని కంజెనిటల్ హెర్నియా అంటారు. గజ్జల్లో ఏర్పడితే దాన్ని ఇంగ్వెనల్ హెర్నియాగా గుర్తించాలి. ఇవి కాకుండా హియటస్, ఎపిగ్యాస్ట్రిక్, ఒబ్యురేటర్, స్పిజెలియన్, ఫెమరల్, ఇన్‌డైరెక్ట్, ఇంగ్వైనల్, డైరెక్ట్ ఇంగ్వెనల్ హెర్నియా ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ఇన్‌సిషనల్, అంబెలికల్, ఇంగ్వెనల్ హెర్నియా వస్తున్నాయి. హెర్నియాల్లో స్టాంగ్యులేటెడ్ హెర్నియా చాలా ప్రమాదకరమైంది. పేగు జారిన ప్రదేశం ఎరుపు లేక గులాబీ రంగులోకి మారితే దాన్ని స్టాంగ్యులేటెడ్ హెర్నియాగా గుర్తించాలి. స్త్రీలలో వచ్చేదాన్ని వెంట్రల్ హెర్నియా అంటారు.



కారణాలు

సహజంగా పొత్తికడుపు కొన్ని బలహీన ప్రాంతాలను కలిగి ఉంటుంది. ఇక్కడ పొరలు బలహీనంగా ఉండటంతో హెర్నియావస్తుంది. బరువులు ఎత్తినప్పుడు నొప్పివచ్చినా, దగ్గినా, మలమూత్ర విసర్జనలో సమస్యలు ఉన్నా బలహీనంగా ఉన్న కండరాలు మరింత శక్తిని కోల్పోతాయి. పిల్లల్లో నూటికి ఇరవైమందికి, పెద్దవాళ్లలో నూటికి యాభై మందికి జీవితకాలంలో హెర్నియా వస్తుంది. ఇది కొంతమందిలో త్వరగా బయటపడుతుంది. మరికొందరికి ఆలస్యంగా వస్తుంది. చిన్నారుల్లో కొందరికి రెండు, మూడు నెలలకే హెర్నియా వస్తుంది. ఇంకొంతమందిలో వయస్సుతో పాటు పెరుగుతూ ఉంటుంది. పేగులపైన ఉండే కండరాలు బలహీనపడటంతో కిందకు జారిపోతాయి.

వయస్సు పెరుగుతున్న వారికి హెర్నియా రావచ్చు. స్త్రీ, పురుషుల్లో దీని లక్షణాలు ఒకేలా ఉం టాయి. కొంతమందిలో పేగులు గజ్జల వరకు జారిపోయి అక్కడ ఇరుక్కుపోతాయి. తీసుకున్న ఆహారం ఇందులోకి చేరకపోవడంతో నొప్పి తీవ్రంగా ఉంటుంది. రక్తప్రసరణ ఆగిపోయి పేగు పాడైపోతుంది. వెంటనే శస్త్రచికిత్స చేయకపోతే ప్రాణహాని కలగవచ్చు. ఉదర కిందిభాగం కండరాలపై ఒక్కసారిగా ఒత్తిడి పెరిగినా ఇది వస్తుంది. ఒబెసిటీ ఉన్నా పొగతాగేఅలవాటు ఉన్నా హె ర్నియా రావొచ్చు. ఆరునెలల వయస్సున్న పిల్లలకు ఎక్కువగా అంబెలిక్ హెర్నియా వస్తుంది.

లక్షణాలు

సాధారణంగా హెర్నియా బొడ్డు దగ్గర లేక మర్మావయాలకు కుడి, ఎడమవైపున వస్తుంది. అంతకుముందు శస్త్రచికిత్స జరిగిన ప్రదేశంలోనూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దగ్గినా, బరువులు ఎత్తినా ఈ వాపు ఎక్కువవుతుంది. మల, మూత్ర విసర్జన చేసినప్పుడు ఈ లక్షణం కనిపిస్తుంది. వాపు వచ్చిన ప్రదేశంలో మొదట్లో ఎటువంటి నొప్పి ఉండదు. తర్వాత నొప్పితో పాటు సమస్య తీవ్రంగా ఉంటుంది. బలహీనంగా ఉన్నవారిలో హెర్నియా త్వరగా బయటపడుతుంది. ఊబకాయం ఉన్నవారికి కాస్త ఆలస్యంగా వస్తుంది. నిలబడినప్పుడు గజ్జల భాగం ఉబ్బినట్టుగా ఉండడం, పడుకున్నప్పుడు లోపలికి వెళ్లిపోవడం, గజ్జల భాగంలో తెలియని బాధ ఉంటుంది. వృషణం కిందకి జారిపోతుంది. కడుపులో తిప్పడం, వాంతులు కావడం వంటి లక్షణాలుంటాయి. దగ్గినప్పుడు, వంగినప్పుడు, వ్యాయామం చేస్తున్నప ్పడు సూదితో గుచ్చినట్టు నొప్పి ఎక్కువవుతుంది.

నిర్ధారణ

శరీరంలో హెర్నియా వాపు ఉన్న ప్రదేశాన్ని చూసి డాక్టరు నిర్ధారిస్తారు. ఇతర పరీక్షలేవి ఉండవు. దీని నివారణకు ఎటువంటి మందులూ లేవు. శస్త్రచికిత్స ద్వారా మాత్రమే దీన్ని తొలగించాలి. మొత్తం మూడు రకాల శస్త్రచికిత్సల ద్వారా దీనిని తొలగించవచ్చు. మామూలు ఆపరేషన్‌తో పాటు లాప్రోస్కోపిక్, రోబోటిక్ శస్త్రచికిత్సల ద్వారా హెర్నియా తొలగించవచ్చు. పేగుల వద్ద ఉండే పెరిటోనియం, కండరాలకు మధ్యన ప్రోలీన్ మెష్ ఏర్పాటు చేస్తారు. ఇది మరోసారి హెర్నియా రాకుండా రక్షిస్తుంది. ఈ చికిత్సల్లో కోత ద్వారా చేసే శస్త్రచికిత్స చాలా వరకూ సత్ఫలితాలను ఇస్తుంది. లోపల ఏర్పాటు చేసే మెష్‌ను సరిగ్గా అమర్చడానికి ఈ విధానమే మంచిది. లాప్రోస్కోపిక్ ఆపరేషన్‌లో ఏర్పాటు చేసే మెష్ సరిగ్గా అమర్చకపోవచ్చు. ఇందులో ఎలాంటి తేడాలు వచ్చినా మళ్లీ హెర్నియావచ్చే ప్రమాదం ఉంది. రోబోటిక్ సర్జరీ చాలా ఖర్చుతో కూడుకుంది. సాధారణ శస్త్రచికిత్సలో లోకల్ అనస్తీషియా ఇచ్చి మూడు, నాలుగు అంగుళాల గాటు చేయడం ద్వారా సర్జరీ చేస్తారు. పేషెంట్ ఐదురోజుల్లో ఇంటికివెళ్లిపోవచ్చు. ఆర్థికంగా కూడా పెద్ద భారంకాదు. హెర్నియాను గుర్తించినప్పటికీ నిర్లక్ష్యం చేయడం చాలా ప్రమాదం.



డాక్టర్ ఎంఎ సలీం
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ అండ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్